FOR ADS......
ఆకాంక్ష
CONTACT : 8333818121

తొలి ఆకాంక్ష
తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో
భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్, సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
ఆకాంక్ష akankshanews.com

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :193 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజిలు : 08, వెల. 5రూ/ గురువారం- 05 - మార్చి - 2026

## 12 ఏళ్లకోసారి వచ్చే మహా ఘట్టం - ఇంద్రకీలాద్రిపై 'మహా కుంభాభిషేకం'



విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధిలో అద్భుత ఆధ్యాత్మిక ఘట్టం
మార్చి 6 నుంచి 8 వరకు వేడుకలు
విచ్చేయనున్న కంచి కామకోటి పీఠాధిపతి
ముఖ్యమంత్రి, మంత్రులకు ప్రత్యేక ఆహ్వానాలు

అమరావతి : బెజవాడ దుర్గమ్మ ఆలయం ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక ఘట్టానికి వేదిక కాబోతోంది. అదే 'మహా కుంభాభిషేకం'. ఇది ప్రతి ఏటా వచ్చే పండుగ కాదు. పన్నెండేళ్లకు (పుష్కర కాలం) ఒకసారి మాత్రమే వచ్చే అత్యంత అరుదైన, పవిత్రమైన క్రతువు. ఆగమ శాస్త్రోక్తంగా ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఇంద్రకీలాద్రిపై ఈ మహా యజ్ఞం కన్నుల పండువగా జరగనుంది. ఈ ఉత్సవం కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, మిగతా..2లో

## ఆరంభంలోనే నిప్పులు కక్కుతున్న సూర్యుడు



వడదెబ్బ బారిన పడకుండా ఈ జాగ్రత్తలు తీసుకోండి
మార్చి ఆరంభంలోనే మండిపోతున్న ఎండలు
వరంగల్ జిల్లాలో 36 డిగ్రీలకు చేరుకున్న ఉష్ణోగ్రత
వాతావరణ శాఖ విడుదల చేసిన వెదర్ ఔట్ లుక్ లో వెల్లడి

హైదరాబాద్: ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఎండలు మొదలయ్యాయి. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో ఈ నెల, ఏప్రిల్ , మే నెలల్లో పరిస్థితి ఏమిటనే ఆందోళన మొదలైంది. వరంగల్ జిల్లా దోర్నకల్ లో ఉష్ణోగ్రత మంగళవారం 36 డిగ్రీలకు చేరుతుంది. గత వారం రోజుల నుంచి ఉక్కపోత అధికంగా ఉండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరి రానున్న రోజుల్లో పగలు, రాత్రి వేళల్లో సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని మిగతా..2లో

## రాష్ట్రంలో 25 వేల మంది బోగస్ ఉద్యోగులు



- నకిలీ ఉద్యోగులను సృష్టించిన ఏజెన్సీలపై ఆడిట్ చేసి కేసులు పెట్టాలని ఆదేశం
- మార్చి 6 నుంచి 99 రోజుల పాటు 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం
- ఇసుక మాఫియా, అక్రమ మైనింగ్‌పై కఠినంగా లేకుంటే కలెక్టర్లపై చర్యలని హెచ్చరిక

2

## ఇవి మనిషి సృష్టించిన తీవ్ర విషాదాలు

- ఇరాన్‌లోని పాఠశాలపై మిస్సైల్ దాడిలో 165 మంది విద్యార్థినులు మృతి
- తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన కేటీఆర్
- ఈ యుద్ధాలు రాబోయే తరాలకు తీరని శోకాన్ని మిగిలిస్తాయని వ్యాఖ్య



హైదరాబాద్ : ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా జరుపుతున్న దాడులు తీవ్రరూపం దాల్చాయి. దక్షిణ ఇరాన్‌లోని మినాబ్ పట్టణంలో ఉన్న 'షజ్రే తయ్యెబా' బాలికల ప్రాథమిక పాఠశాలపై జరిగిన మిస్సైల్ దాడిలో 165 మంది విద్యార్థినులు మరణించారన్న వార్త ప్రపంచవ్యాప్తంగా విషాదం కలిగించింది. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల శిథిలాల కింద చిక్కుకుని మరణించిన ఆ 165 మంది బాలికల సామూహిక అంత్యక్రియలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను కేటీఆర్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. యుద్ధం వెనుక కారణాలు ఏవైనా, ఇలాంటి మారణహోమాలు మనిషి సృష్టించిన తీవ్ర విషాదాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యుద్ధాలు రాబోయే తరాలకు కేవలం తీరని శోకాన్ని, వినాశనాన్ని మాత్రమే మిగుల్చుతాయని కేటీఆర్ హెచ్చరించారు.

## ఖఐఏఎస్, ఐపీఎస్‌లను బెదిరిస్తున్నారు

ముఖ్యమంత్రిపై హరీశ్ రావు సంచలన ఆరోపణలు

- ముఖ్యమంత్రికి పరిపాలన చేయడం రావడం లేదని విమర్శ
- ఐపీఎస్, ఐఏఎస్‌లను పదేపదే బదిలీ చేస్తున్నారన్న హరీశ్ రావు
- రెండున్నరేళ్లలై దుసార్లు భారీ ఎత్తున బదిలీ చేశారన్న హరీశ్ రావు



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐఏఎస్, ఐపీఎస్‌లను బెదిరిస్తున్నారంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. కలెక్టర్ల సదస్సులో ఆయన బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని ఆరోపించారు. మిగతా..2లో

## శ్రీలంక తీరంలో ఇరాన్ నౌకపై సబ్‌మెరైన్ దాడి.. 101మంది గల్లంతు



2

- ఇజ్రాయెల్-అమెరికా కూటమి, ఇరాన్ మధ్య యుద్ధంతో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ శ్రీలంక దక్షిణ తీరంలో ఇరాన్‌కు చెందిన నౌకపై జలాంతర్గామి దాడి జరిగింది. ఈ దాడిలో 101 మంది గల్లంతయ్యారు.

కొలంబో: ఇజ్రాయెల్-అమెరికా కూటమి, ఇరాన్ మధ్య యుద్ధంతో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ శ్రీలంక దక్షిణ తీరంలో ఇరాన్‌కు చెందిన నౌకపై జలాంతర్గామి దాడి జరిగింది

## ప్రజలను ప్రేమించే నేను కావాలా? ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని నడిపే స్టాలిన్ కావాలా?

- అధికార డీఎంకే, సీఎం స్టాలిన్‌పై విరుచుకుపడ్డ విజయ్
- ఇప్పటికే తన అభిమానులు ఎన్నికల ప్రచారం మొదలుపెట్టేశారని వ్యాఖ్యలు



ఢిల్లీ : తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌పై తమిళగ వెట్రి కజగం (టీవీకే) చీఫ్ విజయ్ తీవ్ర విమర్శలు చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను ప్రేమించే విజయ్ కావాలా? లేదా ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని నడిపే స్టాలిన్ సర్ కావాలా? అని ప్రజలను కోరారు. సీఎం స్టాలిన్ తనను సైలెంట్‌గా ఉంచడానికి ప్రయత్నించినప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంట్లో ఉన్న విజయ్‌లను (అభిమానులు, కార్యకర్తలనుద్దేశించి) నిశబ్దంగా ఉంచలేరని ఎద్దేవా చేశారు. తంజావూరులో జరిగిన బహిరంగ సభలో విజయ్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "తాను నటించిన జననాయగన్ చిత్రానికి మద్దతు ప్రకటించినందుకు సీఎం స్టాలిన్‌కు ధన్యవాదాలు. తమిళనాడు త్వరలో టీవీకే సర్కార్ అధికారంలోకి వస్తుంది. మిగతా..2లో

## మోదీ పర్యటన తర్వాత ఇరాన్‌పై దాడులు.. ఇజ్రాయెల్ రాయబారి ఏమన్నారంటే..

- ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేయడానికి రెండు రోజుల ముందు భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించారు.
- ఫిబ్రవరి 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు మోదీ పర్యటన సాగింది.



ఇరాన్ - ఇజ్రాయెల్ దేశాల మధ్య గత ఐదు రోజుల నుంచి యుద్ధం నడుస్తోంది. ఫిబ్రవరి 28వ తేదీన ఇజ్రాయెల్, అమెరికా దళాలు సంయుక్తంగా ఇరాన్‌పై బాంబు దాడులు చేశాయి. ఇరాన్ నాయకులే లక్ష్యంగా టెహ్రాన్‌లోని 30 చోట్ల బాంబు దాడులు జరిగాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ, ఆయన భార్య, కూతురు, అల్లుడు, మనవడు ప్రాణాలు కోల్పోయారు. శనివారం జరిగిన దాడుల్లో ఖమేనీ చనిపోగా.. మరుసటి రోజు ఈ విషయాన్ని ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. ఇజ్రాయెల్, అమెరికాలపై ప్రతి దాడులకు దిగింది.

ప్రధాని పర్యటన ముగిసిన రెండు రోజులకు..

ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేయడానికి రెండు రోజుల ముందు భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించారు. మిగతా..2లో

## సత్తెనపల్లిలో నాకున్న 22 ఎకరాల పొలాన్ని సర్వే చేయాలని నోటీసులు ఇచ్చారు



2

- తన ఆస్తులను లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నారన్న అంబటి
- చంద్రబాబు, లోకేశ్ కు వేరే పనేం లేదా అని ప్రశ్న
- గుంటూరులోని తన నివాసానికి కూడా నోటీసులు ఇచ్చినా ఆశ్చర్యపోనని వ్యాఖ్య

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ కక్ష సాధింపు చర్యలు మితిమీరిపోయాయని, కూటమి ప్రభుత్వం తన ఆస్తులను లక్ష్యంగా చేసుకుని వేధిస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత అంబటి రాంబాబు ఆరోపించారు.

## వర్సిటీల్లో 3,371 పోస్టులు ఖాళీ
## 3 నెలల్లో యుద్ధప్రాతిపదికన భర్తీ



- పాఠశాల విద్యాశాఖ, ఉన్నత విద్యాశాఖ బడ్జెట్ డిమాండ్లపై అసెంబ్లీలో మాట్లాడిన మంత్రి నారా లోకేశ్
- 2019-24 మధ్య విద్యాశాఖలో తీవ్ర విధ్వంసం జరిగిందని, 10 లక్షల మంది విద్యార్థులు బడులకు దూరమయ్యారని వెల్లడి

అమరావతి : విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అలానే ఆంధ్రా మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రపంచానికి చూపిస్తామని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ బడ్జెట్ రూ.32,308 కోట్లు, ఉన్నత విద్యాశాఖ రూ.2,566 కోట్ల బడ్జెట్ డిమాండ్లపై మంత్రి అసెంబ్లీలో మాట్లాడారు. 2019-24 మధ్య విద్యాశాఖలో తీవ్ర విధ్వంసం జరిగిందని, 10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడులకు దూరమయ్యారని మండిపడ్డారు. మిగతా..2లో

## మంత్రి ఆనంపైకి దూసుకొచ్చిన వైఎస్సార్సీపీ సభ్యులు

మండలిలో గందరగోళం



- శ్రీవారి లడ్డూ అంశంపై శాసనమండలిలో వాగ్వాదం
- మంత్రి ఆనం పైకి దూసుకొచ్చిన వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ మాధవరావు
- మంత్రుల జోక్యంతో సర్దుమణిగిన ఇరువర్గాల మధ్య ఘర్షణ

అమరావతి : తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం పై దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మిగతా..2లో

మొదటి పేజీ తరువాయి

## సత్తెనపల్లిలో నాకున్న 22 ఎకరాల పొలాన్ని సర్వే చేయాలని నోటీసులు ఇచ్చారు

తన కుటుంబంపై జరిగిన దాడులను రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సత్తెనపల్లిలో తనకు ఉన్న 22 ఎకరాల పొలాన్ని సర్వే చేయాలంటూ ఎమ్మార్వో కార్యాలయం నుంచి నోటీసులు ఇచ్చారని ఆయన తెలిపారు. రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేస్తున్నామని రెవెన్యూ సిబ్బంది తనకు చెప్పారని వెల్లడించారు. తన పొలంలో ఉన్న స్విమ్మింగ్ పూల్, గెస్ట్ హౌస్‌ను సాకుగా చూపి తనను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. "సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు నా ఆస్తులపై పడటం తప్ప వేరే పనేం లేదా?" అని ఆయన నిలదీశారు. తాను ఆ పొలాన్ని చట్టబద్ధంగా కొనుగోలు చేశానని, తాను కొనకముందే అందులో ఒక చిన్న బావి, పెంకుటిల్లు ఉన్నాయని స్పష్టం చేశారు. తన వద్ద దాపరికాలు లేవని, చంద్రబాబు లేదా లోకేశ్ ఎవరైనా వచ్చి తన పొలాన్ని చూసుకోవచ్చని సవాల్ విసిరారు. తనను భయపెట్టడానికే ఈ నోటీసులు ఇస్తున్నారని, రేపు తన గుంటూరు నివాసానికి కూడా నోటీసులు ఇచ్చినా ఆశ్చర్యపోనని వ్యాఖ్యానించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలని అంబటి రాంబాబు హితవు పలికారు.

## ఐఏఎస్, ఐపీఎస్‌లను బెదిరిస్తున్నారు

ఆయన మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రికి పరిపాలన చేయడం రావడం లేదని విమర్శించారు. ఐఏఎస్, ఐపీఎస్‌లను పదేపదే బదిలీ చేస్తున్నారని మండిపడ్డారు. రెండున్నరేళ్లలోనే ఐదుసార్లు భారీ ఎత్తున అధికారులను బదిలీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తరచూ బదిలీలతో పాలన కుంటుపడుతోందని అన్నారు. పరిస్థితులను అర్థంచేసుకునే లోపే అధికారులను బదిలీ చేస్తున్నారని విమర్శించారు. జీహెచ్ఎంసీ కమిషనర్లు కూడా రెండున్నరేళ్లలో నలుగురు మారారని తెలిపారు. ముఖ్యమంత్రి లేదా మంత్రులకు నచ్చకపోతే ఆ అధికారులను వెంటనే బదిలీ చేస్తున్నారని ఆరోపించారు. కొందరికి పోస్టింగులు ఇచ్చి జాయిన్ చేసుకోవడం లేదని విమర్శించారు. త్వరలో కాంగ్రెస్ నేతల అవినీతిని, బినామీలను బయటపెడతామని హెచ్చరించారు.

## రాష్ట్రంలో 25 వేల మంది బోగస్ ఉద్యోగులు

హైదరాబాద్ : రాష్ట్రంలో సుమారు 25 వేల మంది బోగస్ ఉద్యోగులు ఉన్నారని, వారంతా కనీసం ఆధార్ కార్డు కూడా లేకుండా ఏళ్లుగా జీతాలు తీసుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి సంచలన విషయం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో ఉన్న 1.70 లక్షల మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల్లో ఈ నకిలీ ఉద్యోగులను గుర్తించినట్లు తెలిపారు. ఇలాంటి బోగస్ ఉద్యోగులను సృష్టించి ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై సమగ్ర ఆడిట్ చేయించి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆర్థిక శాఖ అధికారులను ఆయన తీవ్రంగా ఆదేశించారు. కలెక్టర్లు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని అమలు చేయడంపై ఆయన దిశానిర్దేశం చేశారు. గ్రామ సర్పంచులు, మున్సిపల్ ఛైర్మన్లు, మేయర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల భాగస్వామ్యంతో ఈ ప్రణాళికను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఈ నెల 12న జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి జిల్లాకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని నోడల్ అధికారిగా నియమించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక ఆదేశాలు, హెచ్చరికలు జారీ చేశారు. ధాన్యం సేకరణలో మోసాలకు పాల్పడే మిల్లర్ల పట్ల కఠినంగా వ్యవహరించాలని, వారి నుంచి ధాన్యాన్ని వెనక్కి రాబట్టాల్సిన పూర్తి బాధ్యత కలెక్టర్లదేనని స్పష్టం చేశారు. ఇసుక మాఫియా, అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం మోపాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కలెక్టర్లు, ఎస్పీలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. భూభారతి దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని, ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, దానికి సంబంధించిన కార్యక్రమాలను ఒక వేడుక వాతావరణంలో జరపాలని సీఎం అధికారులను ఆదేశించారు.

## శ్రీలంక తీరంలో ఇరాన్ నౌకపై సబ్‌మెరైన్ దాడి.. 101మంది గల్లంతు

. ఈ దాడిలో 101 మంది గల్లంతయ్యారు. మరో 78 మంది గాయపడినట్టు శ్రీలంక నేవీ, రక్షణ మంత్రిత్వ శాఖ వర్గాలు బుధవారంనాడు తెలిపాయి. వీరిలో 32 మంది పరిస్థితి తీవ్రంగా ఉందని పేర్కొన్నాయి. కాగా, 180 మందితో ఉన్న ఐఆర్ఐఎస్ దేనా నౌక మునిగిపోతున్నట్టు తమకు సమాచారం రావడంతో వెంటనే సహాయక సిబ్బందిని రంగంలోకి దించినట్టు విదేశాంగ మంత్రి విజిత హెరాథ్ తెలిపారు. నౌక వేగంగా మునిగిపోతున్న సమయంలో 32 మందిని సిబ్బంది రక్షించారు. గాలె నగర సమీపంలో దక్షిణ తీరానికి కొద్ది దూరంలో ఈ దాడి జరిగింది. క్షతగాత్రులను గాలెలోని స్థానిక ఆసుపత్రికి తరలించారు. సబ్‌మెరైన్‌తో దాడి జరిపిందెవరనేది వెంటనే వెల్లడి కాలేదు. ఐఆర్ఐఎస్ దేనా నౌక విశాఖపట్నంలో జరిగిన నావికా విన్యాసాల్లో పాల్గొని తిరిగి వెళ్తుండగా ఈ ఘటన జరిగినట్టు తెలుస్తోంది.

## ప్రజలను ప్రేమించే నేను కావాలా? ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని నడిపే స్టాలిన్ కావాలా?

మత్స్యకారులారా ఆశాజనకంగా ఉండండి. మీ రక్షణ పూర్తి హామీ ఇస్తాం. స్టాలిన్ నన్ను మౌనంగా ఉంచడానికి ప్రయత్నించవచ్చు. కానీ రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో ఉన్న విజయ్‌లను మీరు మౌనంగా ఉంచలేరు. వారు ఇప్పటికే తమ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు" అని విజయ్ పేర్కొన్నారు.

## మోదీ పర్యటన తర్వాత ఇరాన్‌పై దాడులు.. ఇజ్రాయెల్ రాయబారి ఏమన్నారంటే..

ఫిబ్రవరి 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు మోదీ పర్యటన సాగింది. మోదీ పర్యటన ముగిసిన సరిగ్గా రెండు రోజులకు.. ఫిబ్రవరి 28వ తేదీన ఇజ్రాయెల్.. ఇరాన్‌పై దాడి చేసింది. ఈ విషయం ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో పలు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న చర్చ, సోషల్ మీడియా ప్రచారాలపై స్పందించారు. రూవెన్ అజర్ మాట్లాడుతూ.. 'అదొక ఆపరేషనల్ అవకాశం మాత్రమే. ప్రధాని మోదీ వెళ్లిపోయిన తర్వాత ఆ అవకాశం వచ్చింది. మోదీ పర్యటన సందర్భంగా ఆయనతో దేశాభివృద్ధి గురించి మాత్రమే మాట్లాడాము. ఈ విషయం గురించి ఆయనతో చర్చించలేదు. దాడులు చేస్తామని ఆ సమయానికి మాకు కూడా తెలీదు. మోదీ వెళ్లిపోయిన తర్వాత ఇరాన్‌పై దాడి చేయాలా? వద్దా? అన్నదానిపై నిర్ణయం తీసుకోవడానికి రెండు రోజుల సమయం పట్టింది. ఇరాన్‌పై దాడులకు ఫిబ్రవరి 28వ తేదీ ఉదయం సెక్యూరిటీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆ తర్వాతే దాడులు జరిపాము. దాడులకు చాలా కాలం ముందునుంచే మేము అమెరికాతో సంప్రదింపులు జరుపుతూ ఉన్నాము. సరైన సమయం కోసం ఎదురు చూస్తూ ఉన్నాము' అని చెప్పుకొచ్చారు.

## శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌకను కూల్చేశాం.. అమెరికా సంచలన ప్రకటన



ఢిలీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ అమెరికా రక్షణ శాఖ కీలక ప్రకటన చేసింది. శ్రీలంక సమీపంలోని హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తున్న ఇరాన్ యుద్ధనౌకను తమ సబ్‌మెరైన్ సాయంతో పేల్చివేసినట్లు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ధృవీకరించారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఓ శత్రు దేశానికి చెందిన యుద్ధనౌకను అమెరికా సబ్‌మెరైన్ టార్పెడోతో ధ్వంసం చేయడం ఇదే తొలిసారి అని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ నౌకాదళానికి చెందిన అత్యాధునిక ఫ్రిగేట్ ఐరిస్ దేనా న అమెరికా నేవీకి చెందిన సబ్‌మెరైన్ నుంచి ప్రయోగించిన టార్పెడో ద్వారా దాడి చేసినట్లుగా పెంటగాన్ ప్రకటించింది. శ్రీలంకలోని గాలే నగరానికి సుమారు 44 నాటికల్ మైళ్ల దూరంలో అంతర్జాతీయ జలాల్లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సందర్భంగా పెంటగాన్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పీట్ హెగ్సెత్ (గ్రావవ ఎవస్త్రంవ్ష్ట) మాట్లాడుతూ.. అంతర్జాతీయ జలాల్లో తాము సురక్షితంగా ఉన్నామని భావించిన ఇరాన్ యుద్ధనౌకను అమెరికన్ సబ్‌మెరైన్ ముంచివేసిందని అన్నారు. టార్పెడో ద్వారా దాడి చేశామని అన్నారు. శత్రువులకు ఎక్కడా రక్షణ లేదని నిరూపించడమే తమ లక్ష్యమని పీట్ హెగ్సెత్ హెచ్చరించారు. అయితే, ఇరాన్‌కు చెందిన ఐరిస్ దేనా నౌకలో సుమారు 180 మంది సిబ్బంది ఉన్నట్లుగా సమాచారం. శ్రీలంక (ాతీఅశ్రీఖఅఝ) నౌకాదళం చేపట్టిన సహాయక చర్యల్లో ఇప్పటి వరకు 32 మందిని రక్షించగా.. మరో 28 మృతదేహాలను వెలికితీశారు. సుమారు 100 మందికి పైగా సిబ్బంది గల్లంతైనట్లుగా తెలుస్తోంది. ఈ నౌక భారత్‌లోని విశాఖపట్నంలో జరిగిన 'మిలాన్-2026' విన్యాసాల్లో పాల్గొని తిరిగి వెళ్తుండగా ఈ దాడి జరిగినట్లుగా ప్రాథమికంగా సమాచారం అందుతోంది.

## వర్సిటీల్లో 3,371 పోస్టులు ఖాళీ - 3 నెలల్లో యుద్ధప్రాతిపదికన భర్తీ

మొదటి పేజీ తరువాయి

అన్ని సబ్జెక్టుల్లోనూ విద్యార్థుల్లో ప్రమాణాలు దారుణంగా పడిపోయాయని, అక్షరాస్యత విషయంలో ఏపీని అట్టడుగు స్థానానికి చేర్చారని దుయ్యబట్టారు. ఐబీ, సీబీఎస్ఈ సిలబస్, టోఫెల్ పేరుతో ప్రకటనలు, ప్రచారం తప్ప ఒక్క పనీ సరిగా చేయలేదని మంత్రి లోకేశ్ అన్నారు. నాడు-నేడు పేరుతో ప్రచార అర్భాటం తప్ప పనులు జరగలేదని విమర్శించారు. ఈ ఏడాది బడ్జెట్లో రూ.1200 కోట్లు కేటాయించామని వెల్లడించారు. ఏపీలో 100 శాతం అక్షరాస్యత సాధించేలా ప్రత్యేక ప్రాజెక్టు చేపట్టామని తెలిపారు. విద్యార్థులను యాక్టివ్ లెర్నర్లుగా మార్చేందుకు క్లిక్కర్ టెక్నాలజీ తెచ్చామని 300కు పైగా పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టును త్వరలో రాష్ట్రమంతా అమలు చేస్తామని చెప్పారు. లీప్ యాప్ ద్వారా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పిల్లల్ని అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. స్కూల్ కిట్లు, చిక్కీలు, గుడ్ల సరఫరాలో అవినీతి నివారించి రూ.1000 కోట్లు ఆదా చేస్తున్నట్లు మంత్రి లోకేశ్ చెప్పారు.

### వర్సిటీల్లో 3,371 పోస్టులు ఖాళీ - 3 నెలల్లో యుద్ధప్రాతిపదికన భర్తీ: మంత్రి లోకేశ్

జీతభత్యాలు, సౌకర్యాలు ఏమీ లేకుండా నైతిక విలువలు పెంచటం బాధ్యతగా తీసుకున్న చాగంటి కోటేశ్వరరావుని సభాముఖంగా అభినందించారు. మా సొంత పిల్లలకు ఏం చేస్తామో అందరు పిల్లలకు అలాంటి సౌకర్యాలు ఉండాలని భావిస్తున్నట్లు స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ హయాంలో యూనివర్సిటీలను రాజకీయ కేంద్రాలుగా మార్చటం, తమ బంధువుల్ని వీసీలుగా రిజిస్ట్రార్లుగా నియమించటం ద్వారా ఉన్నత విద్యారంగాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు. తన కుమారుడు దేవాన్ష్ ను బ్రాహ్మణి ఫోన్ కు దూరంగా ఉంచి పుస్తకాలు చదవటం అలవాటు చేసిందని అన్నారు. అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు కోసం శోభా రియాల్టీ వారు రూ.100 కోట్లు సీఎస్సార్ నిధులు సెంట్రల్ లైబ్రరికి ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, సుందరపు విజయ్ కుమార్ విద్యారంగంపై



మాట్లాడారు. 3 నెలల్లో యుద్ధప్రాతిపదికన భర్తీ: విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వచ్చే 3 నెలల్లో యుద్ధప్రాతిపదికన భర్తీ చేస్తామని మంత్రి లోకేశ్ ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో 3,371 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని వీటి భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఉన్నత న్యాయస్థానంలో పెండింగ్ లో ఉన్న కేసులను పరిష్కరించి 3 నెలల్లో అవసరమున్న ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల సంఖ్య, ఆయా ఖాళీలను ఎప్పటిలోగా పూర్తి చేస్తారని మండలిలో సభ్యుడు బొర్రా గోపిమూర్తి అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు సమాధానం ఇచ్చారు. ఖాళీల భర్తీకి 2018, 2023లో నోటిఫికేషన్ ఇచ్చారని వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్ పాటించకపోవడంతో 2023 నోటిఫికేషన్ ను కోర్టు తప్పుబట్టినందున సదరు ప్రక్రియ నిలిచిపోయిందని తెలిపారు. ఇప్పటికే మేం ఏఏజీతో 3 సార్లు సమావేశమై పూర్తిస్థాయిలో చర్చించామని నూతన నోటిఫికేషన్ ఇవ్వాలని మేం నిర్ణయం తీసుకున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు.

## 12 ఏళ్లకోసారి వచ్చే మహా ఘట్టం – ఇంద్రకీలాద్రిపై 'మహా కుంభాభిషేకం'

మొదటి పేజీ తరువాయి

కనకదుర్గమ్మ ఆలయానికి ఒక 'పునర్జన్మ' లాంటిది. దైవిక శక్తిని తిరిగి మేల్కొలిపి, ఆలయానికి పునర్జీవం పోసే ఈ మహా కుంభాభిషేక వేడుకల కోసం ఇంద్రకీలాద్రి సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. 12 ఏళ్లకు ఒకసారే ఎందుకు? : మహా కుంభాభిషేకానికి హిందూ ధర్మంలో, ఆగమ శాస్త్రాల్లో ఎంతో విశిష్టత ఉంది. దేవాలయాల్లో ప్రతిష్ఠించిన మూలవిరాట్ (విగ్రహాలు) ఎంతో శక్తివంతమైనవి. అయితే నిత్యం జరిగే పూజలు, అభిషేకాలు, లక్షలాది మంది భక్తుల తాకిడి వల్ల కాలక్రమేణా ఆ విగ్రహాలు తమ దైవిక శక్తిని కొంతమేర కోల్పోతాయని శాస్త్రాలు చెబుతున్నాయి. సరిగ్గా 12 ఏళ్లకు ఒకసారి ఆ దైవిక శక్తిని, చైతన్యాన్ని తిరిగి విగ్రహాల్లోకి నింపే పవిత్ర ప్రక్రియే ఈ 'కుంభాభిషేకం'. మన శరీరానికి ధ్యానం ఎంత అవసరమో, ప్రాణశక్తిని నిలపడానికి ఆలయానికి ఈ క్రతువు అంతే ప్రాణాధారం అని వేద పండితులు వివరిస్తున్నారు.

### 12 ఏళ్లకోసారి వచ్చే మహా ఘట్టం - ఇంద్రకీలాద్రిపై 'మహా కుంభాభిషేకం'

ప్రకృతిని శుద్ధి చేసే మహా యజ్ఞం : ఈ మూడు రోజుల పాటు ఇంద్రకీలాద్రిపై ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగనున్నాయి. యజ్ఞం చేయడం ద్వారా గాలిని శుద్ధి చేస్తారు. హోమం ద్వారా అగ్నిని పవిత్రం చేస్తారు. మంత్రోచ్ఛారణల ద్వారా ఆకాశాన్ని (శూన్యాన్ని) శుద్ధి చేస్తారు. ఇలా చేయడం వల్ల ఆలయ పరిసరాల్లో ఉన్న ప్రతికూల శక్తులన్నీ తొలగిపోయి, సానుకూల శక్తి వెల్లివిరుస్తుంది. ఈ ఘట్టం ఈనెల 6వ



తేదీ ఉదయం నుంచి అధికారికంగా ప్రారంభమవుతుంది. తొలిరోజు విఘ్నేశ్వరుడికి విశేష పూజలు చేస్తారు. అనంతరం పుణ్యాహవచనం, దీక్షాధారణ చేపడతారు. అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపనతో యజ్ఞశాల కార్యక్రమాలు శాస్త్రోక్తంగా మొదలవుతాయి. దేశంలోని పుణ్య నదుల నుంచి, సప్త సముద్రాల నుంచి సేకరించిన పవిత్ర జలాలతో అమ్మవారికి మంత్రమయ తర్పణాలు అర్పిస్తారు. "రాష్ట్ర ప్రభుత్వ సలహాలు, సూచనల మేరకు 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ మహా కుంభాభిషేకం కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నాం. సీనియర్ అర్చక స్వాములు, ప్రముఖ పీఠాధిపతులు, వేద పండితుల సమక్షంలో ఈ పవిత్ర కార్యక్రమం జరుగుతుంది. ఈ మూడు రోజుల్లో సుమారు లక్ష నుంచి లక్షన్నర మంది భక్తులు ఇంద్రకీలాద్రికి వస్తారని అంచనా వేస్తున్నాం. ఆ రద్దీకి తగ్గట్టుగా ఏర్పాట్లు చేశాం. భక్తులు కుంభాభిషేక కార్యక్రమాన్ని ఎక్కడినుంచైనా సౌకర్యవంతంగా వీక్షించడానికి వీలుగా కొండపై, కింద భారీ ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేస్తున్నాం. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం." - బొర్రా రాధాకృష్ణ గాంధీ, దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ మార్చి 8న ప్రధాన ఘట్టం : ఈ కుంభాభిషేక మహోత్సవంలో ప్రధానమైన ఘట్టం మార్చి 8వ తేదీన జరగనుంది. ఆ రోజు ఉదయం 9:34 గంటలకు దివ్యమైన మేష లగ్నంలో ఈ మహా క్రతువు జరుగుతుంది. ఆలయ విమాన గోపురంపై ఉన్న 'బంగారు కలశానికి' పండితులు మహా కుంభాభిషేకం నిర్వహిస్తారు. కుంభాభిషేక సమయంలో గర్భాలయంలోని అమ్మవారి దైవ శక్తిని పండితులు తాత్కాలికంగా ఆ కలశాల్లోకి ఆవాహన చేస్తారు. అందుకే ఆ కలశానికి చేసే అభిషేకాన్ని కళ్లారా వీక్షించడం ఎన్నో జన్మల పుణ్యఫలంగా భక్తులు భావిస్తారు. కుంభాభిషేకం నేపథ్యంలో దుర్గగుడి పాలకమండలి భారీ ఏర్పాట్లు చేసింది. భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సర్వ సన్నద్ధం అయ్యారు. ఈ వేడుకకు కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి విచ్చేస్తున్నారు. ఆయన చేతుల మీదుగా భక్తులకు అనుగ్రహ భాషణం జరగనుంది. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర ప్రముఖులకు ఆలయ అధికారులు స్వయంగా వెళ్లి ఆహ్వాన పత్రికలు అందజేశారు. "కంచి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరగబోతోంది. ఇది 'మినీ దసరా' ఉత్సవాల్లాగే ఉండబోతోంది. భక్తులకు ఏ చిన్న ఇబ్బంది కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాం. కనకదుర్గా నగర్ నుంచి, అలాగే ఘాట్ రోడ్డు వైపు నుంచి భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశాం. వృద్ధులకు, విభిన్న ప్రతిభావంతులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రత్యేక దర్శన ఏర్పాట్లు ఉన్నాయి. రద్దీని నియంత్రించేందుకు దాదాపు 1000 నుంచి 1500 మంది పోలీసు సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశాం. భక్తులకు లడ్డూ ప్రసాదం కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నాం.

## మంత్రి ఆనంపైకి దూసుకొచ్చిన వైఎస్సార్సీపీ సభ్యులు - మండలిలో గందరగోళం

మొదటి పేజీ తరువాయి

ప్రకటన ఇచ్చే సమయంలో వైఎస్సార్సీపీ సభ్యులు దురుసుగా ప్రవర్తించారు. వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ మాధవరావు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పైకి దూసుకొచ్చారు. ఎమ్మెల్సీ మాధవరావుకు మద్దతుగా ఇతర వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు సైతం ఆనం వైపు కదిలారు. కోపంతో ఊగిపోయిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్సీ మాధవరావుకు ఎదురెళ్లారు. దాంతో ఎమ్మెల్సీలు బృందాలుగా ఏర్పడి ఎదురెదురుగా దూసుకెళ్లారు. చివరకు మంత్రులు జోక్యం చేసుకుని ఇరువర్గాలకు సర్ది చెప్పారు. అసలేం జరిగిందంటే?: తిరుమల ప్రసాదం కల్తీపై శాసనమండలిలో ప్రకటనకు సంబంధించిన కరపత్రాలను ప్రభుత్వం సభ్యులకు పంపిణీ చేసింది. కల్తీపై సమగ్ర వివరాలతో కూడిన 20 పేజీల ప్రకటన పంపిణీ చేశారు. లడ్డూ చారిత్రక నేపథ్యం, ప్రామాణిక పదార్థాలు, పోటు-మిరాసీ వ్యవస్థ అంశాలను ప్రకటనలో వివరించారు. 2014-19 మధ్య టెండర్ నిబంధనలు 2020లో నిబంధనల సడలింపు సవివరంగా వివరించారు. అంతేకాకుండా మారిన టెండర్ నివేదికలో మార్పులను ప్రభుత్వం స్పష్టం చేసింది. నాటి అదనపు ఈవో ధర్మారెడ్డి, ఈవో అనీల్ కుమార్ సింఘాల్ సిఫార్సులపై అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిబంధనల సడలింపును అప్పటి బోర్డు ఆమోదించిందని ప్రభుత్వం తెలిపింది. నెయ్యి కల్తీ గుర్తింపు, ల్యాబ్ నివేదికలను వివరించారు. నివేదిక ఆధారంగా ప్రసాదం కల్తీ జరిగిందని కేసు నమోదు చేసి సమగ్ర విచారణకు ఆదేశించినట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఛార్జ్ షీట్ దాఖలు, చట్టపరమైన చర్యలు ప్రకటనలో వివరించారు. 2020లో టీటీడీ ఛైర్మన్ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న కల్తీ నెయ్యి సరఫరాదారులను బెదిరించి, అంగీకరించని వారిని తనిఖీల పేరుతో లొంగదీసుకుని 4.69 కోట్లు లంచం రూపంలో తీసుకున్నట్లు విచారణలో రుజువైందని ప్రభుత్వం ఈ సందర్భంగా తెలిపింది. మొత్తం 36 మంది నిందితుల్లో భోలేబాబా ఉద్యోగులు ఆశిశ్ రోహిలా, మహేశ్ కుమార్ రోహిలా, బత్తుల సురేంద్రనాథ్ నేరాన్ని అంగీకరించారని వెల్లడించారు. వీరితోపాటు విజయభాస్కర్ రెడ్డి అనే డెయిరీ నిపుణుడు సైతం తప్పుడు సలహాలు ఇచ్చి రూ. 75 లక్షల ఆర్థిక లబ్ది పొందినట్లు తెలిపారు. దాంతో ఏకసభ్య కమిటీ సిఫార్సులు వ్యవస్థాగత సంస్కరణలు పై ఇచ్చే నివేదిక ఆధారంగా తదనంతర చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది. వైఎస్సార్సీపీ సభ్యుల దురుసు ప్రవర్తన: శాసనమండలిలో బుధవారం తిరుమల



లడ్డూ ప్రసాదంపై చర్చ కొనసాగింది. అయితే ఈ క్రమంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటన ఇచ్చే సమయంలో వైఎస్సార్సీపీ సభ్యులు తమ విచక్షణను కోల్పోయి ప్రవర్తించారు. సభా మర్యాదలను అతిక్రమించి వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ మాధవరావు ఆనంపైకి దూసుకొచ్చారు. దీనికితోడు మద్దతుగా ఇతర వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు వచ్చారు. ఆనం సైతం ఏ మాత్రం వెనకడుగు వేయకుండా సభ్యులవైపు వెళ్లగా మంత్రులు జోక్యం చేసుకుని వాగ్వాదాన్ని నిలువరించారు.

## ఆరంభంలోనే నిప్పులు కక్కుతున్న సూర్యుడు

మొదటి పేజీ తరువాయి

తాజాగా వాతావరణ శాఖ విడుదల చేసిన వెదర్ ఔట్ లుక్ లో ప్రకటింది. ఈ నేపథ్యంలో ఈటీవీ-భారత్ ప్రత్యేక కథనం. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి ఒక నెల ముందుగానే సూర్యుడు సెగ కక్కుతున్నాడు. ఉదయం 11 దాటాక వీధులు నిర్మానుష్యంగా కనబడుతున్నాయి. దీంతో ఎండలో బయటకు రావడానికి ప్రజలు ఇష్టపడడం లేదు. ఇక మహబూబాబాద్ జిల్లా విషయానికి వస్తే ఈ జిల్లాకు సమీపంలో బొగ్గు గనులున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దు ఉంది. అలాగే దీనికి తోడు డోర్నకల్ నుంచి జనగామ వరకు ఇరువైపులా రైతు పట్టాల సెగ వస్తుంది. ప్రతి ఏడాది రూ. కోట్లు ఖర్చు పెట్టి మొక్కలు నాటుతున్నా వాటి సంరక్షణ విషయంలో మాత్రం నిర్లక్ష్యధోరణి ప్రదర్శిస్తుండటంతో పరిసరాల్లో పచ్చదనం తగ్గిపోతుంది.

### ఈ జాగ్రత్తలు తప్పనిసరి :

గొడుగు, టోపీ, తెల్లని రుమాలు ధరించండి. ఎండ తీవ్రత ఎక్కువ ఉంటే బయట వెళ్లకండి. తెల్లని నూలు వస్త్రాలు ధరించడం మంచిది. నీరు, ఇతర ద్రవ పదార్థాలు ఎక్కువ తీసుకోవాలి. కూల్ డ్రింక్స్ ,



మత్తు పానీయాల జోలికి వెళ్లకూడదు. వడదెబ్బ సోకిన వారికి 15 నిమిషాలకు ఒకసారి కోల్డ్ స్పాంజింగ్ చేయాలి. చికిత్స చేయించాలి. "ఎండకాలంలో అలసత్వం ప్రదర్శించడం తగదు. వడదెబ్బ బారిన పడకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యవసాయ కూలీలతో పాటు వృద్ధులు, పిల్లలు, వాహనదారులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి. మీకు వడదెబ్బ లక్షణం కనిపిస్తే సమీప సర్కారు ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలి." - సాధ్విజ, వైద్యాధికారిణి, డోర్నకల్ పరీక్షలు రాస్తున్నారు. మార్చి 14 నుంచి పది పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ సమయంలో చదువు ఒత్తిడిలో పడి నీరు తాగడం మర్చిపోవద్దు. పుస్తకాల పక్కన నీళ్ల బాటిల్ కూడా ఉంచుకోండి. పళ్ల రసాలు, గ్లూకోజ్ , బార్లీ వంటివి తీసుకోవాలి. కాటన్ లేదా తేలికపాటి రంగు దుస్తులు ధరించాలి. వేసవిలో తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. ఎండలో ఎక్కువగా ఉండేవారు తరచూ నీటిని తీసుకోవాలి. నిమ్మరసం, మజ్జిగ, టెంకాయ నీళ్లు తీసుకోవాలి. శరీరానికి తగిన నీరు లేకపోతే పెదాలు, నాలుక ఎండుతాయి. ఇలా అవుతే హెచ్చరికగా భావించాలి వేసవిలో వ్యాధుల ముప్పు : ఎండలో ఎక్కువగా తిరగడం వల్ల అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. శరీరం పొడిబారడం, చెమటలు పట్టకపోవడం, ఎర్రగా మారడం, దురదలు, తలనొప్పి, వాంతులు, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే ఫస్ట్ ఎయిడ్ తీసుకొని వైద్యులను సంప్రదించాలి. మరి కొందరికి బీపీ, షుగర్ పెరగడంతో పాటు, గుండె జబ్బులు, పక్షవాతం, కడుపునొప్పి, మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యలు, చర్మ వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది.

## సముద్ర మార్గాల్లో చిక్కుకుపోయిన 37 భారత నౌకలు, 1,109 మంది నావికులు

### పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు

### జలసంధి మూసివేత- పర్షియన్ గల్ఫ్, ఒమన్ ప్రాంతాల్లో చిక్కుకున్న భారత నౌకలు

ఢిల్లీ : పశ్చిమ ఆసియాలో అమెరికా, ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య భీకర యుద్ధం కొనసాగుతోంది. ప్రపంచ రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి మూతపడటంతో అంతర్జాతీయ షిప్పింగ్ మార్గాల్లో రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్ ప్రాంతాల్లో సుమారు 37 భారత నౌకలు నిలిచిపోయాయి. వీటిలో 1,109 మంది నావికులు ఉన్నట్లు కేంద్ర వర్గాలు తెలిపారు. పోర్ట్ లకు రవాణా చేస్తున్నాయి. మరికొన్ని గల్ఫ్ దేశాల నుంచి పెట్రోలియం ఉత్పత్తులను తీసుకొచ్చేందుకు వెళ్తున్నాయి. కాగా, హర్మూజ్ జలసంధి మూసివేయడంతో రవాణాకు పూర్తిగా అంతరాయం కలిగింది. ఈ నేపథ్యంలో, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ఆయా కంపెనీలతో క్రమం తప్పకుండా సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని సమీక్షిస్తోంది. భారతీయ నావికుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల పశ్చిమాసియాలో తలెత్తిన ఘర్షణల కారణంగా ముగ్గురు భారతీయ నావికులు మరణించారు. భారత్ తన చమురు అవసరాల్లో ఎక్కువ భాగం గల్ఫ్ దేశాల నుంచే దిగుమతి చేసుకుంటుంది. ఈ క్రమంలో పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్ ప్రాంతాల్లో చిక్కుకుపోయిన 37 నౌకల్లో అత్యధిక శాతం ముడి చమురును, ఎల్ ఎన్ జీని తీసుకొస్తున్నాయి. మరికొన్ని నౌకలు పెట్రోలియం ఉత్పత్తులను తీసుకురావడానికి గల్ఫ్ దేశాల వైపు వెళ్తుండగా మధ్యలోనే నిలిచిపోయాయి. ఈ నౌకల రాకపోకలు ఆగిపోవడం వల్ల రాబోయే రోజుల్లో దేశీయంగా ఇంధన ధరలపై ప్రభావం పడే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

క్విక్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు

సముద్ర మార్గాల్లో తీవ్రతను గమనించిన కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. కేంద్ర షిప్పింగ్, ఓడరేవుల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. నౌకాయాన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో క్విక్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు చేశారు. ఇది వివిధ అథారిటీల మధ్య సమన్వయం చేస్తూ, నావికులు, వారి కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని ఈ టీమ్ అందించనుంది.డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (డీజీఎస్) నిరంతరం షిప్పింగ్ కంపెనీలతో టచ్‌లో ఉంటూ నౌకల కదలికలను ట్రాక్ చేస్తుంది. నావికుల కుటుంబాల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లను రిక్రూట్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ సర్వీస్ లైసెన్సీల (ఆర్పీఎల్ఎస్) అందుబాటులోకి తెచ్చారు.

భారత మిషన్లతో సన్నిహిత సమన్వయం

ఇదిలా ఉండగా, కేంద్రం నౌకాదళాన్ని కూడా అప్రమత్తం చేసింది. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో భారత వాణిజ్య నౌకలకు రక్షణ కల్పించేందుకు 'ఆపరేషన్ సంకల్ప్' వంటి చర్యలను వేగవంతం చేసే ఆలోచనలో ఉంది. ఈ మేరకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఇన్ఫర్మేషన్ ఫ్యూజన్ సెంటర్ గల్ఫ్ దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. ఇదిలా ఉండగా, హర్మూజ్ జలసంధి మూసివేయడాన్ని అమెరికా అధ్యక్షుడు

# సంపాదకీయం

## న్యాయస్థానాలను ప్రశ్నించకూడదా?

'సుప్రీంకోర్టు సంస్థాగత ఆధిపత్యాన్ని దిగజార్చేందుకు, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఒక పద్ధతి ప్రకారం ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ప్రయత్నాలను అడ్డుకోకపోతే, ప్రజల దృష్టిలో న్యాయవ్యవస్థ పవిత్రత క్షీణిస్తుంది. యువత లేత మనసులపై ప్రభావం చూపుతుంది.. మాపై తుపాకి కాల్చారు.. న్యాయవ్యవస్థ నెత్తురోడుతోంది.' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌సీఈఆర్‌టీ ప్రచురించిన 8వ తరగతి పుస్తకంలో న్యాయవ్యవస్థలో అవినీతి గురించి వివరించినందుకు ఆయన ఏకంగా ఆ పుస్తకాన్నే నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. కనీసం డిజిటల్ రూపేణా కూడా ఈ పుస్తకం కనపడరాదని ఆయన ఆజ్ఞాపించారు. ఈ నిషేధాజ్ఞల తర్వాత కొన్ని లక్షల పుస్తకాలను ఎన్‌సీఈఆర్‌టీ ఉపసంహరించుకుంది. ఈ పాఠ్యపుస్తకం జిరాక్స్ కాపీలను అమ్ముతున్నందుకు ఒక పుస్తకాల షాపు యజమానిని పోలీసులు అరెస్టు చేసినట్లు కూడా వార్తలు వచ్చాయి. 'న్యాయవ్యవస్థను అప్రతిష్టపాలు చేసేందుకు ఈ భూమి మీద ఏ ఒక్కరినీ నేను అంగీకరించే ప్రసక్తి లేదు' అని సీజేఐ అన్నారు. ఆ పాఠ్యపుస్తకంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినప్పుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇజ్రాయెల్‌లో ఉన్నారు. న్యాయవ్యవస్థ మనసు గాయపరిచినందుకు మోదీ కూడా బాధపడ్డారు. అసలు ఇవన్నీ ఎవరు చూస్తున్నారు.. అని మోదీ అన్నట్లు అధికార వర్గాలే మీడియాకు వెల్లడించాయి. దేశానికి తిరిగి వచ్చిన తర్వాత కేబినెట్ సమావేశంలో కూడా మోదీ ఈ విషయం ప్రస్తావించారు. 'మన న్యాయవ్యవస్థలో అవినీతి ఉన్నదని మనమే 8వ తరగతి పిల్లలకు ఎలా చెబుతాం' అని మోదీ అన్నట్లు వార్తలు వచ్చాయి. విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా న్యాయవ్యవస్థలో అవినీతి గురించి వివాదాస్పద అధ్యాయాన్ని 8వ తరగతి పాఠ్యపుస్తకంలో చేర్చినందుకు విచారం వ్యక్తం చేశారు. 'న్యాయవ్యవస్థ అంటే మాకెంతో గౌరవం ఉన్నది. ఉద్దేశపూర్వకంగా న్యాయవ్యవస్థను అవమానించాలని మేము అనుకోలేదు' అని ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ చైర్మన్ ప్రొఫెసర్ దినేష్ ప్రసాద్ సక్లానీకి సుప్రీంకోర్టు నోటీసులు పంపింది. భారత ప్రధాన న్యాయమూర్తి ఆందోళన వ్యక్తం చేసినట్లు ఈ మొత్తం ఉదంతం వెనుక న్యాయవ్యవస్థను అప్రతిష్ఠపాలు చేసే కుట్ర ఉన్నదా? ఒక పద్ధతి ప్రకారం న్యాయవ్యవస్థ పట్ల ప్రజల గౌరవం తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయా? నిజానికి మోదీ ప్రభుత్వమే ఈ కుట్ర పన్నిందన్న అభిప్రాయం కలిగించేందుకు కాంగ్రెస్ ప్రయత్నించింది. 'ఒక దశాబ్ద కాలంగా పాఠ్యపుస్తకాల్లో తమ సైద్ధాంతిక వైరస్‌ను వ్యాప్తి చేసేందుకు బీజేపీ సర్కార్ ప్రయత్నిస్తోంది. న్యాయవ్యవస్థలో అవినీతి గురించి వివరించడం అనేది యాదృచ్ఛికంగా జరగలేదు. కాని ఒక పద్ధతి ప్రకారం విద్యార్థుల మనసులను చెడగొట్టేందుకు ప్రయత్నం జరిగింది' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరాం రమేశ్ అన్నారు. మోదీ స్వయంగా ఈ ప్రక్రియకు మార్గదర్శకత్వం వహించారని, ఆర్ఎస్ఎస్ దీని వెనుక ఉన్నదని చెప్పేందుకు ఆధారాలు ఉన్నాయని ఆయన పరోక్ష వ్యాఖ్యలు చేశారు. సుప్రీంకోర్టులో ప్రతిపక్షాల కేసులను వాదించే న్యాయవాదులు కపిల్ సిబాల్, అభిషేక్ సింఘ్వీ ఈ విషయాన్ని జస్టిస్ సూర్యకాంత్ మరింత తీవ్రంగా పట్టించుకునేలా తమ వాదనలు వినిపించారు. ఏదో పెద్ద కుట్ర జరిగిందనే అభిప్రాయం కల్పించడంలో వారు కృతకృత్యులయ్యారు. 'ఈ దేశంలో అభివృద్ధి వేగంగా జరిగేందుకు న్యాయవ్యవస్థే ప్రధాన అడ్డంకి..' అని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సభ్యుడు సంజీవ్ సన్యాల్ గతంలో అన్నమాటలు కూడా ఇదే సమయంలో ప్రస్తావనకు వచ్చాయి. న్యాయ వ్యవస్థ ద్వారానే తమకు అంతిమంగా న్యాయం జరుగుతుందనే అభిప్రాయం ప్రజల్లో ఉన్నందువల్లే లక్షలాది సంఖ్యలో వారు కోర్టు తలుపుతడుతున్నారు. కోర్టులు తమకు న్యాయం చేస్తాయన్న అభిప్రాయం లేకపోతే, వారు కోర్టులకు వెళ్లకుండా ఆటవిక న్యాయానికి పాల్పడే అవకాశం ఉన్నది. 'ఈ దేశంలో ప్రజలకు న్యాయం లభించదు అన్న అభిప్రాయం విద్యార్థులకు కలిగించలేం..' అన్న జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయం సరైనది కాదని అనలేము. మురికివాడల్లో నివసించే పేదలను కూడా దురాక్రమణదారుల్లా ఒక తీర్పులో చెప్పారని ఆ పాఠ్యపుస్తకంలో ప్రస్తావించారు. అలా ప్రస్తావించడం ద్వారా మొత్తం న్యాయవ్యవస్థ పేదలకు వ్యతిరేకమని చిత్రించేందుకు ప్రయత్నించడం సరైనది కాదు. 'అన్యాయం ఎక్కడ జరిగినా అంతటా న్యాయానికి ముప్పు వాటిల్లినట్లే' అన్న మార్టిన్ లూథర్ కింగ్ వ్యాఖ్యలను ఉటంకించిన సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ జితేందర్‌సింగ్ ఇటీవల ఢిల్లీ మద్యం కేసుపై ఇచ్చిన తీర్పులో అధికార పార్టీ ప్రత్యర్థులను కేసుల్లో ఇరికించేందుకు సీబీఐ ఎలా వాస్తవాలను తనకు అనుగుణంగా మార్చుకుంటుందో దాదాపు 600 పేజీల తీర్పులో వివరించారు. 'ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు తీసుకున్న విధాన నిర్ణయాలను కూడా నేరాలుగా భావిస్తే ఇక ఏ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోగలదు?' అని ఆయన ప్రశ్నించారు. కేసులో అప్రూవర్లు, నేరంలో పాలుపంచుకున్న సాక్షుల మాటలనే విశ్వసించి నెలల తరబడి నిందితులను జైళ్లో బంధించడంలోని అన్యాయాన్ని ఆయన ఎత్తిచూపారు. జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ రెండూ ప్రభుత్వ దయతో రాలేదని, అవి రాజ్యాంగం ద్వారా వచ్చాయని, రాజ్యాంగానికీ, చట్టాలకూ మధ్య సమతుల్యత పాటించకపోతే నేర న్యాయ విచారణ వ్యవస్థపైనే ప్రజల విశ్వాసం సన్నగిల్లుతుందని ఆయన అన్నారు. ఢిల్లీ మద్యం కేసుల్లో అనేక సందర్భాల్లో స్టేకు నిరాకరించిన రాజ్యాంగ ధర్మాసనాలు కూడా ఈ స్థాయిల్లో క్రింది కోర్టు మాదిరి ఆలోచించలేకపోవడం గమనార్హం. ఈ తీర్పును పై కోర్టుల్లో ఎంత సవాలు చేసినా ఆ తీర్పు లేవనెత్తిన ప్రశ్నల ప్రాధాన్యత తగ్గే అవకాశాలు లేవు.

# చమురు సంక్షోభంలో చిక్కితే!



అమెరికా-ఇజ్రాయెల్ ఉమ్మడి దాడిలో ఇరాన్ అధినాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీ మరణించడంతో పశ్చిమాసియా తీవ్ర సంక్షోభంలోకి జారిపోయింది. యుద్ధం మరింత ముదిరి ఇతర ప్రాంతాలకూ విస్తరించవచ్చనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. వ్యూహపరంగా కీలకమైన హర్మూజ్ జలసంధి గుండా వెళ్తున్న ఒమన్ చమురు నౌకపై ఆదివారం దాడి జరిగింది. హర్మూజ్‌ను మూసేస్తున్నామని ఇరాన్ ప్రకటించడంతో ఇంధన రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. భారత చమురు అవసరాల్లో అత్యధికం హర్మూజ్ జలసంధి గుండా వచ్చే నౌకల ద్వారానే తీరుతున్నాయి. మరిప్పుడు చమురు సంక్షోభం తలెత్తితే ఇండియా ఎలా తట్టుకోగలుగుతుంది? మన దేశంలో పరిశ్రమలు, వాణిజ్యం, రవాణా కార్యకలాపాలు వంటివి నిరాటంకంగా కొనసాగాలంటే ఇంధనం తప్పనిసరి. దేశ చమురు అవసరాల్లో దాదాపు 80-90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. అందులోనూ, హర్మూజ్ జలసంధిగుండా వచ్చే నౌకల ద్వారానే యాభైశాతం చమురు మన దేశానికి చేరుతోంది. ఏ కారణం చేతనైనా ఈ జలసంధిలో రవాణాకు విఘాతం కలిగినప్పుడు, తాత్కాలిక సర్దుబాటు కోసమని భారత్ వ్యూహాత్మక చమురు నిల్వలను(ఎస్‌పీఆర్‌ను) ఏర్పాటు చేసుకుంది. తాజాగా ఒమన్ చమురు ట్యాంకర్లపై దాడితో, ప్రపంచంలోనే అత్యంత కీలక ఇంధన కారిడార్ అయిన హర్మూజ్ జలసంధి సైతం యుద్ధభూమిగా మారిపోయింది. దీంతో వ్యూహాత్మక చమురు నిల్వల ఆవశ్యకత తెలిసివస్తోంది.

### మన నిల్వ సామర్థ్యం ఎంత?

ప్రపంచంలోనే అత్యధిక వ్యూహాత్మక చమురు నిల్వలు అమెరికా దగ్గర ఉన్నాయి. అమెరికా సింధుశాఖ తీరంలోని భూగర్భ ఉప్పు గుహల్లో 71.4 కోట్ల పీపాల చమురును ఎస్‌పీఆర్ కింద నిల్వచేశారు. యుద్ధాలు, ఇతర సంక్షోభాల వల్ల ప్రపంచంలో చమురు ఎగుమతి, దిగుమతులకు విఘాతం కలిగితే... అప్పుడు దుష్ప్రభావాలను తగ్గించడానికి ఈ నిల్వలను ఏర్పరిచారు. ప్రపంచ చమురు ధరలు విజృంభించినప్పుడు మార్కెట్లో తలెత్తే ఒడుదొడుకులను తగ్గించడానికి సైతం ఈ నిల్వలు ఉపయోగపడతాయి. ఇలాంటి సందర్భాల్లో అమెరికా అధ్యక్షుడు ఇంధన విధానం, సంరక్షణ చట్టం కింద మార్కెట్ ధరల స్థిరీకరణకు ఎస్‌పీఆర్ నిల్వల నుంచి చమురును విడుదల చేసి గిట్టుబాటు ధరలకు విక్రయించడానికి అనుమతిస్తారు. ఇలాంటి పరిస్థితులు చరిత్రలో ఇంతవరకు నాలుగుసార్లు తలెత్తాయి. అమెరికా విదేశాంగ విధాన అస్త్రంగా ఎస్‌పీఆర్ నిల్వలు ఉపకరిస్తున్నాయి. అయితే, భారత్ కూడా సొంత ఎస్‌పీఆర్‌లను ప్రారంభించాలని ఎందుకు నిర్ణయించిందన్నది ఇక్కడ ఆసక్తికరం. ఇరాక్ 1991లో కువైట్‌ను ఆక్రమించినపుడు గల్ఫ్ యుద్ధం చెలరేగి ప్రపంచ చమురు సరఫరా విచ్ఛిన్నమై, ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. అప్పట్లో భారత్ దగ్గర కొన్ని వారాల దిగుమతులకు సరిపడా విదేశీ మారకద్రవ్య నిల్వలు మాత్రమే ఉన్నాయి. చమురు ధరల విజృంభణతో ఆ నిల్వలు అడుగంటి, చెల్లింపులకు తీవ్ర ఇబ్బంది ఎదురైంది. దాంతో పశ్చిమాసియా పరిణామాలు తన ఆర్థిక వ్యవస్థను కల్లోలపరచగలవనీ, దీర్ఘకాలిక ఇంధన భద్రతకు తగిన ఏర్పాట్లు అనివార్యమని ఇండియాకు తెలిసొచ్చింది. కానీ, అది కార్యరూపం దాల్చడానికి దాదాపు దశాబ్దకాలం పట్టింది! వ్యూహాత్మక చమురు నిల్వల ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి 1998లో భారత్ ఒక నిపుణుల సంఘాన్ని నియమించింది. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం కనీసం 90రోజుల దిగుమతులను భర్తీచేసే స్థాయిలో అత్యవసర చమురు నిల్వలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆ సంఘం సూచించింది. ఒకటో దశ కింద ముడిచమురు నిల్వకు భూగర్భ కేంద్రాల నిర్మాణానికి 2004లో కేంద్రం లాంఛనంగా ఆమోదముద్ర వేసింది. అలా భారత వ్యూహాత్మక పెట్రోలియం నిల్వల సంస్థ(ఐఎస్‌పీఆర్ఎల్) ఏర్పాటైంది. అది తూర్పు, పశ్చిమ తీరాలలో మూడు చోట్ల- విశాఖపట్నం(ఆంధ్ర), మంగళూరు, పడూరు(కర్ణాటక)లలోని భూగర్భ రాతి గుహల్లో ఎస్‌పీఆర్‌లను నిర్మించింది. మన చమురు కంపెనీల దగ్గర ఉన్న నిల్వలకు ఇవి అదనం. యుద్ధం లేదా మరేదైనా కారణంతో చమురు దిగుమతులకు ఆటంకం కలిగితే ఈ నిల్వలు అక్కరకొస్తాయి. అత్యవసర సమయాల్లో ఇక్కడి నుంచి పైపులైన్లు, ట్రక్కుల ద్వారా చమురును రవాణా చేస్తారు. భారతదేశ వ్యూహాత్మక చమురు నిల్వల సామర్థ్యం 53.3లక్షల మెట్రిక్ టన్నులు. అందులో 13.3లక్షల మెట్రిక్ టన్నులను విశాఖపట్నంలో, 15లక్షల మెట్రిక్ టన్నులను మంగళూరులో, 25లక్షల మెట్రిక్ టన్నులను పడూరులో నిల్వచేస్తున్నారు. ఇవన్నీ కలసి భారతదేశ చమురు అవసరాలను 9-10 రోజుల వరకు తీరుస్తాయి. వీటిని సంక్షోభ సమయాల్లో మాత్రమే వినియోగిస్తారు. మరోవైపు చమురు శుద్ధి కర్మాగారాలు, చమురు కంపెనీలు, ట్యాంకర్ నౌకల్లో ఉండే నిల్వలను రోజువారీ వాణిజ్య కార్యకలాపాలకు వినియోగిస్తారు. ఇలా అన్నిరకాల నిల్వలను కలిపితే, మొత్తం 74 రోజుల దిగుమతులకు సమానమైన చమురు భారత్ దగ్గర ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

### రెండో దశకు నిర్ణయం

మన చమురు నిల్వలు అన్ని రకాల అవసరాలకూ సరిపోవని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఒకవైపు చమురుకు అంతకంతకు గిరాకీ పెరుగుతోంది. మరోవైపు, ప్రపంచ రాజకీయాల వల్ల ఎప్పుడైనా ఇంధన సరఫరాలకు విఘాతం కలిగే పరిస్థితులు తలెత్తవచ్చు. అందుకని, వ్యూహాత్మక చమురు నిల్వలను (ఎస్‌పీఆర్) రెండో దశ కింద మరింత విస్తరించాలని కేంద్రం నిర్ణయించింది. ఒడిశాలోని చండీఖోల్‌లో 40లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలకు ఏర్పాట్లు చేయాలనీ, పడూరులో నిల్వ సామర్థ్యాన్ని మరో 25లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలనీ నిశ్చయించింది. అంటే అదనంగా 65లక్షల మెట్రిక్ టన్నుల చమురు నిల్వకు వసతులు ఏర్పడతాయన్నమాట. ఇప్పటికే ఉన్న 53.3లక్షల మెట్రిక్ టన్నులకు దీన్ని కలిపితే మొత్తం 118.3లక్షల మెట్రిక్ టన్నుల వ్యూహాత్మక చమురు నిల్వలు ఇండియా దగ్గర ఉంటాయి. హర్మూజ్ జలసంధి గుండా చమురు రవాణాకు విఘాతం కలిగింది కాబట్టి అంతర్జాతీయ విపణిలో ధరలు భగ్గుమంటాయి. దీన్ని తట్టుకోవడానికి ఎస్‌పీఆర్ అక్కరకొస్తుంది. పశ్చిమాసియా నుంచి చమురు దిగుమతులను తగ్గించి రష్యా, అమెరికాల నుంచి కొనుగోలు చేయడానికి కొంత సమయం పడుతుంది. ఆ లోగా వ్యూహాత్మక చమురు నిల్వలు భారత్‌కు అండగా నిలుస్తాయి.

# సమాధి నుండి ప్రతీకారం.. రష్యా 'డెడ్ హ్యాండ్' రహస్య యంత్రంపై విశ్లేషణ

రష్యా మీద అమెరికా దాడి చేయకపోవడానికి ఏకైక కారణం.. రష్యాకు చెందిన సమాధి నుండి శత్రువును వేటాడే రష్యా డెడ్ హ్యాండ్ మృత్యు యంత్రం. దీనిని అధికారికంగా పెరిమీటర్ అని పిలుస్తారు, ఇది సోవియట్ యూనియన్ కాలంలో అభివృద్ధి చేయబడిన ఒక స్వయంచాలక అణు ప్రతీకార వ్యవస్థ. ప్రపంచంలోనే అత్యంత రహస్యమైన. శక్తివంతమైన అణు ప్రతీకార వ్యవస్థ. దేశ నాయకత్వం మొత్తం తుడిచిపెట్టుకుపోయినా. శత్రువును నాశనం చేసేలా దీనిని రూపొందించారు...

### మృత్యువు ఒడిలో నుండి ప్రతీకారం..

ఒక్కసారి ఊహించుకోండి, దేశ రాజధాని అగ్నిగుండమైంది. సైనిక ప్రధాన కార్యాలయం ధ్వంసమైంది. దేశాన్ని నడిపించే అధ్యక్షుడు, వ్యూహాలు రచించే జనరల్స్ ఇలా అందరూ ఒక్క క్షణంలో కనుమరుగయ్యారు.. శత్రువు తన అణు దాడితో దేశ నాయకత్వాన్ని పూర్తిగా తుడిచిపెట్టేశాడు.. (దీనిని రక్షణ పరిభాషలో డెకాపిటేషన్ స్ట్రైక్ అంటారు) అంటే తల నరకడం. తల లేని శరీరం ఎలాగూ పని చేయదు. కాబట్టి దేశం ఓడిపోయినట్లే అని శత్రువు భావిస్తాడు. కానీ, అప్పుడే అసలు కథ మొదలవుతుంది. మనుషులు చనిపోయినా.. యంత్రాలు మేల్కొంటాయి. సమాధి లోపల నిద్రపోతున్న మృత్యువు బయటకు వస్తుంది. దీనినే రష్యా 'గ్యారెంటీడ్ రిటాలియేషన్' అంటుంది. దీనికి ప్రాణం పోసే వ్యవస్థే డెడ్ హ్యాండ్ లేదా పెరిమీటర్.

### ట్రిగ్గర్ మెకానిజం

ఒకవేళ రష్యాపై అణు దాడి జరిగినట్లు సెన్సార్లు నిర్ధారిస్తే.. ఆ వ్యవస్థ వెంటనే రష్యా హైకమాండ్‌కు సందేశం పంపుతుంది.. అక్కడి నుండి ఎలాంటి స్పందన రాకపోతే నాయకత్వం మొత్తం నాశనమైందని వ్యవస్థ భావిస్తుంది. అప్పుడు అదే స్వయంచాలకంగా యాక్టివేట్ అవుతుంది. ఇక్కడ ఒక రకమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పనిచేస్తుంది. ఇది నేటి కాలపు చాట్ బాట్‌ల వంటిది కాదు. ఇది ఒక కఠినమైన మొండి ట్రిగ్గర్ మెకానిజం. వ్యవస్థ యాక్టివేట్ అయ్యాక ముందుగా కమాండ్ రాకెట్లు గాల్లోకి లేస్తాయి.. వీటిలో కేవలం శక్తివంతమైన రేడియో ట్రాన్స్‌మిటర్లు ఉంటాయి.. ఇవి గాల్లో నుండి రష్యా అంతటా ఉన్న సైలోస్, సబ్మెరైన్లు మొబైల్ లాంచర్లకు ఎన్‌క్రిప్టెడ్ సిగ్నల్స్ పంపుతాయి. ఈ సంకేతాలు అందిన వెంటనే, మానవ ప్రమేయం లేకుండానే అణు క్షిపణులు శత్రువు వైపు దూసుకెళ్తాయి. రష్యా వద్ద నేడు ఇవి 10 వేలకు చేరుకున్నట్లు అంచనా.. ఆ అణు విస్ఫోటన ఈ అనంత విశ్వంలో మన భూగోళాన్ని ఒక చిన్న అణు ధూళి మేఘంగా మార్చేస్తుంది.



### కమాండ్ రాకెట్లు.. మృత్యు మెసెంజర్లు..

డెడ్ హ్యాండ్ వ్యవస్థలో అత్యంత కీలకమైన భాగం ఈ కమాండ్ రాకెట్లు.. శత్రువు భూమి మీద ఉన్న అన్ని కమ్యూనికేషన్ టవర్లను శాటిలైట్లను ధ్వంసం చేసినా సరే.. గాల్లో ప్రయాణించే ఈ రాకెట్లు ఇచ్చే సిగ్నల్‌ను ఎవరూ ఆపలేరు.. ఒక్కసారి ఈ రాకెట్ గాల్లోకి లేచిందంటే రష్యా వద్ద ఉన్న 5,500+ కంటే ఎక్కువ అణు వార్‌హెడ్లు నిద్ర లేస్తాయి. ఇది ఒక చనిపోయిన మనిషి చేయి శత్రువు గొంతు పట్టుకోవడం లాంటిది.. అందుకే దీనికి ఆ పేరు వచ్చింది. ఇది కేవలం మాటల యుద్ధం కాదు.. దీని వెనుక పక్కాగా పనిచేసే ఒక యంత్రం ఉంది. ఆ యంత్రానికి భావోద్వేగాలు ఉండవు. అది కేవలం గణాంకాలను, సెన్సార్ డేటాను మాత్రమే నమ్ముతుంది. మానవత్వం, యంత్రం.. ఒక వైరుధ్యం ఇక్కడ ఒక ప్రాథమిక ప్రశ్న తలెత్తుతుంది. ఒక యంత్రానికి ప్రపంచాన్ని అంతం చేసే అధికారం ఇవ్వడం సరైనదేనా?

### సెన్సార్లలో సాంకేతిక లోపం వస్తే..?

గతంలో సోవియట్ యూనియన్ కాలంలో ఇలాంటి తప్పులు జరిగాయి. కానీ అప్పుడు మనుషులు ఆ నిర్ణయాన్ని ఆపగలిగారు. పెరిమీటర్ వ్యవస్థలో కూడా చివరగా బటన్ నొక్కేందుకు భూగర్భ బంకర్లలో కొంతమంది అధికారులు ఉంటారు.. అయితే ఆ అధికారులకు బయట ఏం జరుగుతుందో తెలియదు.. వారికి తెలిసింది ఒక్కటే, నాయకత్వం నుండి కమ్యూనికేషన్ కట్ అయింది అంటే బయట దేశం నాశనమైంది. కాబట్టి ప్రతీకారం తీర్చుకోవాలి. ఇది ఒక భయంకరమైన సైకలాజికల్ గేమ్. గ్యారెంటీడ్ రిటాలియేషన్ శాంతిని కాపాడటానికి చేసే ప్రయత్నం కాదు. అది యుద్ధం జరిగితే ఇద్దరూ ఉండరు అని హెచ్చరించే ఒక మృత్యు గంట.

### అణు శీతాకాలం వైపు..

గ్యారెంటీడ్ రిటాలియేషన్ అనేది రష్యన్ అహంకారం కాదు. అది వారి అస్తిత్వ పోరాటం. శత్రువుకు దొరకకుండా తనను తాను కాపాడుకోవడానికి రష్యా వేసుకున్న ఒక కవచం. కానీ ఈ కవచం ఎంత ప్రమాదకరమైనదంటే.. అణు యుద్ధం అంటూ జరిగితే గెలిచిన వారు ఉండరు. కేవలం చూడటానికి మిగిలిన వారు కూడా ఉండక పోవచ్చు.. డెడ్ హ్యాండ్ వ్యవస్థ ఇచ్చే సందేశం ఒక్కటే. మమ్మల్ని చంపాలనుకుంటే మీరు కూడా చావడానికి సిద్ధంగా ఉండండి. ఇది ఒక అత్యున్నత స్థాయి మేధోపరమైన యుద్ధ తంత్రం. నేటి ప్రపంచ రాజకీయాలను శాసిస్తున్న ఒక అదృశ్య హస్తం.

# స్థానికం ఇంటర్వెల్ మాత్రమే!

స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు సినిమాల్లో ఇంటర్వెల్ లాంటివి! చాలా సినిమాల్లో ఇంటర్వెల్‌కు ముందు సీన్ ఒకరకంగా ఉంటే, చివరకై క్లైమాక్స్ మరో రకంగా ఉంటుంది. రాజకీయాలు కూడా అంతే! ఎప్పుడు ఏ మలుపు తిరుగుతాయో, ఏ నాయకుడి తలరాతలు ఎలా మారుతాయో ఊహించడం కష్టం. తెలుగు నేలపై గత నలభై ఏండ్ల రాజకీయాలను అవలోకనం చేసుకుంటే, ఇదే అభిప్రాయం కలుగుతున్నది. ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల్లో ల్యాండ్ మార్క్‌గా భావించే 1982 నుంచి ఇప్పటివరకు జరిగిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో అద్భుత విజయాలు సాధించిన అధికార పార్టీలు ఆ తర్వాత వచ్చిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం నిలుపుకోలేకపోయాయి. ఇందుకు ఒకట్రెండు మినహాయింపులు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ ఆవిర్భావం తర్వాత 1983 నుంచి 1989 వరకు జరిగిన ప్రతి ఎన్నికలోనూ అప్రతిహత విజయాలు సాధించిన ఎన్టీఆర్‌కూ ఓటములు తప్పలేదు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో విజయాలు సాధించినా అసెంబ్లీ ఎన్నికల నాటికి పరాజయం ఎదురైన సందర్భాలు ఉన్నాయి. ఎన్టీఆర్ 1982 మార్చిలో తెలుగుదేశం పార్టీని స్థాపించారు. అదే సంవత్సరం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పక్షం కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం చాటుకున్నది. కానీ, 1983 జనవరిలో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్టీఆర్ చేతిలో మట్టికరిచింది. ఆ తర్వాత 1984 పార్లమెంట్ ఎన్నికలు, 1985 అసెంబ్లీ మధ్యంతర ఎన్నికలు, 1987 స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని విజయాలు సాధించిన ఎన్టీఆర్.. 1989 అసెంబ్లీ ఎన్నికల్లో అదే కాంగ్రెస్ చేతిలో ఎదురుదెబ్బ తిన్నారు. ఏడేండ్ల విరామం తర్వాత కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చింది. 1991లో జరిగిన పార్లమెంట్ మధ్యంతర ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ 25 ఎంపీ స్థానాలు గెలుచుకుని ఆధిపత్యం నిలబెట్టుకున్నది. కానీ, మరో మూడేండ్ల తర్వాత 1994 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్టీఆర్ చేతిలోనే కాంగ్రెస్ చిత్తుగా ఓడిపోయింది. అయితే, ఆ తర్వాత చంద్రబాబునాయుడు తన మామ ఎన్టీఆర్‌ను అధికారంలో నుంచి కూలదోసి గద్దెనెక్కడం, కొన్నాళ్లకే ఎన్టీఆర్ హఠాన్మరణం వంటి పరిణామాలు జరిగాయి. 1994-1999 మధ్యలో కేంద్రంలో అస్థిర ప్రభుత్వాలు కొనసాగాయి. దీంతో 1996,




1998, 1999లో వరుసగా మూడుసార్లు లోక్‌సభకు మధ్యంతర ఎన్నికలు జరిగాయి. 1996, 1998 లోక్‌సభ ఎన్నికల్లో రెండు సార్లూ 22 ఎంపీ సీట్లు గెలుచుకుని అధికార టీడీపీ కంటే కాస్త మెరుగ్గా ఉన్నట్టు కనిపించిన కాంగ్రెస్ పార్టీ.. 1999 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని అందుకోలేకపోయింది! టీడీపీ 179 అసెంబ్లీ స్థానాలు గెలుచుకోవడంతో చంద్రబాబే మళ్లీ అధికారంలోకి వచ్చారు. ఆ సమయంలోనే 2001లో ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకున్నది. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా కేసీఆర్ టీఆర్ఎస్‌ను స్థాపించి, ఉద్యమబావుటా ఎగురవేశారు. అదే సంవత్సరంలో చంద్రబాబు ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించింది. ఉమ్మడి రాష్ట్రంలోని 14,129 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తే.. అందులో టీడీపీ 7,227, కాంగ్రెస్ 4,696, తెలంగాణలో టీఆర్ఎస్ 1,043 స్థానా లు గెలుచుకున్నాయి. అధికార టీడీపీ సగానికిపైగా పంచాయతీలు కైవసం చేసుకున్నది. అయినప్పటికీ, 2004 అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబు అధికారం నిలబెట్టుకోలేకపోయారు! వామపక్షాలు, టీఆర్ఎస్‌తో పొత్తుపెట్టుకున్న కాంగ్రెస్‌కు 185 స్థానాలు దక్కడంతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఆ తర్వాత 2005లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 96కి 90 మున్సిపాల్టీలు గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీ, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ స్థాయి బలాన్ని నిలబెట్టుకోలేకపోయింది. 294 అసెంబ్లీ స్థానాలకుగాను 156 చోట్ల మాత్రమే విజయం సాధించి, 8 సీట్ల తేడాతోనే అధికారాన్ని నిలుపుకోగలిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చివరి స్థానిక సంస్థల ఎన్నికలు 2014లో జరిగాయి. పదేండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. కాంగ్రెస్, టీడీపీలకు తెలంగాణలో టీఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ గట్టి పోటీదారులుగా ముందుకొచ్చాయి. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో టీఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ విజయం సాధించాయి. 2018-19లో అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కేసీఆర్ అధికారం నిలుపుకోగా, ఏపీలో చంద్రబాబు నిలుపుకోలేకపోయారు. ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్, ఏపీలో వైఎస్ఆర్‌సీపీ ఘన విజయాలు సాధించినప్పటికీ, 2023-24 అసెంబ్లీ ఫలితాలు అందుకు విరుద్ధంగా వచ్చాయి. గత నలభై ఏండ్ల ఎన్నికల ట్రాక్ రికార్డులను పరిశీలిస్తే, రెండు మూడేండ్లకోసారి ప్రజల 'మూడ్' మారుతున్నదనే అభిప్రాయం కలుగుతున్నది. ఏ ఒక్క నాయకుడి పట్ల కూడా ప్రజల 'మూడ్' ఎప్పుడూ ఒకేరకంగా ఉండటం లేదని, ఒకసారి ఆగ్రహించినా మరోసారి అనుగ్రహిస్తున్నారని స్పష్టమవుతున్నది. స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన విజయాలను చూసి తమ ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసానికి సంకేతమని, తమ పాలన ప్రజలను ఆకట్టుకుంటున్నదని, తాము ప్రజలను కణికట్టు చేయగలమని అధికార పార్టీలు భావిస్తుంటాయి. అది సహజం కూడా! అయితే, ఆ తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీలు ఎందుకు బోల్తా కొడుతున్నాయనేది ఆసక్తికర విషయం. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ఉండే ఓటర్ల సంఖ్యకు, అంతకు రెండు మూడేండ్ల ముందు జరిగిన అసెంబ్లీ ఓటర్ల సంఖ్యకు పెద్దగా తేడా ఉండదు. అంతేకాకుండా,

## వెండి మీద కూడా మీరు లోన్ తీసుకోవచ్చు.. నిబంధనలు ఏంటంటే..




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెండిపై రుణాలకు అనుమతించింది. వచ్చే ఏప్రిల్ నుంచి బ్యాంకులు, వెండి ఆభరణాలు, నాణేలపై రుణాలు ఇవ్వవచ్చు. గరిష్ఠ పరిమితులు, లోన్ టు వాల్యూ నిష్పత్తి ఉంటాయి. లోన్ తీర్చిన తర్వాత 7 పని దినాల్లోపు తనఖా తిరిగి ఇవ్వకపోతే, రోజుకు రూ.5 వేలు పరిహారం చెల్లించాలి.

బంగారంపై లోన్ గురించి చాలా మందికి తెలిసినా, వెండిపై కూడా రుణం తీసుకోవచ్చా అన్నది చాలా కాలంగా చర్చనీయాంశంగా ఉంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఒక కీలక నిర్ణయం తీసుకుంటూ వెండిపై రుణాలు ఇచ్చేందుకు అనుమతిస్తూ ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. ఈ నిబంధనలు 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయి.

ఎవరు రుణాలు అందిస్తారు

ర్‌బీఐ స్పష్టం చేసిన వివరాల ప్రకారం, అన్ని వాణిజ్య బ్యాంకులు, చిన్న ఫైనాన్స్ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు ఇకపై బంగారంతో పాటు వెండిపై కూడా రుణాలు ఇవ్వడానికి అనుమతి కలిగి ఉంటాయి.

ఎవరు రుణం పొందగలరు దేనిపై రుణం ఇస్తారు

ముడి లోహాలు (గనుల నుంచి తీసినవి), బులియన్ వెండి లేదా బులియన్ బంగారం, గోల్డ్/సిల్వర్ ఈటీఎఫ్‌లు, మ్యూచువల్ ఫండ్ యూనిట్లపై రుణాలు ఇవ్వరు. అలాగే, ఇతరులు తనఖా పెట్టిన లోహాలను తిరిగి తనఖా పెట్టి రుణం పొందలేరు. ప్రజలు తమ వద్ద ఉన్న బంగారం లేదా వెండి ఆభరణాలు, నాణేలు వంటి వాటిపై మాత్రమే స్వల్పకాలిక ఆర్థిక అవసరాల కోసం రుణం పొందవచ్చు.

తాకట్టు పరిమితులు:

ఆర్‌బీఐ తనఖా పెట్టగల బంగారం, వెండికి గరిష్ఠ పరిమితులను నిర్ణయించింది. బంగారు ఆభరణాలు గరిష్ఠంగా 1 కేజీ. వెండి ఆభరణాలు: గరిష్ఠంగా 10 కేజీలు. బంగారు నాణేలు: 50 గ్రాముల వరకు. వెండి నాణేలు 500 గ్రాముల వరకు తాకట్టు పెట్టవచ్చు. రుణ విలువ అంచనా లోన్ టు వాల్యూ (రుుఎ) నిష్పత్తిని ఆర్‌బీఐ నిర్ణయించింది. ఇది ప్రతి వంద రూపాయల విలువైన బంగారం లేదా వెండిపై ఎంత రుణం లభిస్తుందో తెలియజేస్తుంది. బంగారం లేదా వెండి విలువను నిర్ధారించడానికి రెండు అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. వాటిలో ఏది తక్కువగా ఉంటే దానిపై విలువను లెక్కిస్తారు. 1. గత 30 రోజుల సగటు ముగింపు ధర. 2. ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ లేదా రెగ్యులేటెడ్ కమోడిటీ ఎక్స్ఛేంజ్ ప్రకటించిన ముందు రోజు ముగింపు ధర. ఈ అంచనాలో లోహపు నికర విలువ మాత్రమే లెక్కిస్తారు, రత్నాలు, రాళ్ల విలువను పరిగణనలోకి తీసుకోరు. ఈ వాల్యుయేషన్ ప్రక్రియ దేశవ్యాప్తంగా ఒకే విధంగా ఉండాలని ఆర్‌బీఐ సూచించింది వినియోగదారుల రక్షణ పరిహారం: రుణం తీర్చిన తర్వాత, బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థలు తనఖా పెట్టిన ఆభరణాలను 7 పని దినాల్లోపు తిరిగి ఇవ్వాలి. ఒకవేళ ఆ గడువులోగా తిరిగి ఇవ్వలేకపోతే, ఆ సంస్థ కస్టమర్‌కు రోజుకు రూ.5,000 చొప్పున పరిహారం చెల్లించాల్సి ఉంటుంది.

డిఫాల్ట్ అయినప్పుడు చర్యలు:

వినియోగదారుడు రుణం తిరిగి చెల్లించడంలో విఫలమైతే, తనఖా పెట్టిన బంగారం లేదా వెండిని వేలం వేసే హక్కు సంస్థలకు ఉంటుంది. అయితే, వేలం వేయడానికి ముందు వినియోగదారుడికి నోటీసు ఇవ్వాలి. ఒకవేళ వినియోగదారుడిని సంప్రదించడం సాధ్యం కాకపోతే, ఒక పబ్లిక్ నోటీసు జారీ చేసి, ఒక నెల రోజుల పాటు వేచి ఉన్న తర్వాతనే వేలం ప్రక్రియను ప్రారంభించాలి. మొత్తంగా, బంగారం లాగే వెండిపై కూడా రుణాలు పొందే సదుపాయం చిన్న ఆర్థిక అవసరాలను తీర్చుకోవడానికి ప్రజలకు ఒక ప్రత్యామ్నాయ మార్గాన్ని అందిస్తుంది.

## గోల్డెన్ ఛాన్స్.. ఏడాదికి రూ.3,000 కడితే చాలు రూ.60 లక్షల ప్రమాద బీమా.. ఎలాంటి వాటికి వర్తిస్తుందంటే..

**ఈ పథకం ఎస్బీఐ కస్టమర్లకు ముఖ్యంగా రోజువారీ ప్రమాదాల నుండి తమ కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పించడానికి ఒక ముఖ్యమైన అవకాశంగా సేవలు అందిస్తుంది. ఎస్బీఐ దీనిని సామాజిక బాధ్యతగా పరిగణిస్తూ, ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతోంది..**




గోల్డెన్ ఛాన్స్.. ఏడాదికి రూ.3,000 కడితే చాలు రూ.60 లక్షల ప్రమాద బీమా.. ఎలాంటి వాటికి వర్తిస్తుందంటే.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) తన ఖాతాదారుల ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకొని ఒక వినూత్నమైన, విస్తృతమైన ప్రమాద బీమా పథకాన్ని ప్రారంభించింది. ఇది సంవత్సరానికి కేవలం రూ.3,000 ప్రీమియంతో రూ.60 లక్షల భారీ ప్రమాద బీమా కవరేజీని అందిస్తుంది. ఈ పథకం దేశవ్యాప్తంగా ఎస్బీఐ ఖాతాదారులకు అందుబాటులో ఉంది. వారికి ఊహించని ప్రమాదాల నుండి రక్షణ కల్పించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పాలసీ గురించి విజయవాడ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ లక్ష్మీకాంతరావు ఓ మీడియాకు వివరించారు. పథకం ముఖ్య లక్షణాలు: అధిక కవరేజీ: వార్షిక ప్రీమియం రూ.3,000 చెల్లిస్తే ప్రమాదం కారణంగా సంభవించే మరణానికి లేదా శాశ్వత పూర్తి వైకల్యానికి రూ.60 లక్షల బీమా మొత్తం లభిస్తుంది. అదనపు ప్రయోజనాలు: ఈ పాలసీ కేవలం బీమా మొత్తంతో ఆగదు. ప్రమాదం జరిగిన సందర్భంలో ఇది అదనపు ఖర్చులను కూడా కవర్ చేస్తుంది. ఇందులో పిల్లల విద్య ఖర్చుల కోసం రూ.20,000, అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.10,000, అడాప్షన్ ఖర్చుల కోసం రూ.10,000, అంబులెన్స్ ఛార్జీలకు కొంత మొత్తాన్ని కూడా అందిస్తుంది.

వైకల్య కవరేజీ: ప్రమాదం వల్ల సంభవించే శాశ్వత పూర్తి వైకల్యం (రెండు చేతులు, కాళ్ళు లేదా కళ్ళు కోల్పోవడం వంటివి) అయినప్పుడు రూ.60 లక్షల పూర్తి బీమా మొత్తం వర్తిస్తుంది. పాక్షిక వైకల్యం (ఒక చేయి లేదా ఒక కాలు కోల్పోవడం వంటివి) అయినప్పుడు, బీమా మొత్తంలో సగం లభిస్తుంది. తక్షణ వర్తింపు: పాలసీ కోసం ప్రీమియం చెల్లించిన వెంటనే బీమా కవరేజీ ప్రారంభమవుతుంది. ఎటువంటి నిరీక్షణ కాలం ఉండదు. ఆటో-రెన్యూవల్ సౌకర్యం: కస్టమర్ల సౌలభ్యం కోసం ఈ పాలసీకి ఆటో-రెన్యూవల్ ఎంపిక అందుబాటులో ఉంది. దీని వలన ప్రతి సంవత్సరం మాన్యువల్‌గా రెన్యూవల్ చేయాల్సిన అవసరం లేకుండా, అదే తేదీన ఖాతా నుండి ప్రీమియం స్వయంచాలకంగా డెబిట్ అవుతుంది. ఇది కూడా చదవండి: నెలకు రూ.10,000 ఇన్వెస్ట్‌మెంట్‌తో చేతికి రూ.32 లక్షలు అర్హత, దరఖాస్తు ప్రక్రియ: ఈ ప్రమాద బీమా పథకానికి 18 నుండి 65 సంవత్సరాల మధ్య వయస్సు గల ఎస్బీఐ ఖాతాదారులు అర్హులు. దరఖాస్తు ప్రక్రియ సరళంగా ఉంటుంది. ఎస్బీఐ యోనో (రుచీూ) యాప్, నెట్ బ్యాంకింగ్ లేదా సమీపంలోని ఎస్బీఐ బ్రాంచ్‌ను సందర్శించడం ద్వారా ఈ పాలసీని తీసుకోవచ్చు. నామినీ వివరాలను సులభంగా నమోదు చేయవచ్చు. నామినీకి ఎస్బీఐ ఖాతా ఉండవలసిన అవసరం లేదు. ఏ బ్యాంకులో ఖాతా ఉన్నా, ప్రమాదం సంభవించినప్పుడు వారికి బీమా మొత్తం చెల్లిస్తారు. కవరేజీలో చేర్చనివి: ఈ పాలసీ అన్ని రకాల ప్రమాదాలను కవర్ చేస్తుంది. ఇందులో పాము కాటు, విద్యుత్ షాక్ వంటివి కూడా ఉన్నాయి. అయితే, ఆత్మహత్య (సూసైడ్) మాత్రం ఈ బీమా కవరేజీ పరిధిలోకి రాదు. ప్రమాదవశాత్తు మరణం లేదా వైకల్యం సంభవించినప్పుడు డాక్టర్ ధృవీకరణ పత్రం అవసరం. క్లెయిమ్ ప్రక్రియ: క్లెయిమ్ చేసుకోవడానికి నామినీ కేవైసీ (పాన్ కార్డ్, ఆధార్ కార్డ్), డెత్ సర్టిఫికెట్ ఒరిజినల్ సమర్పించాల్సి ఉంటుంది. ఎటువంటి జాప్యం లేకుండా, కేవైసీ సరిపోలితే, బీమా మొత్తం ఒకే రోజులో లేదా గరిష్ఠంగా ఒక రోజులోపు చెల్లిస్తారు. ఎస్బీఐలో వ్యక్తిగత ప్రమాద బీమా 2012లో రూ.100 ప్రీమియంతో రూ.2 లక్షల కవరేజీతో ప్రారంభమైంది. అప్పటి నుండి రూ.200కి రూ.4 లక్షలు, రూ.500కి రూ.10 లక్షలు, రూ.1,000కి రూ.20 లక్షలు, రూ.2,000కి రూ.40 లక్షలు వంటి వివిధ ప్రీమియం స్థాయిలలో కవరేజీని అందిస్తూ వచ్చింది. ప్రస్తుత రూ.3,000 ప్రీమియం రూ.60 లక్షల కవరేజీ పరిశ్రమలోనే అత్యధికమని ఎస్బీఐ పేర్కొంది. ఈ పథకం ఎస్బీఐ కస్టమర్లకు ముఖ్యంగా రోజువారీ ప్రమాదాల నుండి తమ కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పించడానికి ఒక ముఖ్యమైన అవకాశంగా సేవలు అందిస్తుంది. ఎస్బీఐ దీనిని సామాజిక బాధ్యతగా పరిగణిస్తూ, ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతోంది.

## ఎండాకాలంలో వేడి చేయకుండా ఉండాలంటే ఇలా చేయండి చాలు.. సమ్మర్ బెస్ట్ టిప్స్ ఇవే..

**తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత పెరిగింది.. ముమ్మందు ఎండలు మరింత ఎక్కువగా ఉంటాయని.. ఉష్ణోగ్రతలు పెరుగుతాయని, జాగ్రత్తలు పాటించాలని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. అయితే.. సహజంగా.. ఎండాకాలం ప్రారంభం కాగానే చాలా మందిని వేధించే సాధారణ సమస్య.. శరీరంలో వేడి చేసింది అని చెప్పడం..**




తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత పెరిగింది.. ముమ్మందు ఎండలు మరింత ఎక్కువగా ఉంటాయని.. ఉష్ణోగ్రతలు పెరుగుతాయని, జాగ్రత్తలు పాటించాలని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. అయితే.. సహజంగా.. ఎండాకాలం ప్రారంభం కాగానే చాలా మందిని వేధించే సాధారణ సమస్య.. శరీరంలో వేడి చేసింది అని చెప్పడం. అయితే, శరీరంలో వేడి చేయడం అనేది ఒక రోగం కాదు.. ఇది ఒక్కొక్కరి శరీర తత్వానికి అనుగుణంగా స్వల్పంగా మారే బేసల్ బాడీ టెంపరేచర్ వల్ల కలిగే ఒక భావన మాత్రమే. కొందరి శరీరాలు సహజంగానే కొద్దిగా వేడిగా ఉంటాయి. వేడి చేయడం వల్ల జలుబు, కడుపు నొప్పి, గ్యాస్ట్రిక్ సమస్యలు, ఎసిడిటీ, మూత్రంలో మంట, చర్మంపై దద్దుర్లు, మొటిమలు, మలబద్ధకం వంటి అనేక లక్షణాలు కనిపించవచ్చు. ఈ సమస్యలన్నింటినీ వాడుక భాషలో వేడి చేయడం అని వ్యవహరిస్తారని పేర్కొంటున్నారు ఆరోగ్య నిపుణులు.. ఎండాకాలంలో వేడిని తగ్గించుకునేందుకు.. కొన్ని టిప్స్ పాటించడం మంచిది. దీంతో ఆరోగ్యంగా ఉండవచ్చు..

శరీర వేడిని తగ్గించడానికి తీసుకోవాల్సిన ఆహారాలు:

శరీరాన్ని చల్లబరచడానికి ముఖ్యంగా ద్రవ పదార్థాలు తీసుకోవడం చాలా ముఖ్యం. రోజుకు కనీసం 3 లీటర్ల నీటిని తాగాలి. ఒకేసారి కాకుండా తరచుగా, కొద్దికొద్దిగా నీటిని తీసుకోవడం మంచిది. కేవలం నీరే కాకుండా, శరీరానికి చలువ చేసే ద్రవాలను ఎంచుకోవాలి. కొబ్బరి నీళ్ళు, మజ్జిగ, నిమ్మరసం, సబ్జా గింజలు కలిపిన నిమ్మరసం, చెరుకు రసం వంటివి శరీర వేడిని తగ్గించి, హైడ్రేటెడ్‌గా ఉంచడానికి బాగా ఉపయోగపడతాయి. ఇవి మలబద్ధకం, చర్మ సమస్యలు, యూరిన్ ఇన్ఫెక్షన్లు వంటి వేడి సంబంధిత సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. కూరగాయల విషయానికి వస్తే, బీరకాయ, సొరకాయ వంటి నీటి శాతం అధికంగా ఉండే కూరగాయలను ఎక్కువగా తీసుకోవాలి. పండ్లలో కర్బూజ (షుగర్ శాతం తక్కువ), పుచ్చకాయ (నీటి శాతం అధికం) వంటివి వేడిని తగ్గించడానికి మంచివి. అధిక షుగర్ ఉండే పండ్లు డీహైడ్రేషన్‌కు దారితీస్తాయి కాబట్టి జాగ్రత్తగా ఉండాలి.

నివారించాల్సిన ఆహారాలు, అలవాట్లు:

మనం తీసుకునే ఆహారం శరీర వేడిపై చాలా ప్రభావాన్ని చూపుతుంది. నూనెలో బాగా వేయించిన ఆహారాలు, డీప్ ఫ్రైడ్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్, అత్యంత మసాలా పదార్థాలను వీలైనంత వరకు తగ్గించాలి. ఇవి డీహైడ్రేషన్‌కు గురిచేసి శరీరంలో వేడిని పెంచుతాయి. కూల్ డ్రింక్స్ పేగుల జూం సమతుల్యతను దెబ్బతీస్తాయి కాబట్టి వాటిని పూర్తిగా నివారించాలి. వేడిని కలిగించే పదార్థాలలో పొగతాగడం (స్మోకింగ్), మద్యం సేవించడం (ఆల్కహాల్) ముఖ్యమైనవి. ఎండాకాలంలో వీటిని పూర్తిగా మానుకోవాలి.

సూర్యరశ్మి నుండి రక్షణ, ఇంటి చిట్కాలు:

మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి, ఈ సమయంలో బయటకి వెళ్లకుండా ఉండాలి. తప్పనిసరిగా వెళ్ళాల్సి వస్తే గాగుల్స్, స్కార్ఫ్‌లు, క్యాప్‌లు, గొడుగులు వంటివి ఉపయోగించి సూర్యరశ్మి నుండి చర్మాన్ని రక్షించుకోవాలి. కొన్ని ఇంటి చిట్కాలు కూడా శరీర వేడిని తగ్గించడంలో సహాయపడతాయి. అరికాళ్ళకు నూనెతో మసాజ్ చేసుకోవడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడి శరీర వేడి తగ్గుతుంది. చర్మంపై దద్దుర్లు లేదా మొటిమలు వచ్చినప్పుడు, రసాయనాలు కలిసిన క్రీములకు బదులుగా చందనం (గంధం) పూతను సహజసిద్ధమైన కూలింగ్ ఏజెంట్‌గా ఉపయోగించవచ్చు.

వైద్యుడిని ఎప్పుడు సంప్రదించాలి

పైన పేర్కొన్న జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ, మూత్రంలో విపరీతమైన మంట, తరచుగా యూరిన్ ఇన్ఫెక్షన్లు, తట్టుకోలేనంత ఎసిడిటీ వంటి సమస్యలు తగ్గకపోతే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. కొన్నిసార్లు థైరాయిడ్ వంటి సమస్యలు ఉన్నప్పుడు కూడా శరీర వేడిని తట్టుకోలేకపోవడం, ఉష్ణోగ్రతలో హెచ్చుతగ్గులు ఉండటం జరుగుతుంది. కాబట్టి, పదేపదే వేడిని తట్టుకోలేకపోతుంటే థైరాయిడ్ పరీక్షలు చేయించుకోవడం మంచిది. చివరగా, ఫ్రిజ్ నీటి బదులు సాధారణ ఉష్ణోగ్రతలోని నీటిని లేదా మట్టి కుండలోని నీటిని తాగడం ద్వారా సహజసిద్ధమైన చల్లదనాన్ని పొందవచ్చు. మట్టి కుండలోని నీరు మినరల్స్‌ను కాపాడుతూ గొంతు నొప్పి వంటి సమస్యలను కూడా నివారిస్తుంది. ఈ జాగ్రత్తలన్నీ పాటించడం ద్వారా ఎండాకాలంలో శరీరాన్ని చల్లగా, ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. ఏమైనా సమస్యలతో బాధపడుతుంటే.. ఆరోగ్య నిపుణులను సంప్రదించడం మంచిది. మరిన్ని లైఫ్‌స్టైల్ వార్తల కోసం ఇక్కడ క్లిక్ చేయండి..

## సంక్షోభ సమయంలో మరోసారి భారతదేశానికి రక్షకుడిగా నిలిచిన రష్యా.. కష్టాలు తీరినట్లే..!

**యుద్ధం ఉద్రిక్తతల నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిని ఇరాన్ తన ఆధీనంలోకి తీసుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌కు చమురు సరఫరాలను అడ్డుకుంది. దీని ఫలితంగా ముడి చమురు ధరలు పెరగవచ్చన్న వార్తలు ఊపందుకున్నాయి. ఇది భారతదేశం - చైనా వంటి దేశాల ఆర్థిక వ్యవస్థలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే, రష్యా ఎప్పటిలాగే, ఈ సంక్షోభ సమయంలో భారతదేశానికి మరోసారి మద్దతు ఇవ్వడానికి రక్షకుడిగా ముందుకు వచ్చింది.**




యుద్ధం ఉద్రిక్తతల నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిని ఇరాన్ తన ఆధీనంలోకి తీసుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌కు చమురు సరఫరాలను అడ్డుకుంది. దీని ఫలితంగా ముడి చమురు ధరలు పెరగవచ్చన్న వార్తలు ఊపందుకున్నాయి. ఇది భారతదేశం చైనా వంటి దేశాల ఆర్థిక వ్యవస్థలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే, రష్యా ఎప్పటిలాగే, ఈ సంక్షోభ సమయంలో భారతదేశానికి మరోసారి మద్దతు ఇవ్వడానికి రక్షకుడిగా ముందుకు వచ్చింది. ఇంటర్‌ఫ్యాక్స్ వార్తా సంస్థ కథనం ప్రకారం, రష్యా ఉప ప్రధాన మంత్రి అలెగ్జాండర్ నోవాక్ బుధవారం (మార్చి 04) కీలక ప్రకటన చేశారు. చైనా, భారతదేశాలకు చమురు సరఫరాలను పెంచడానికి రష్యా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. హోర్ముజ్ జలసంధిలో పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య ఇది ఒక బఫర్‌గా ఉపయోగపడుతుందని ఆయన అన్నారు.దఫిబ్రవరి నెలలో భారతదేశానికి అతిపెద్ద ముడి చమురు సరఫరాదారుగా రష్యా తన స్థానాన్ని నిలబెట్టుకుంది. సౌదీ అరేబియా రికార్డు స్థాయిలో ఎగుమతులతో అంతరాన్ని తగ్గించింది. ఫిబ్రవరిలో రష్యన్ దిగుమతులు 1 ఎఎం కంటే కొంచెం ఎక్కువగా ఉన్నాయని, జనవరిలో ఇది 1.1 ఎఎం నుండి తగ్గిందని డేటా చూపించింది. అయితే సౌదీ అరేబియా వాల్యూమ్‌లను నెలవారీగా దాదాపు 30% పెంచి 1 ఎఎం కంటే ఎక్కువగా చేసింది. ప్రపంచవ్యాప్తంగా చమురు, గ్యాస్ రవాణాకు కీలకమైన ఈ వ్యూహాత్మక జలమార్గంపై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ పూర్తి నియంత్రణను ప్రకటించడంతో రష్యా నుంచి ఈ ప్రకటన వచ్చింది. “ప్రస్తుతం, హోర్ముజ్ జలసంధి ఇస్లామిక్ రిపబ్లిక్ నావికాదళం పూర్తి నియంత్రణలో ఉంది” అని గార్డ్స్ నేవీ అధికారి మొహమ్మద్ అక్బర్జాదే వార్తా సంస్థతో చెప్పారు. ఈ మార్గాన్ని దాటడానికి ప్రయత్నించే నౌకలు క్షిపణులు, విచ్చలవిడి డ్రోన్‌ల వంటి ముప్పును ఎదుర్కొంటాయని హెచ్చరించారు. ఈ పరిణామం మంగళవారం (మార్చి 03) అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన తర్వాత జరిగింది. అమెరికా నావికాదళం కారిడార్ గుండా చమురు ట్యాంకర్లకు రక్షణ కల్పించడానికి సిద్ధంగా ఉందని, పెరుగుతున్న శత్రుత్వాల మధ్య నావిగేషన్ స్వేచ్ఛను కాపాడుకోవడానికి వాషింగ్టన్ నిబద్ధతను ప్రదర్శిస్తుందన్నారు. భారతదేశం ముడి దిగుమతుల్లో రోజుకు దాదాపు 252.7 మిలియన్ బ్యారెళ్లు (ఎఎం) హోర్ముజ్ జలసంధి గుండా వెళతాయి. ప్రధానంగా ఇరాక్, సౌదీ అరేబియా, ఖూజు, కువైట్ నుండి వస్తుంది. ఈ ప్రాంతంలో జరుగుతున్న సైనిక దాడులు కార్గో తరలింపునకు అంతరాయం కలిగించాయి. భారతీయ శుద్ధి కర్మాగారాలు ప్రత్యామ్నాయ వనరులను వెతకవలసి వచ్చింది.

## సఫారీలకు అదృష్టం.. కివీస్‌కు టెన్షన్.. సెమీస్ కు వర్షం పడితే ఫైనల్ చేరేది ఆ జట్టే

**టీ20 ప్రపంచకప్ 2026 క్లైమాక్స్‌కు చేరుకుంది. కోల్‌కతాలోని ప్రతిష్టాత్మక ఈడెన్ గార్డెన్స్ వేదికగా బుధవారం (మార్చి 4) సౌతాఫ్రికా, న్యూజిలాండ్ జట్ల మధ్య తొలి సెమీఫైనల్ పోరు జరగనుంది. ఈ టోర్నీలో ఇప్పటివరకు ఓటమనేదే ఎరుగకుండా దూసుకుపోతున్న సౌతాఫ్రికా ఫుల్ ఫామ్‌లో ఉండగా.. కివీస్ జట్టు ఎలాగైనా ఫైనల్ చేరాలని పట్టుదలతో ఉంది.**




టీ20 ప్రపంచకప్ 2026 క్లైమాక్స్‌కు చేరుకుంది. కోల్‌కతాలోని ప్రతిష్టాత్మక ఈడెన్ గార్డెన్స్ వేదికగా బుధవారం (మార్చి 4) సౌతాఫ్రికా, న్యూజిలాండ్ జట్ల మధ్య తొలి సెమీఫైనల్ పోరు జరగనుంది. ఈ టోర్నీలో ఇప్పటివరకు ఓటమనేదే ఎరుగకుండా దూసుకుపోతున్న సౌతాఫ్రికా ఫుల్ ఫామ్‌లో ఉండగా.. కివీస్ జట్టు ఎలాగైనా ఫైనల్ చేరాలని పట్టుదలతో ఉంది. అయితే, ఈ కీలక మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉందనే వార్తలు అభిమానులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఒకవేళ వరుణుడు ఆటంకం కలిగిస్తే ఏ జట్టు ఫైనల్ చేరుతుంది ఐసీసీ నిబంధనలు ఏం చెబుతున్నాయి? అనే విషయాలు ప్రస్తుతం ఆసక్తికరంగా మారాయి. ఈ మెగా టోర్నీలో సౌతాఫ్రికా ప్రస్థానం అప్రహతితంగా సాగుతోంది. గ్రూప్ స్టేజ్ నుంచి సూపర్-8 వరకు అన్ని మ్యాచ్‌లను గెలిచిన ప్రోటీస్ జట్టు.. భారత్ వంటి బలమైన జట్టును కూడా ఓడించి సెమీస్‌కు దూసుకొచ్చింది. మరోవైపు న్యూజిలాండ్ ప్రయాణం కాస్త ఒడిదుడుకులతో సాగింది. గ్రూప్ స్టేజ్‌లో సౌతాఫ్రికా చేతిలోనే కివీస్ ఓడిపోయింది. ఇక సూపర్ 8లో శ్రీలంకపై గెలిచినా, ఇంగ్లాండ్ చేతిలో ఓటమి పాలైంది. పాకిస్థాన్‌తో జరగాల్సిన మ్యాచ్ వర్షం వల్ల రద్దు కావడంతో కేవలం మూడు పాయింట్లతోనే కివీస్ సెమీస్‌లో అడుగుపెట్టింది. ఐసీసీ నిబంధనల ప్రకారం.. సెమీఫైనల్ మ్యాచ్‌లకు అదనపు సమయంతో పాటు రిజర్వ్ డే సౌకర్యం కూడా ఉంది. బుధవారం గనుక మ్యాచ్‌కు వర్షం పడితే, అధికారులకు 90 నిమిషాల అదనపు సమయం ఉంటుంది. ఒకవేళ ఆ రోజు ఆట సాధ్యం కాకపోతే, గురువారం (మార్చి 5) రిజర్వ్ డే రోజున మ్యాచ్ ఎక్కడ ఆగిందో అక్కడి నుంచే మళ్ళీ మొదలవుతుంది. అయితే దురదృష్టవశాత్తూ రిజర్వ్ డే నాడు కూడా వర్షం పడి ఆట పూర్తిగా రద్దయితే మాత్రం విజేతను నిర్ణయించడానికి టాస్ వేయడం గానీ, బౌల్ అవుట్ నిర్వహించడం గానీ చేయరు. సూపర్-8 పాయింట్ల పట్టిక ఆధారంగానే ఫైనలిస్టును నిర్ణయిస్తారు. సౌతాఫ్రికా తన సూపర్-8 గ్రూప్‌లో 6 పాయింట్లతో టాపర్‌గా నిలవగా.. న్యూజిలాండ్ తన గ్రూప్‌లో కేవలం 3 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. కాబట్టి వర్షం వల్ల సెమీఫైనల్ రద్దయితే నిబంధనల ప్రకారం సౌతాఫ్రికా నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. ఇప్పటికే చోకర్స్ ముద్రతో ఇబ్బంది పడుతున్న ప్రోటీస్ జట్టుకు ఈసారి అదృష్టం కలిసొచ్చేలా కనిపిస్తోంది. మరి ఈడెన్ గార్డెన్స్‌లో వరుణుడు శాంతిస్తాడా లేదా అన్నది వేచి చూడాలి.

## ఇంగ్లాండ్‌తో సెమీస్.. టీమిండియాకు గవాస్కర్ సీరియస్ వార్నింగ్.. ఏం జరిగిందంటే

టీ20 ప్రపంచకప్ 2026 క్లైమాక్స్‌కు చేరుకుంది. మార్చి 5న ముంబైలోని వాంఖడే స్టేడియంలో భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరగనున్న సెమీఫైనల్ పోరుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ కీలక మ్యాచ్‌కు ముందు భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ టీమిండియాను హెచ్చరించారు.

టీ20 ప్రపంచకప్ 2026 క్లైమాక్స్‌కు చేరుకుంది. మార్చి 5న ముంబైలోని వాంఖడే స్టేడియంలో భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరగనున్న సెమీఫైనల్ పోరుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ కీలక మ్యాచ్‌కు ముందు భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ టీమిండియాను హెచ్చరించారు. ఇంగ్లాండ్ జట్టులో ఉన్న ఒక ప్రమాదకరమైన ఆటగాడి గురించి గవాస్కర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రీడా వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్ రూపంలో భారత్‌కు గట్టి ముప్పు పొంచి ఉందని ఆయన విశ్లేషించారు. ప్రస్తుత టోర్నీలో విల్ జాక్స్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటివరకు ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో నాలుగు సార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను గెలుచుకోవడం అతని ఆధిపత్యానికి నిదర్శనం. బ్యాటింగ్‌లో 191 పరుగులు చేయడమే కాకుండా, బౌలింగ్‌లోనూ 7 వికెట్లు పడగొట్టి ఇంగ్లాండ్ సెమీస్ చేరడంలో కీలక పాత్ర పోషించాడు. “పిచ్ గనుక కాస్త టర్న్ అయితే విల్ జాక్స్‌ను ఎదుర్కోవడం భారత బ్యాటర్లకు సవాలుగా మారుతుంది. ముఖ్యంగా సంజు శాంసన్, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా వంటి రైట్ హ్యాండ్ బ్యాటర్లు అతన్ని ఎలా ఎదుర్కొంటారనే దానిపైనే మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంటుంది” అని గవాస్కర్ అభిప్రాయపడ్డారు. ఇంగ్లాండ్ జట్టులో విల్ జాక్స్ ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు రావడం ఆ జట్టుకు పెద్ద ప్లస్ పాయింట్ అని గవాస్కర్ పేర్కొన్నారు. మన జట్టులో శివమ్ దూబే ఎలాగైతే మ్యాచ్ స్వరూపాన్ని మార్చేస్తాడో, ఇంగ్లాండ్‌కు విల్ జాక్స్ కూడా అలాగేనని ఆయన పోల్చారు. వెస్టిండీస్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్ తరహాలోనే ఇంగ్లాండ్‌తో మ్యాచ్ కూడా అత్యంత ఉత్కంఠభరితంగా సాగుతుందని గవాస్కర్ జోస్యం చెప్పారు. రెండు జట్లు కూడా బ్యాటింగ్, బౌలింగ్ మరియు అనుభవంలో సమానంగా ఉన్నాయని, ఎవరు ఒత్తిడిని జయిస్తే వారే ఫైనల్ చేరుతారని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా భారత లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లైన అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, శివమ్ దూబేలకు విల్ జాక్స్ బౌలింగ్ వేసే అవకాశం తక్కువని, కాబట్టి రైట్ హ్యాండ్ బ్యాటర్లే బాధ్యత తీసుకోవాలని గవాస్కర్ సూచించారు. ముంబై పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది, కానీ ఒత్తిడి ఉన్న సమయంలో స్పిన్నర్లు కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. మరి గవాస్కర్ హెచ్చరించినట్లుగా విల్ జాక్స్ భరతం పట్టి టీమిండియా ఫైనల్‌కు దూసుకెళ్తుందో లేదో చూడాలి.

# గ్లోబల్ స్టార్ అక్కడ ఫోర్త్ ప్లేస్‌లో కూడా లేడా?



టాలీవుడ్ స్టార్ హీరోల్లో నెంబరింగ్ గేమ్ ప్రధానంగా నడుస్తోంది. పాన్ ఇండియా సినిమాల ప్రవాహం మొదలైన దగ్గరి నుంచి ఏ స్టార్ హీరో బాక్సాఫీస్ సత్తా ఎంత అన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే కొంత మంది హీరోలు తమ క్రేజీ మూవీలతో బాక్సాఫీస్ వద్ద సోలోగా వందల కోట్ల వసూళ్లని రాబట్టి టాప్ పొజీషన్‌లో ఉన్నారు. అయితే ఈ రేసులో ఇద్దరు ముగ్గురు స్టార్ హీరోలు వెనకబడిపోయారు. వారిలో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఎక్కడ? ఏ స్థానంలో ఉన్నారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఆ తరువాత కూడా అదే తరహాలో భారీ పాన్ ఇండియా సినిమాలుచేస్తూ బాక్సాఫీస్‌ని కొల్లగొడుతున్నాడు. ఫస్ట్ ప్లేస్‌లో ప్రభాస్ స్థిరపడిపోవడంతో తరువాతి స్థానం ఎవరిదిన్నది ఆసక్తికరంగా మారింది. సన్నీ డియోల్ జోరు మామూలుగా లేదుగా ఆ తరువాత ప్లేస్‌ని ఎవరూ ఊహించని విధంగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సొంతం చేసుకుని అందరికి షాక్ ఇచ్చాడు. బన్నీ నటించిన -పుష్ప 2- మూవీ ప్రపంచ వ్యాప్తంగా ఏ స్థాయి సంచలనాలు సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. భారీ అంచనాల మధ్య విడుదలై ఆసక్తికరమైన కంటెంట్‌తో బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టించింది. ప్రపంచ వ్యాప్తంగా రూ.1705 కోట్లు రాబట్టి బన్నీని రెండవ స్థానంలో నిలబెట్టింది. ప్రస్తుతం బన్నీ ఈ రేంజ్‌కి మించిన సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతున్నాడు. చరణ్ మాస్ పవర్.. సౌత్ ఇండియాలో తిరుగులేని నెంబర్ వన్ హిట్! ఇక మూడవ ప్లేస్‌ని గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ దక్కించుకుంటాడని అంతా భావించారు కానీ ఆ స్థానాన్ని మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ సొంతం చేసుకున్నాడు. కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ నటించిన యాక్షన్ డ్రామా -దేవర-. ఎన్టీఆర్ డ్యుయెల్ రోల్‌లో నటించిన ఈ మూవీ భారీ అంచనాల మధ్య విడుదలై ఆశించిన స్థాయిలో మాత్రం వసూళ్లని రాబట్టలేకపోయింది. ఫైనల్‌గా రూ.420 కోట్లని రాబట్టి పాన్ ఇండియా స్టార్‌ల రేస్‌లో వసూళ్ల పరంగా ఎన్టీఆర్‌ని నాలుగవ స్థానంలో నిలబెట్టింది. చాశ్రీంశీ =ఘుం - ఇరాన్ (ఎం) యుఎస్ వార్: స్టార్ హీరో 'ఎయిర్‌లిఫ్ట్' సీక్వెల్ ప్లాన్? ఇదిలా ఉంటే స్టార్ హీరోలంతా పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ల కోసం ఎదురు చూస్తున్న వేళ సైలెంట్‌గా వచ్చేసి తేజ సజ్జ ఫిఫ్త్ ప్లేస్‌ని ఆక్రమించేశాడు. ప్రశాంత్ వర్మ డైరెక్షన్‌లో రూపొందిన ఫాంటసీ యాక్షన్ మూవీ -హను మాన్-. భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ మూవీ పాన్ ఇండియా వైడ్‌గా బ్లాక్ బస్టర్ అనిపించుకుని బాక్సాఫీస్ వద్ద రూ.296 కోట్లు రాబట్టింది. ఈ సంక్రాంతి విడుదలైన -మన శంకరప్రసాద్‌గారు-తో (295 కోట్లు) మెగాస్టార్ ఆరవ ప్లేస్‌ని, రూ.286 కోట్లతో ఓజీ మూవీతో పవన్ కల్యాణ్ ఏడవ ప్లేస్‌ని, సంక్రాంతికి వస్తున్నాం- (260 కోట్లు)తో వెంకటేష్ ఎనిమిదవ ప్లేస్‌ని, -రంగస్థలం- (215 కోట్లు)తో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తొమ్మిదవ ప్లేస్‌ని, సరిలేరు నీకెవ్వరు (210 కోట్లు)తో మహేష్ పదవ ప్లేస్‌ని దక్కించుకున్నారు. రానున్న -పెద్ది-, వారణాసి సినిమాలతో ఈ ప్లేస్‌లు మారే అవకాశం ఉంది.

# అప్పుడు చరణ్ క్లాస్‌మేట్.. కట్ చేస్తే ఇప్పుడు తల్లిగా చేసింది.. ఈ హీరోయిన్ ఎవరో తెలుసా.?



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తన మ్యాసీవ్ మాస్ ఎక్స్‌ట్రావగాంజా 'పెద్ది' తో బాక్సాఫీస్‌ను అదరగొట్టడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ షాట్ గ్లింప్స్, అలాగే ఫస్ట్ సింగిల్ "చికిరి చికిరి"కు వచ్చిన సెన్సేషనల్ రెస్పాన్స్‌తో సినిమా దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. టాలీవుడ్‌లో స్టార్ హీరోల కొడుకులు స్టార్ హీరోలు అవుతారనే గ్యారెంటీ ఉండదు. సినిమా పరిశ్రమలో ప్రతిభ ఎంత ముఖ్యమో మనందరికీ తెలిసిందే.. సరైన ప్రతిభ లేకపోతే ఎంత కష్టపడినా కొన్నిసార్లు ఫలితం దక్కకపోవచ్చు. అయితే, మెగాస్టార్ చిరంజీవి తనయుడు రామ్ చరణ్ తండ్రిని మించిన తనయుడిగానే ఎదిగారు. ఆయన పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపును సంపాదించుకొని, తండ్రికి తగ్గ తనయుడిగా తన సత్తాను చాటుకున్నారు. సినిమా సినిమాకు వేరియేషన్స్ చూపిస్తూ ప్రేక్షకులను అలరిస్తూ గ్లోబల్ స్టార్ గా పేరు తెచ్చుకున్నారు చరణ్.

**ఒకే ఒక్క సీన్ సినిమా రేంజ్‌నే మార్చేసింది.. కట్ చేస్తే రూ.400కోట్ల బ్లాక్ బస్టర్**

ప్రస్తుతం చరణ్ పెద్ది సినిమాలో నటిస్తున్నారు. బుచ్చి బాబు సన దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలవాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్స్, సాంగ్స్ సినిమా పై అంచనాలను భారీగా పెంచేశాయి. అయితే, రామ్ చరణ్‌కు సంబంధించిన ఒక ఆశ్చర్యకరమైన విషయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆయన క్లాస్‌మేట్ అయిన ఒక హీరోయిన్ ఆయనకు ఒక సినిమాలో తల్లిగా నటించారని మీకు తెలుసా.? వినడానికి ఆశ్చర్యంగా అనిపించినా ఇది నిజం. ఆ హీరోయిన్ మరెవరూ కాదు, టాలీవుడ్ హాట్ బ్యూటీ శ్రియా శరన్. స్టార్ హీరో రామ్ చరణ్, హీరోయిన్ శ్రియా శరన్ ఇద్దరూ నటనకు సంబంధించి ఒకేచోట శిక్షణ తీసుకున్నారు. ఈ విధంగా వారు క్లాస్‌మేట్స్ అయ్యారు. కాగా ఆర్ఆర్ఆర్ సినిమాలో రామ్ చరణ్ చిన్నప్పటి పాత్రకు శ్రియ తల్లిగా నటించింది. శ్రియ చరణ్ కంటే మూడేళ్లు పెద్దది కావడం గమనార్హం. శ్రియ చరణ్ కంటే చాలా సంవత్సరాల ముందే సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి, సీనియర్ నటిగా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పర్చుకుంది. మెగా హీరోలతో శ్రియ నటించిన మెజారిటీ సినిమాలు బాక్స్ ఆఫీస్ వద్ద విజయం సాధించాయి. శ్రియ సీనియర్ హీరోయిన్ అయినప్పటికీ, యువతలో ఆమెకు ఉన్న క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. ఆమె ప్రస్తుతం నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలకే ప్రాధాన్యత ఇస్తున్నారు.

# రామ్ చరణ్ డ్యాన్స్ పై చిరు రియాక్షన్.. పెద్ది గురించి స్పెషల్ ట్వీట్..

రామ్ చరణ్ డ్యాన్స్ లో ఉండే గ్రేస్, పవర్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. మరోసారి తన డ్యాన్స్ తో కుమ్మేశాడు చెర్రీ. తాజాగా విడుదలైన రై రై రా రా సాంగ్ లో మాస్ గెటప్ లో చరణ్ చేసిన డ్యాన్స్ మరో లెవల్ అన్నట్లు ఉంది. ఇక వాయిస్ తో ఏఆర్ రెహమాన్ మరోసారి మ్యాజిక్ క్రియేట్ చేశాడు. ప్రస్తుతం ఈ సాంగ్ వీడియో యూట్యూబ్ లో దూసుకుపోతుంది. తాజాగా చెర్రీ డ్యాన్స్ పై చిరు ట్వీట్ చేశారు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తన మ్యాసీవ్ మాస్ ఎక్స్‌ట్రావగాంజా 'పెద్ది' తో బాక్సాఫీస్‌ను అదరగొట్టడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ షాట్ గ్లింప్స్, అలాగే ఫస్ట్ సింగిల్ "చికిరి చికిరి"కు వచ్చిన సెన్సేషనల్ రెస్పాన్స్‌తో సినిమా దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ చిత్రాన్ని ఎపిక్ స్కేల్‌లో తెరకెక్కిస్తూ, రామ్ చరణ్‌ను పూర్తిగా రగ్గడ్ అవతార్‌లో చూపిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సంగీతాన్ని ఆస్కార్ విజేత ఎఆర్ రెహ్మాన్ సమకూరుస్తున్నారు. తాజాగా మేకర్స్ రెండో సింగిల్ "రై రై రా రా"ను విడుదల చేశారు. ఏఆర్ రెహ్మాన్ స్వయంగా ఆలపించిన ఈ పవర్ ఫుల్ డ్యాన్స్ నంబర్ పల్సేటింగ్ బీట్స్, ఇన్‌ఫెక్షియస్ రిథమ్‌తో అదిరిపోయే మాస్ ఎనర్జీని అందిస్తోంది. స్టార్ ఎంట్రీ సాంగ్ ఎలా ఉండాలో కొత్త బెంచ్‌మార్క్ సెట్ చేస్తూ, భారతీయ సినిమాలోనే అత్యంత భారీ, ఎలక్ట్రిఫైయింగ్ ఇంట్రడక్షన్ నంబర్‌లలో ఒకటిగా నిలిచేలా రూపుదిద్దుకుంది. రామ్ చరణ్ తన ట్రేడ్‌మార్క్ మాస్ ఎనర్జీ, గ్రేస్‌ఫుల్ ఫినెస్ తో అదరగొట్టారు. ఆయన ఫ్లూయిడ్ మూవ్‌మెంట్స్, పవర్‌ఫుల్ ఫుట్‌వర్క్, కరిస్మాటిక్ ఎక్స్‌ప్రెషన్స్ ఈ పాటను ఇన్‌స్టంట్ చార్ట్‌బస్టర్‌గా మార్చేశాయి. జానీ మాస్టర్ అందించిన డైనమిక్ కొరియోగ్రఫీ విజువల్ ట్రీట్ గా నిలిచింది. అనంత శ్రీరామ్ రాసిన సాహిత్యం పూర్తి మాస్ అప్పీల్‌తో ఆకట్టుకుంది, ప్రతి లైన్ రామ్ చరణ్ స్క్రీన్ ప్రెజెన్స్‌ను మరింత ఎలివేట్ చేస్తోంది. ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా అందించిన విజువల్ సెటప్, సినిమాటోగ్రాఫర్ =. రత్నవేలు గ్రాండియర్ లెన్సింగ్‌తో ఈ సాంగ్ లార్జ్ స్క్రీన్ ఫీస్ట్‌గా నిలిచింది. ఈ భారీ స్టార్ ఎంట్రీ నంబర్ రామ్ చరణ్ అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్‌ను సెలబ్రేట్ చేస్తూ, సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. భారతీయ సినీ చరిత్రలోనే బిగ్గెస్ట్ ఇంట్రడక్షన్ సాంగ్‌లలో ఒకటిగా నిలిచింది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. శివ రాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పెద్ది ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కానుంది. సమ్మర్ హాలిడే సీజన్‌ను డామినేట్ చేయడానికి ఇది పర్ఫెక్ట్ టైం. ఇదిలా ఉంటే.. రామ్ చరణ్ డ్యాన్స్ పై చిరంజీవి రియాక్ట్ అయ్యారు. రామ్ చరణ్ ను ఇలా చూడటం నాకు అపారమైన గర్వాన్ని నింపుతుంది. అతను కదిలే విధానం చూడటానికి ఆనందంగా ఉందని ట్వీట్ చేశారు.





# దళపతి విజయ్‌తో విడాకులు.. భరణంగా సంగీతకు ఎన్ని కోట్లు రానున్నాయంటే?



కోలీవుడ్ స్టార్ హీరో, టీవీకే పార్టీ అధినేత విజయ్ దళపతి విడాకుల వ్యవహారం ఇప్పుడు సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. విజయ్ తో విడాకులు కావాలంటూ ఆయన భార్య సంగీత దాఖలు చేసిన పిటిషన్ త్వరలోనే విచారణకు రానుంది. కోలీవుడ్ స్టార్ హీరో, టీవీకే పార్టీ అధినేత దళపతి విజయ్ నుంచి విడాకులు కావాలంటూ ఆయన భార్య సంగీత కోర్టు మెట్లెక్కిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆమె తమిళనాడులోని చెంగల్పట్టు ఫ్యామిలీ కోర్టులో విడాకుల పిటిషన్ దాఖలు చేసింది. ఈ సందర్భంగా ఓ ప్రముఖ నటితో విజయ్ కు అఫైర్ ఉందని సంగీత ఆరోపించింది. ఈ క్రమంలో తన కుటుంబ పోషణ, జీవనోపాధి కింద విజయ్ ఆస్తుల్లో 50 శాతం చెల్లించాలని ఆమె కోర్టును కోరింది. కాగా దళపతి విజయ్ ఆస్తుల విలువ సుమారు రూ. 600 కోట్లు. మరి ఇప్పుడీ ఆస్తుల్లో 50 శాతం అంటే సంగీతకు దక్కుతుందా? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. సోషల్ మీడియాలో ఎక్కువగా చర్చకు వస్తున్న ప్రశ్న ఏమిటంటే..ఒక వేళ తీర్పు సంగీతకు అనుకూలంగా వస్తే, విజయ్ తన ఆస్తులలో 50% ఇవ్వాల్సి వస్తుందా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం జోహో సీఈవో శ్రీధర్ వెంబు, ప్రమీలా శ్రీనివాసన్ డైవోర్స్ దేశంలో అత్యంత ఖరీదైన విడాకులుగా పరిగణిస్తున్నారు. అలాగే హృతిక్ రోషన్, సుస్సాన్ ఖాన్ విడాకుల సమయంలో, అతను తన భార్యకు దాదాపు రూ.380 కోట్ల విలువైన ఆస్తిని ఇచ్చాడు. ఇప్పుడు విజయ్ కూడా రూ.600 కోట్ల ఆస్తులలో సంగీతకు 50% వాటా ఇస్తాడా? అన్నది ప్రధాన ప్రశ్న. అయితే పాశ్చాత్య దేశాలలో లాగా భారత చట్టం ఆస్తిని 50-50 శాతం విభజించడాన్ని తప్పనిసరి చేయలేదు. విడాకులు తీసుకున్న తర్వాత భార్యకు తన భర్త ఆస్తిలో 50% ఇవ్వాలని భారత చట్టం ఆదేశించదు. '50-50 ఆస్తి విభజన' నమూనా కొన్ని పాశ్చాత్య దేశాలలో సాధారణం, కానీ భారతదేశంలోని చట్టాలు భిన్నంగా ఉంటాయి. భార్యాభర్తలిద్దరి ఆదాయం, ఇంటి ఖర్చులు, పిల్లల అవసరాలు తదితర అంశాలను కోర్టు నిశితంగా పరిశీలిస్తుంది. ప్రతి కేసు భిన్నంగా ఉంటుంది. అలాగే, దళపతి విజయ్ సంపాదించిన ఆస్తిలో అతని సొంత ఆస్తి? అతని తండ్రి సంపాదించిన ఆస్తి ఎంత? మొదలైన అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది. ఆ తర్వాతే విడాకుల భరణంపై ఓ అంచనాకు వస్తున్నారా?



# జిమ్‌లో టోన్డ్ బాడీ కోసం సంయుక్త కష్టం చూసారా?



Harder ...



Push...

తాజాగా బ్లూ బాడీ ఫిట్ జిమ్నాస్టిక్ దుస్తులను ధరించి సంయుక్త జిమ్ లో చెమటలు చిందిస్తున్న ఫోటోలు వైరల్ గా మారుఉన్నాయి.

టాలీవుడ్ గోల్డెన్ లెగ్ సంయుక్త మీనన్ గురించి తెలుగుసుకునే కొద్దీ ఇంట్రెస్టింగ్ విషయాలున్నాయి. టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న మలయాళ ముద్దుగుమ్మ సంయుక్త మీనన్ ఇటీవల తన ఫిట్‌నెస్ మంత్రంతో నెటిజన్ల గుండెల్లో మంటలు రేపుతోంది. జిమ్‌లో కఠినమైన కసరత్తులు చేస్తూ, చెమటలు చిందిస్తున్న ఫోటోలను ఈ బ్యూటీ నిరంతరం సోషల్ మీడియాలో షేర్ చేస్తోంది. తాజాగా బ్లూ బాడీ ఫిట్ జిమ్నాస్టిక్ దుస్తులను ధరించి సంయుక్త జిమ్ లో చెమటలు చిందిస్తున్న ఫోటోలు వైరల్ గా మారుఉన్నాయి. దీనికి -ఫీల్ ది బర్న్ బేబి- అంటూ ఇచ్చిన క్యాప్షన్ తన శ్రమకు అద్దం పడుతోంది. పర్ఫెక్ట్ ఫిజిక్ కోసం సంయుక్త పడుతున్న తపన చూస్తుంటే.. అందగత్తెలకు కేవలం అదృష్టం మాత్రమే కాదు.. అంకితభావం కూడా ఉండాలని నిరూపిస్తోంది. గ్లోబల్ స్టార్ అక్కడ ఫోర్త్ ప్లేస్‌లో కూడా లేడా? చాుజవతీఅంవఎవత్ జిమ్‌లో సంయుక్త చేస్తున్న వర్కవుట్స్ చూస్తుంటే ఫిట్‌నెస్ విషయంలో ఈ భామకు ఉన్న మక్కువ అర్థమవుతోంది. టైట్ ఫిట్ జిమ్ వేర్‌లో హాలి గాళ్ కనిపిస్తున్న తీరు, ఆ బాడీ లాంగ్వేజ్ అభిమానుల మనసు దోచుకుంటున్నాయి. అందానికి ప్రతిభ తోడవ్వడమే కాదు.. నిరంతరం కష్టించే తత్వం ఉండటం వల్లే ఈరోజు పరిశ్రమలో అగ్ర హీరోయిన్ హోదా దక్కుతోంది. ఈ ఫోటోషూట్ ఇప్పుడు కుర్రకారులో కొత్త స్ఫూర్తిని నింపుతూ.. సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. చాశ్రీంశీ =ఘుం - కథ నచ్చితే చిన్న పాత్రలైనా చేస్తా సంయుక్త మీనన్ కెరీర్‌లో దిగ్గజ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ అండదండలు, సపోర్ట్ పెద్ద ప్లస్ పాయింట్‌గా నిలిచాయి. తనలోని నటనను గుర్తించి వరుసగా అవకాశాలు కల్పించడంలో మాటల మాయావి పాత్ర కీలకం. సరైన కథలను ఎంచుకుంటూ.. తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంటున్న ఈ బ్యూటీ అటు గ్లామర్ పరంగా, ఇటు పెర్ఫార్మెన్స్ పరంగా ఇండస్ట్రీలో ఒక వెలుగు వెలుగుతోంది. సంయుక్త గోల్డెన్ లెగ్ ప్రయాణం! కేరళకు చెందిన సంయుక్త మీనన్ మలయాళ చిత్ర పరిశ్రమ ద్వారా సినీ రంగ ప్రవేశం చేసింది. మొదట చిన్న చిన్న పాత్రలతో తన ప్రస్థానాన్ని మొదలుపెట్టినా, తనలోని నటనతో అతి త్వరగానే గుర్తింపు పొందింది. -తీవండి- వంటి చిత్రాలు ఆమెకు మలయాళంలో మంచి బ్రేక్ ఇచ్చాయి. భాష ఏదైనా పాత్రలో లీనమై నటించడమే ఈ భామ విజయ రహస్యం. తెలుగులోకి -భీమ్లా నాయక్- చిత్రంతో అడుగుపెట్టిన సంయుక్త, మొదటి సినిమాతోనే టాలీవుడ్ ప్రేక్షకుల మనసు గెలుచుకుంది. ఆ తర్వాత వచ్చిన బింబిసార, సార్, విరూపాక్ష చిత్రాలు వరుసగా బాక్సాఫీస్ వద్ద ఘనవిజయాలు సాధించడంతో ఆమెను ఇండస్ట్రీ -గోల్డెన్ లెగ్-గా పిలవడం మొదలుపెట్టింది. నటించిన ప్రతి సినిమా సూపర్ హిట్ కావడంతో స్టార్ హీరోల కళ్లలో పడింది. సన్నీ డియోల్ జోరు మామూలుగా లేదుగా సంయుక్త కెరీర్‌లో వైవిధ్యం స్పష్టంగా కనిపిస్తుంది. కేవలం అందాల ప్రదర్శనకే పరిమితం కాకుండా, కథలో ప్రాధాన్యత ఉన్న పాత్రలను మాత్రమే ఎంచుకుంటోంది. గ్రామీణ యువతిగా, మోడ్రన్ అమ్మాయిగా, భయపెట్టే పాత్రలో ఇలా ప్రతి పాత్రలోనూ వైవిధ్యం చూపిస్తూ నటిగా తన స్థాయిని పెంచుకుంది. అందుకే నేడు తనకు భారీ బడ్జెట్ చిత్రాల్లో అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుత సినిమాలు.. నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా నటిస్తున్న ప్రతిష్టాత్మక పీరియడ్ డ్రామా -స్వయంభు-లో సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమా కోసం సంయుక్త ప్రత్యేకంగా గుర్రపు స్వారీ, యుద్ధ విద్యల్లో శిక్షణ తీసుకుంది. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఇందులో ఆమె లుక్ చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని సమాచారం. మహారాగ్ని: క్వీన్ ఆఫ్ క్వీన్స్ అనే హిందీ చిత్రంలోను నటిస్తోంది. బాలీవుడ్ లెజెండ్ కాజోల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాతో సంయుక్త బాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. ఇందులో సంయుక్త -మోహిని- అనే కీలక పాత్రలో నటిస్తోంది. ప్రభుదేవా కూడా ఈ చిత్రంలో ఒక ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. చరణ్ మాస్ పవర్.. సౌత్ ఇండియాలో తిరుగులేని నెంబర్ వన్ హిట్! ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ముంబై పరిసరాల్లో జరుగుతోంది. ఉత్తరాది ప్రేక్షకులను కూడా ఆకట్టుకోవడానికి సంయుక్త సిద్ధమైంది. మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ - దర్శకుడు జీతూ జోసెఫ్ కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ థ్రిల్లర్ రామ్ లోను నటిస్తోంది. లోకేష్ కనగరాజ్ సమర్పణలో, రాఘవ లారెన్స్ హీరోగా నటిస్తున్న -బెంజ్-లో సంయుక్త కథనాయిక. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. స్లమ్ డాగ్: 33 టెంపుల్ రోడ్ అనే మరో వైవిధ్యమైన ప్రాజెక్ట్ లోను సంయుక్త నటిస్తోంది.

# అంటార్కిటికాలో వారణాసి



ఇటీవలే జార్జియాలో 'వారణాసి' చిత్రం తాలూకు మేజర్ షెడ్యూల్ పూర్తయింది. అక్కడ రామాయణం నేపథ్య కీలక ఘట్టాలను తెరకెక్కించినట్లు తెలిసింది. మహేష్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ మూవీ శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న వరల్డ్‌వైడ్‌గా ఈ సినిమా విడుదలకానుంది. ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్‌కు సంబంధించిన తాజా అప్‌డేట్‌ను చిత్ర కథానాయిక ప్రియాంకచోప్రా తన సోషల్‌మీడియా ద్వారా పంచుకుంది. ఆమె తాజా హాలీవుడ్ చిత్రం 'ది బ్లఫ్' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఇందులో ప్రియాంకచోప్రా అభినయాన్ని ప్రశంసిస్తూ మహేష్‌బాబు ఓ పోస్ట్ పెట్టారు. దీనికి ప్రియాంక చోప్రా 'థాంక్యూ మై ఫ్రెండ్.. త్వరలో అంటార్కిటికాలో కలుద్దాం' అని రిప్లై ఇచ్చింది. దాంతో 'వారణాసి' తదుపరి షెడ్యూల్‌పై అప్‌డేట్ వచ్చిందంటూ అభిమానులు ఈ న్యూస్‌ను షేర్ చేస్తున్నారు. భూమిపై అత్యంత శీతల ప్రాంతమైన అంటార్కిటికాలో షూటింగ్ జరపడం కష్టసాధ్యంగా భావిస్తారు. రవాణా సౌకర్యాలతో పాటు అక్కడ వసతి ఏర్పాట్లు చేసుకోవడం సవాళ్లతో కూడుకున్న వ్యవహారం. అందుకే కొన్ని హాలీవుడ్ సినిమాలు తప్ప ఇప్పటివరకు ఏ భారతీయ సినిమా అక్కడ షూటింగ్ జరుపుకోలేదు. తొలిసారి ఈ ప్రయత్నం చేస్తున్నారు దర్శకుడు రాజమౌళి. భారతీయ పురాణాలు, టైమ్ ట్రావెల్ కలబోసిన సాహసగాథగా అత్యంత భారీ వ్యయంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రియాంకచోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ తదితరులు ప్రధాన పాత్రల్లో పోషిస్తున్నారు.

## చదువులు గాలికి వదిలేసి గాంధీ విగ్రహానికి

# డబ్బులు తగిలిస్తున్న రేవంత్ ఖాన్ ప్రభుత్వం...



హైదరాబాద్//**మార్చి 04 (ఆకాంక్ష)** : విద్యా ఉద్యోగాలను తుంగలో తొక్కేసి ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన రేవంత్ ఖాన్ ప్రభుత్వం విద్యను పట్టించుకోకుండా విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కాలర్షిప్లు ఇవ్వకుండా కళాశాలలో ఇవ్వవలసిన రీయంబర్స్మెంట్ ఫీజులు కూడా ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో ఆదుకుంటుందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మరియు ఖైరతాబాద్ నగర కార్యదర్శి ఎం.ప్రణయ్ కుమార్ విమర్శించారు. అన్ని ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా కూడా ప్రైమరీ స్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు ఖాళీగా ఉన్న ఉద్యోగాలలో ఏ ఉద్యోగాన్ని భర్తీ చేయకుండా రేవంత్ ప్రభుత్వం సమస్యలను గాలికి వదిలేసిందని దుయ్యబట్టారు. ప్రస్తుతం ఏ వీధిలో చూసినా ఏ గ్రామంలో చూసినా గాంధీ విగ్రహాలకు కొదవలేదు. కానీ ప్రత్యేకంగా రేవంత్ స్థాపించే గాంధీ విగ్రహానికి అంత ప్రాధాన్యత ఎందుకు ఇస్తున్నారో అర్థం కావడం లేదు. రేవంత్ రెడ్డికి రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం పైన లేని ఆత్రుత గాంధీ బొమ్మ పైన మాత్రమే ఎందుకు ఉందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు. 53,463 మందికి విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్షిప్లు 9000 కోట్లు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా గాంధీ విగ్రహం కొరకు 5000 కోట్లు ఖర్చు పెట్టాలనుకోవడం ఆయన ప్రజా పాలన అని చెప్పుకునే ప్రభుత్వానికి ఎంతవరకు సార్ధకం అవుతుందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. సమాజంలో విద్య ఆరోగ్యం మెరుగుపడినప్పుడు మాత్రమే సమ సమాజ అభివృద్ధి చెందినట్లుగా భావిస్తుంటాం. కానీ రేవంత్ రెడ్డి దృష్టిలో గాంధీ విగ్రహం నెలకొల్పుకుంటే రాష్ట్ర అభివృద్ధి జరిగినట్లుగా భావిస్తుందని అనుకోవడం ఆయన అవగాహన లోపాన్ని తెలియజేస్తుందన్నారు. ప్రజా సమస్యలు పట్టని రేవంత్ రెడ్డికి తనను నిలువునా కోసినా కూడా డబ్బులు లేవని పత్రికా ప్రకటనలు ఇచ్చిన వ్యక్తికి ఈరోజు గాంధీ విగ్రహం నెలకొల్పడానికి డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయో బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేసారు.

# చిత్తూరు జిల్లాలో దారుణం..

## నాటు తుపాకీతో కాల్పులు యువకుడు మృతి..



చిత్తూర్//**మార్చి 04 (ఆకాంక్ష)** :చిత్తూరు జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. తుమ్మదపాలెంలో కాల్పుల కలకలం రేగింది. సాయి కుమార్ అనే యువకుడిని మరో యువకుడు ఢిల్లీ నాటు తుపాకీతో కాల్చాడు. దీంతో సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు ఢిల్లీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. స్థానికంగా సిసిటివి ఫుటేజులను పరిశీలిస్తున్నారు. మృతుడు, నిందితుడి మధ్య ఉన్న గత పరిచయాలపై ఆరా తీస్తున్నారు. త్వరగా కేసును చేధస్తామని పోలీసులు తెలిపారు.

## బాచుపల్లిలో అర్థరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో బారీగా ఆస్తి నష్టం....

### 35 దుకాణాలు బుగ్గి.. రోడ్డున పడ్డ వ్యాపారులు...



మేడ్చల్//**మార్చి 04 (ఆకాంక్ష)** :మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లిలో అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో బారీగా ఆస్తి నష్టం జరిగింది. విద్యుత్ షార్ట్సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయి. మంగళవారం రాత్రి సుమారు 10.40 గంటల నుంచి 11 గంటల మధ్య ప్రమాదం జరిగింది. మార్కెట్లోని మూడో ఓ షాపునకు సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభం నుంచి నిప్పు రవ్వలు పడ్డాయి. అవి పక్కనే ఉన్న ఫర్నీచర్ షాప్నకు అంటుకొని అలా ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా అగ్నికీలలు వ్యాపించాయి. మేడ్చల్ జిల్లా బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి వేళ భారీ అగ్ని ప్రమాదం జరిగింది. నిజాంపేట సర్కిల్ ప్రగతి నగర్ కమాన్ సమీపంలోని మియాపూర్ రోడ్డులో ఉన్న ఫర్నీచర్ మార్కెట్లో మంటలు చెలరేగడంతో బీభత్సం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో సుమారు 35వరకు దుకాణాలు కాలి బూడిదయ్యాయి. కోట్లాది రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. అయితే అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు. మంటలు గమనించిన వెంటనే స్థానికులు అప్రమత్తమై ఆర్పే ప్రయత్నం చేశారు. ఫర్నీచర్ దుకాణాల్లో కలపతోపాటు రెజిన్, పెయింట్లు వంటి త్వరగా మండుకునే వస్తువులు ఉండటంతో మంటలు నిమిషాల వ్యవధిలోనే మార్కెట్ అంతటా విస్తరించాయి. మంటల తీవ్రతకు దుకాణాల్లో ఉన్న గ్యాస్ సిలిండర్లు పేలడంతో పెద్ద ఎత్తున శబ్దాలు వచ్చాయి. ఇది స్థానికులను మరింత భయభ్రాంతులకు గురి చేసింది. మంటలు ఎగసిపడుతుంటే ఏం చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ ప్రమాదంలో ఆస్తి నష్టం తీవ్రంగా ఉంది. మార్కెట్లో మొత్తం 43 నుంచి 60 వరకు షాపులు ఉండగా, దాదాపు 35 షాపులు మంటలకు ఆహుతయ్యాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం,మొత్తం ఆస్తి నష్టం సుమారు 10 కోట్ల రూపాయల వరకు ఉండొచ్చని తెలుస్తోంది. గత ఎనిమిదేళ్లుగా ఇక్కడే వ్యాపారం చేసుకుంటున్న రమాదేవి అనే మహిళ మాట్లాడుతూ తమ షాపులో ఉన్న సుమారు 20 లక్షల రూపాయల విలువైన వస్తువులన్నీ కాలిపోయాయని, తన బిడ్డలతో కలిసికట్టుబట్టలతో బయటకు రావాల్సి వచ్చిందని కన్నీటి పర్యంతమయ్యారు. చాలా మంది వ్యాపారస్తులు తమ షాపుల నుంచి కనీసం చిన్న వస్తువును కూడా తీసుకోలేక పోయారని, తమ జీవితాలు విగత జీవులుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే బాచుపల్లి పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. కూకట్పల్లి, జీడిమెట్ల, పటాన్ చెరు, మాదాపూర్ కేంద్రాల నుంచి సుమారు ఐదారు ఫైర్ ఇంజిన్లు మంటలను ఆర్పే పనిలో నిమగ్నమయ్యాయి. వీరికి తోడుగా జిహెచ్ఎంసి వాట్ ట్యాంకర్లు, హైడ్రా, డిఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. స్థానికంగా ఉన్న కాలేజీ విద్యార్థులు,యువకులు కూడా మంటలు అదుపులోకి తీసుకొచ్చేందుకు అధికారులకు సహకరించారు. సర్వం కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవాలని బాధితులు వేడుకుంటున్నారు.

## "క్రెడిట్ కార్డు" వాడుతున్న వ్యక్తి చనిపోతే

# దానిపై ఉన్న బిల్లు ఎవరు కట్టాలి

### క్రెడిట్ కార్డు హోల్డర్ మరణిస్తే అప్పు ఫ్యామిలీ మెంబర్స్ కట్టాలా - ఆర్ బీఐ రూల్స్ ఏం చెబుతున్నాయంటే

నేటి డిజిటల్ యుగంలో క్రెడిట్ కార్డుల వాడకం బాగా పెరిగిపోయింది. గృహోపకరణాలు కొనుగోలు చేయాలన్నా, ఆసుపత్రి బిల్ చెల్లించాలన్నా, ఆఖరికి షాపింగ్ చేయాలన్నా కూడా మెజార్టీ పీపుల్ క్రెడిట్ కార్డునే వినియోగిస్తున్నారు. కొందరైతే ఏదైనా వస్తువు కొని ఆ బిల్లును ఈఎంఐ రూపంలో చెల్లిస్తుంటారు. అలాగే, మరికొందరు బ్యాంకుల నుంచి క్రెడిట్ కార్డ్ ఆధారంగా పర్సనల్ లోన్స్ తీసుకుంటుంటారు. కానీ, ఒకవేళ అనుకోని పరిస్థితుల్లో క్రెడిట్ కార్డు హోల్డర్ చనిపోతే ఆ కార్డు పైన ఉన్న అప్పు లేదా బిల్లును ఎవరు తిరిగి చెల్లిస్తారు? ఫ్యామిలీ మెంబర్స్ చెల్లించాలా అనే సందేహాలు చాలా మందికి వస్తుంటాయి. మరి, ఇంతకీ క్రెడిట్ కార్డు తీసుకున్న వ్యక్తి మరణిస్తే దానిపై ఉన్న అప్పును ఎవరు కడతారు ఇందుకు సంబంధించి ఆర్ బీఐ నిబంధనలు, చట్టాలు ఏం చెబుతున్నాయో ఈ స్టోరీలో తెలుసుకుందాం. నార్మల్ గా మనం ఏదైనా లోన్ తీసుకున్నప్పుడు ఇల్లు, భూమి, బంగారం లేదా మరేదైనా వస్తువును షూరిటీగా పెడుతుంటాం.

# రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో సర్కారుకు విజన్ లేదు మిషన్ లేదు

### కేవలం కమీషన్లతో పాలన నడిపిస్తూ, అధికారాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా మారింది...

### గత రెండేళ్లలో సుమారు 60 సార్లు రాష్ట్రంలోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు...

### పరిపాలనలో స్థిరత్వం లేకపోవడం, ఒక స్పష్టమైన దిశా నిర్దేశం లేకపోవడం వల్లే భారీ స్థాయిలో బదిలీలు...

### బిజెపి మాజీ ఎమ్మెల్యే డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ గారు విమర్శ..



హైదరాబాద్//**మార్చి 04 (ఆకాంక్ష)** : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా రెండేళ్ల పాలన పూర్తి చేసుకుంటున్నారు. ఈ రెండు సంవత్సరాల కాలంలో దేశంలోని ఏ రాష్ట్రంలోనూ చూడని విధంగా పరిపాలనా అస్థిరత తెలంగాణలో కనిపిస్తోందని భారతీయ జనతా పార్టీ మాజీ ఎమ్మెల్యే డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ గారు విమర్శించారు.కాంగ్రెస్ సర్కారుకు విజన్ లేదుడ మిషన్ లేదుడ కేవలం కమీషన్లతో పాలన నడిపిస్తూ, అధికారాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా మారిందని బీజేపీ మాజీ ఎమ్మెల్యే డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ ఘాటుగా విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయ్యాయి. అదే సమయంలో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి కూడా రెండేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకుంటున్నారు. ఈ రెండు సంవత్సరాల వ్యవధిలో జరిగిన పరిణామాలను చూస్తే, దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇలాంటి పరిస్థితి కనిపించలేదేమో అన్న భావన కలుగుతోందని ఎన్.వి.ఎస్.ఎస్. విమర్శించారు.గత రెండేళ్లలో సుమారు 60 సార్లు రాష్ట్రంలోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు జరిగాయని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా ఇతర ఉన్నతాధికారుల బదిలీలు కూడా దాదాపు 60 సార్లకు పైగానే జరిగాయని తెలిపారు. పరిపాలనలో స్థిరత్వం లేకపోవడం, ఒక స్పష్టమైన దిశా నిర్దేశం లేకపోవడం వల్లే ఇంత భారీ స్థాయిలో బదిలీలు జరుగుతున్నాయని ఆరోపించారు.ఇక ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనల విషయానికొస్తే, తన పదవిని పదిలం చేసుకోవడానికే 60 సార్లకుపైగా ఢిల్లీకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఇది రాష్ట్ర ప్రయోజనాల కంటే వ్యక్తిగత రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని సూచిస్తోందని అన్నారు. మొత్తానికి, ఇది ఒక దశ, దిశలేని ప్రభుత్వం లాగా పనిచేస్తోందని, దూరదృష్టి లోపించిందని, పాలనపై పట్టులేకపోవడమే ఇన్నిసార్లు ఉన్నతాధికారుల బదిలీలకు కారణమని భారతీయ జనతా పార్టీ అభిప్రాయపడుతోందని ప్రభాకర్ స్పష్టం చేశారు.నిన్న జరిగిన కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 99 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రకటించి, అన్ని కలెక్టర్లు కనీసం 10 రోజులు గ్రామాల్లోనే ఉండి ప్రజల్లో తిరగాలని ఆదేశించడం గమనార్హమని ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ వ్యాఖ్యానించారు. అంటే గత రెండు సంవత్సరాలుగా అధికారులు గ్రామాల్లో తిరగలేదా? ప్రజలను నేరుగా కలవలేదా? అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతోందని అన్నారు. ఇదే విషయాన్ని ఇంతకుముందు జరిగిన సీఎల్పీ సమావేశంలో కూడా ఎమ్మెల్యేలకు "జనాల్లోకి వెళ్లాలి, ప్రజల సమస్యలు పట్టించుకోవాలి" అని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు.ఈ పరిణామాలను బట్టి చూస్తే, "నోబడీ ఈజ్ లిసనింగ్ టు హనరబుల్ సీఎం" అన్న భావన స్పష్టమవుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి చెప్పినా అమలు జరగడం లేదంటే, పాలనపై పట్టులేదనే విషయం బయట పడుతోందని అన్నారు. మొత్తానికి ఈ ప్రభుత్వానికి స్పష్టమైన విజన్ లేదు, మిషన్ లేదు కేవలం కమిషన్ కోసం మాత్రమే పని చేస్తున్నట్టుగా కనిపిస్తోందని ఘాటుగా వ్యాఖ్యానించారు. జీహెచ్ఎంసి పరిధిని విస్తరించి 300 సీట్లతో గ్రేటర్ హైదరాబాద్ ఏర్పాటు చేసి, ఆ తర్వాత కొద్ది రోజుల్లోనే మూడు ముక్కలు చేయడం దూరదృష్టి లోపానికి ఉదాహరణ అన్నారు. ఒక నిర్ణయం తీసుకునే ముందు స్పష్టమైన ప్రణాళిక, లక్ష్యం ఉండాలన్నారు. పురపాలక సంఘాల రిజర్వేషన్ల విషయంలో జిహెచ్ఎంసిని ఒకటిగా చూపించి రిజర్వేషన్లు ఖరారు చేసి, అనంతరం మూడు భాగాలుగా విభజించడం రిజర్వేషన్ ప్రక్రియను దెబ్బతీసే చర్యగా కనిపిస్తోందన్నారు. రాష్ట్రంలో రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలు జరగబోతున్నాయి. ఒకవైపు పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన అంశం సుప్రీంకోర్టులో విచారణలో ఉండగా, మరోవైపు స్పీకర్ స్థాయిలో కూడా నోటీసులు జారీ అవుతున్నాయి. కొందరికి క్లీన్ చిట్లు ఇస్తున్నారు, మరికొందరు నోటీసులకు సమాధానాల కోసం సమయం కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఒకవైపు బీఆర్ఎస్ పార్టీ.. తాము పోరాడుతున్నామని, తామే నిజమైన ప్రతిపక్షమని చెబుతోంది. అయితే ఇటీవల జరిగిన పురపాలక సంఘాల ఎన్నికల్లో కాంగ్రెస్బీఆర్ఎస్ మధ్య.. ఉత్తుత్తి పోటీ మాత్రమేనని స్పష్టంగా అర్థమైందని ఎన్.వి.ఎస్.ఎస్. తెలిపారు.గత రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల సమయంలో అవకాశం ఉన్నప్పటికీ బీఆర్ఎస్ పోటీ చేయలేదు. ఇప్పుడు కూడా పోటీపై నిర్ణయం తీసుకోకుండా, స్పష్టత ఇవ్వకుండా కాలయాపన చేయడం వెనుక మతలబు ఏంటని ప్రభాకర్ ప్రశ్నించారు. ఒకవైపు ఫిరాయింపు ఎమ్మెల్యేలు తాము బిఆర్ఎస్లోనే ఉన్నామని ప్రకటిస్తుంటే, స్పీకర్ కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మరికొంతమంది నోటీసులకు సమాధానం ఇవ్వడానికి గడువు కోరుతున్న పరిస్థితి ఉందన్నారు. ఇటువంటి సమయంలో రాజ్యసభ ఎన్నికలు బిఆర్ఎస్కు ఒక ఆయుధంగా, ఒక అవకాశంగా మారాయని ప్రభాకర్ పేర్కొన్నారు.ఈ ఫిరాయింపుల అంశం పతాక స్థాయికి చేరుకున్న ఈ తరుణంలో అసలు ఏ ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నాడన్నది తేల్చుకునే అవకాశం వచ్చినప్పటికీ బిఆర్ఎస్ మాత్రం ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నామా లేదా అన్న విషయంపై స్పష్టత ఇవ్వకుండా ఉండటం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోందన్నారు.అందుకే బిఆర్ఎస్కాంగ్రెస్ మధ్య జరుగుతున్నది స్ట్రీట్ ఫైట్ కాదు, స్ట్రెయిట్ ఫైట్ కాదు కేవలం "దూప్ ఫైట్" మాత్రమేనని ఘాటుగా వ్యాఖ్యానించారు. విలీనం చేసుకోవాలనుకుంటే బహిరంగంగా ప్రకటించాలి, పొత్తు పెట్టుకోవాలనుకుంటే స్పష్టంగా చెప్పాలి అని బీజేపీ తరఫున నిలదీశారు. కాగితాల మీద పోరాటాలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టే రాజకీయాలు ఎంతకాలం కొనసాగుతాయని ప్రశ్నించారు.

## ఖాతాదారులకు గుడ్ న్యూస్- 7లక్షల ఖాతాల్లో నిలిచిన నిధులు విడుదల- ఇక 3 రోజుల్లోనే క్లెయిమ్ సెటిల్మెంట్!

### 7 లక్షలకు పైగా ఇన్ఆపరేటివ్ పీఎఫ్ ఖాతాల సొమ్ము వాపస్- రూ.1,000 లోపు బ్యాలెన్స్ ఉన్నవారికి త్వరలో చెల్లింపులు!




పీఎఫ్ ఖాతాదారులకు శుభవార్త. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ ఓ)లో నిలిచిపోయిన రూ.3.52 కోట్ల నిధులను త్వరలోనే ఆయా ఖాతాదారులు లేదా వారి వారసులకు తిరిగి చెల్లించనున్నట్లు కార్మిక మంత్రిత్వశాఖ వర్గాలు సోమవారం వెల్లడించాయి. సుమారు 7.11 లక్షల ఇన్ ఆపరేటివ్ (నిష్క్రియాత్మకంగా ఉన్న) ఖాతాల్లోని నిధులను విడుదల చేయనున్నట్లు తెలిపాయి. ముఖ్యంగా రూ.1000 లోపు బ్యాలెన్స్ ఉన్న వాటిని త్వరలోనే సెటిల్ చేయాలని కార్మిక మంత్రిత్వ శాఖ సమీక్షా సమావేశంలో నిర్ణయించినట్లు పేర్కొన్నాయి.

ఇన్ఆపరేటివ్ ఖాతాలు అంటే ఏమిటి

వరుసగా 36నెలలపాటు ఉద్యోగి లేదా యజమాని నుంచి ఎలాంటి కంట్రిబ్యూషన్ జమ కానీ పీఎఫ్ ఖాతాలను 'ఇన్ ఆపరేటివ్ ఖాతా'లుగా పరిగణిస్తారు. కార్మిక మంత్రిత్వ శాఖ వర్గాల ప్రకారం, ప్రస్తుతం మొత్తం 31.86 లక్షల ఇన్ ఆపరేటివ్ ఖాతాల్లో రూ.10,903 కోట్లు మూలుగుతున్నాయి. అందులో రూ.1000 కన్నా తక్కువ బ్యాలెన్స్ ఉన్న 7.11 లక్షల ఖాతాల్లో రూ.3.52 కోట్లు ఉన్నాయి.ఈ సొమ్ము ఆధార్ తో అనుసంధానమైన ఉన్న పీఎఫ్ ఖాతాదారుల బ్యాంక్ అకౌంట్లలోకి నేరుగా జమ చేస్తారు. ఒకవేళ ఖాతాదారుడు మరణిస్తే, ఆ మొత్తాన్ని నామినీకి లేదా చట్టబద్ధమైన వారసుడికి అందజేస్తారు.

ఈపీఎఫ్ఓ 3.0

పీఎఫ్ ఖాతాలను ప్రక్షాళన చేసే క్రమంలో భాగంగా, కార్మిక మంత్రిత్వ శాఖ ఈపీఎఫ్ ఓ 3.0 అనే డిజిటల్ ట్రాన్స్ ఫార్మేటివ్ ప్రాజెక్టుపై పనిచేస్తోంది. దీని ద్వారా కోర్ బ్యాంకింగ్ సిస్టమ్ ను తీసుకొచ్చి, ఖాతాదారులకు, సంస్థలకు బ్యాంకింగ్ తరహా సేవలందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. దీని వల్ల రిస్క్ మేనేజ్ మెంట్ క్లియరెన్స్ ఉన్న క్లెయిమ్ లు ఎలాంటి మానవ ప్రమేయం లేకుండా 'ఆటో మోడ్ 'లో ప్రాసెస్ అవుతాయి. ఫలితంగా ఇప్పటి వరకు 20 రోజులు పడుతున్న క్లెయిమ్ సెటిల్ మెంట్ సమయం, ఏకంగా 3 రోజులలోపునకు తగ్గిపోతుంది. మరీ ముఖ్యంగా పీఎఫ్ ఖాతాదారులు ఒకే వేదిక నుంచి తమ సామాజికభద్రతా ఖాతాలను (సోషల్ సెక్యూరిటీ అకౌంట్స్ ) నిర్వహించుకోవడానికి వీలవుతుంది. పేపర్ వర్క్ కూడా తగ్గుతుంది. ప్రస్తుతం పీఎఫ్ ఖాతాదారుల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడానికి ఈపీఎఫ్ ఓ క్రమం తప్పకుండా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తోంది. అయలా కొత్త ఫీచర్ల పనితీరును పర్యవేక్షిస్తోంది. లిచిపోయిన అన్ని ఖాతాలను దశలవారీగా సెటిల్ చేసి, అర్హులైన లబ్ధిదారులకు వారి సొమ్ము అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

త్వరలో కొత్త యాప్

ఈపీఎఫ్ ఓ తమ ఖాతాదారుల కోసం త్వరలో కొత్త యాప్ తెచ్చేందుకు సిద్ధమైంది. దీని వల్ల అత్యవసర సమయాల్లో పీఎఫ్ డబ్బులు తీసుకోవడానికి రోజుల తరబడి ఎదురుచూసే పనిలేకుండా, క్షణాల్లోనే డబ్బును విత్డ్రా చేసుకునే సౌకర్యాన్ని అందుబాటులోకి రానుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కొత్తగా రూపొందించిన మొబైల్ యాప్ ద్వారా, 'యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ఫేస్' సాయంతో పీఎఫ్ ఖాతాదారులు తమ డబ్బును నేరుగా బ్యాంక్ ఖాతాల్లోకి బదిలీ చేసుకోవచ్చు.

ఫీచర్స్ అదుర్స్

కొత్త యాప్లో ఖాతాదారులు తమ అకౌంట్లో ఎంత బ్యాలెన్స్ ఉందో చూసుకోవచ్చు. అందులో ఎంత మొత్తం విత్డ్రా చేసుకోవడానికి అర్హత ఉందో చూడవచ్చు. బ్యాంక్ ఖాతాకు లింక్ అయిన యూపీఐ పిన్ ఉపయోగించి, సురక్షితంగా ఆ డబ్బును ట్రాన్స్ఫర్ చేసుకోవచ్చు. పాస్బుక్ బ్యాలెన్స్ చెక్ చేసుకోవడం, ఇతర సేవలు కూడా మరింత సులభతరం అవుతాయి. పాత పద్ధతిలోలాగా క్లెయిమ్ ఫారం నింపి, అప్లై చేసే తిప్పలు తప్పుతాయి. ఈ కొత్త విధానం ఎలా పనిచేస్తుందో చూడడానికి ఈపీఎఫ్ఓ సుమారు 100 డమ్మీ ఖాతాలతో ట్రయల్స్ నిర్వహిస్తోంది. ఇందులో ఏవైనా సాంకేతిక లోపాలు ఉంటే సరిచేస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏప్రిల్లో ఈ యాప్ను ఘనంగా ప్రారంభించేందుకు కేంద్ర కార్మిక శాఖ సన్నాహాలు చేస్తోంది.

# నెలసరి ఆలస్యమవుతోందా - ఇవి చెక్ చేసుకోవాలంటున్న నిపుణులు!

### రుతు క్రమంలో ఇబ్బందులకు మానసిక ఒత్తిడితోపాటు అధిక వ్యాయామమూ కారణం కావొచ్చట!



నెలసరి కొన్నిసార్లు ముందుగా లేదంటే ఆలస్యంగా రావడం మామూలే! అయితే, కొంతమందిలో ప్రతిసారీ ఇలాగే జరుగుతుంటుంది. హార్మోన్ల అసమతుల్యతే దీనికి కారణమనుకుంటారు. కానీ, ఇది నిజం కాదంటున్నారు నిపుణులు. జీవనశైలి మార్పులు, పలు ఆరోగ్య సమస్యలూ ఇందుకు కారణం కావచ్చని చెబుతున్నారు. అందుకే ప్రతి నెలా పీరియడ్స్ ముందుగా లేదంటే ఆలస్యంగా వస్తున్నట్లు గమనిస్తే, ఎవరికి వారే స్వయంగా కొన్ని ప్రశ్నలు వేసుకోవాలని పేర్కొంటున్నారు. తద్వారా అసలు సమస్యేంటో గుర్తించి, మొదట్లోనే డాక్టర్ని సంప్రదించి చికిత్స తీసుకోవచ్చని సూచిస్తున్నారు. మరి, మిమ్మల్ని మీరు అడగాల్సిన ప్రశ్నలేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

ఒత్తిడికి గురవుతున్నారా :

ప్రస్తుతం చిన్న చిన్న విషయాలకే ఒత్తిడికి గురవడం, ఆందోళన చెందడం చాలామందిలో కనిపిస్తుంది. అయితే, ఇలా ఒత్తిడికి గురైన ప్రతిసారీ శరీరంలో కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తి పెరుగుతుందంటున్నారు నిపుణులు. ఇది ఇతర హార్మోన్ల స్థాయుల పైనా ప్రతికూల ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. ఈ క్రమంలో నెలసరిని క్రమబద్ధీకరించే ల్యుటినైజింగ్, ఫాలికల్ స్టిమ్యులేటింగ్ హార్మోన్, ఈస్ట్రోజెన్, ప్రొజెస్టరాన్ వంటి హార్మోన్ల స్థాయులు అదుపు తప్పుతాయని పేర్కొంటున్నారు. దీని ప్రభావం నెలసరిపై పడి.. తద్వారా ఇర్రెగ్యులర్ పీరియడ్స్కు దారితీస్తుందని తెలియజేస్తున్నారు. కాబట్టి నెలనెలా పీరియడ్స్ ఆలస్యమైతే.. 'తాము ఏ విషయంలోనైనా టెన్షన్ పడుతున్నామా అని ఎవరికి వారే ప్రశ్నించుకోవాలని సూచిస్తున్నారు. ఫలితంగా మీ ఇర్రెగ్యులర్ పీరియడ్స్కి ఒత్తిడి కారణమా కాదా అనేది తెలుస్తుందని సలహా ఇస్తున్నారు. ఒత్తిడి.. రుతు చక్రంపై ప్రభావం చూపుతుందని ఎశ్రీవజవశ్రీఖఅఎశ్రీఅఅఅఎ అధ్యయనం పేర్కొంది.

డైటింగ్ వల్లా :

శరీరానికి పోషకాలన్నీ అందినప్పుడే హార్మోన్లు సక్రమంగా పని చేస్తాయి. కానీ, కొందరైతే డైటింగ్ పేరుతో కడుపు మాడ్చుకుంటారు. దీనివల్ల శరీరానికి సరిపడా పోషకాలు, క్యాలరీలు అందవట. దీనివల్ల కూడా ఈస్ట్రోజెన్, ప్రొజెస్టరాన్ వంటి ప్రత్యుత్పత్తి హార్మోన్ల అసమతుల్యత తలెత్తుతుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ఇదీ నెలసరి క్రమం తప్పడానికి, ఆలస్యంగా రావడానికి కారణమవుతుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే పీరియడ్స్ ప్రతి నెలా ఆలస్యమవుతుంటే.. తాము డైట్లో ఏవైనా మార్పులు చేసుకున్నామా? క్యాలరీల్ని తగ్గించామా అనే దిశగానూ ఆలోచించాలంటున్నారు. ఋతుక్రమ రుగ్మతలు ఉన్న మహిళలు అధిక చక్కెర కలిగిన ఆహారాలు లేదా పానీయాలను ఎక్కువగా తీసుకుంటారని, తగినంత పోషకాలు తీసుకోరని అధ్యయనం పేర్కొంది.

వ్యాయామం మితిమీరిందా :

మామూలుగా వర్కవుట్ రొటీన్ ప్రారంభించే వారు తక్కువ తీవ్రత ఉన్న సింపుల్ ఎక్సర్ సైజ్ లతో సార్ట్ చేస్తారు. కానీ, కొంతమంది త్వరగా బరువు తగ్గాలని మొదట్లోనే అధిక తీవ్రత ఉన్న వ్యాయామాల్ని రొటీన్లో చేర్చుకుంటారని నిపుణులు చెబుతున్నారు. దీనికి తోడు ఆహారం కూడా సరిగ్గా తీసుకోరని చెబుతున్నారు. ఫలితంగా, శరీరం శక్తి స్థాయుల్ని కోల్పోతుందంటున్నారు. ఇది పీరియడ్స్ పై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలియజేస్తున్నారు. తద్వారా నెలసరి ఆలస్యమవడం, కొంతమందిలో ఆగిపోవడం కూడా జరుగుతుందంటున్నారు. అంతేకాదు, ఉన్నట్లుండి బరువు తగ్గినా, పెరిగినా కూడా పీరియడ్స్ సమస్యలు తప్పవంటున్నారు. నెలసరిని క్రమబద్ధీకరించే ఈస్ట్రోజెన్, ప్రొజెస్టరాన్ హార్మోన్లలో హెచ్చుతగ్గులే ఇందుకు ప్రధాన కారణమట! కాబట్టి, నెలసరి ఆలస్యమైతే మీ శారీరక బరువు, వ్యాయామాల విషయాల్లోనూ ఈ ప్రశ్నలు సంధించుకోవడం వల్ల అసలు కారణమేంటో ఓ అవగాహన వస్తుందని పేర్కొంటున్నారు. క్రమరహిత రుతుస్రావానికి అధిక వ్యాయామం కూడా ఒక కారణమని అఱఎష్ట్రఃఅఅష్ట్ర.స్త్రశీజ అధ్యయనం పేర్కొంది.

మందుల ప్రభావమేమో :

దీర్ఘకాలం మందులు వాడే వారు, వాటిని మార్చినా మొదట్లో కొన్నాళ్ల పాటు నెలసరి అదుపు తప్పడం గమనిస్తుంటాం. ముఖ్యంగా, గర్భ నిరోధక మాత్రలు, ఒత్తిడిని తగ్గించే మందులు, థైరాయిడ్-స్థూలకాయానికి సంబంధించిన మందులు, కొన్ని రకాల నొప్పి నివారిణులు కూడా నెలసరిపై ప్రతికూల ప్రభావం చూపిస్తాయంటున్నారు నిపుణులు. అంతేకాదు, రక్తస్రావంలోనూ హెచ్చుతగ్గులొస్తాయని చెబుతున్నారు. అందుకే పీరియడ్స్ విషయంలో మార్పులేవైనా గమనిస్తే, 'నేను వాడే కొత్త మందుల వల్లే ఇలా జరుగుతోందేమో'నని ఒకటికి రెండుసార్లు ప్రశ్నించుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

నిద్ర సరిపోతోందా :

పని ఒత్తిడి, షిఫ్టుల వల్ల ఇప్పుడు చాలామంది ప్రశాంతమైన నిద్రకు నోచుకోలేకపోతున్నారు. దీని ప్రభావం ఆరోగ్యంపై పడుతుందంటున్నారు నిపుణులు. తద్వారా బరువు పెరగడం, ఒబెసిటీ, పీసీఓఎస్ వంటి సమస్యలు తలెత్తుతాయని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో దీర్ఘకాల నిద్రలేమి రుతుచక్రం పైనా ప్రతికూల ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. కాబట్టి, నెలసరి అదుపు తప్పినప్పుడు నిద్ర విషయంలోనూ ఎవరికి వారు కొన్ని ప్రశ్నలు వేసుకోవడం మేలని సలహా ఇస్తున్నారు. తమ జీవనశైలి మార్పుల విషయంలో ఇలా ఎవరికి వారే స్వీయ పరిశీలన చేసుకోవడం వల్ల నెలసరి ఆలస్యానికి గల కారణాలేంటో తెలుస్తాయంటున్నారు నిపుణులు. ఇవన్నీ డాక్టర్ ముందుంచితే మీ సమస్యకు తగిన చికిత్స అందించడం సులువవుతుందని చెబుతున్నారు. ఫలితంగా, నెలసరి క్రమంగా వస్తుందని, ఆరోగ్యపరంగానూ మేలు జరుగుతుందట. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# ఈస్ట్ కోస్ట్ రైల్లో మహిళ అస్వస్థత...

## కాజీపేటలో 108 ద్వారా ఎంజీఎంకు తరలింపు...



వరంగల్//మార్చి 04 (ఆకాంక్ష) : చర్లపల్లి నుంచి హౌరాకు వెళ్తున్న ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైల్లో ఓ మహిళా ప్రయాణికురాలు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. రైల్వే అధికారులు, 108 అత్యవసర సిబ్బంది అప్రమత్తంగా స్పందించి ప్రథమ చికిత్స అందించి, అనంతరం బాధితురాలిని వరంగల్‌లోని ఎంజీఎం హాస్పిటల్ కు తరలించారు.రైల్వే అధికారుల వివరాల ప్రకారం.. కోల్‌కతాకు చెందిన పింకీ సాహా (31) అనే వివాహిత కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు చికిత్స నిమిత్తం వచ్చారు. అనంతరం తిరుగు ప్రయాణంలో భాగంగా చర్లపల్లి నుంచి హౌరా వెళ్లే ఈస్ట్ కోస్ట్ రైల్లో ఎక్కారు. రైలు బయలుదేరిన అరగంటకే పింకీకి విపరీతమైన కడుపునొప్పి,ఆయాసంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తింది.బాధితురాలి పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు వెంటనే రైలు టీటీకి సమాచారం అందించారు. టీటీ ద్వారా సమాచారం అందుకున్న రైల్వే ఉన్నతాధికారులు వెంటనే చర్యలు ప్రారంభించారు. రైలు కాజీపేటకు చేరుకునే సమయానికి 108 అత్యవసర వాహనాన్ని సిద్ధంగా ఉంచాలని స్థానిక అధికారులకు ఆదేశించారు.రైలు కాజీపేట రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే 108 సిబ్బంది ఈఎన్‌టీ చైతన్య, పైలట్ కుమారస్వామి బాధితురాలిని పరిశీలించి ప్రాథమిక వైద్యం అందించారు. అయితే పరిస్థితి పూర్తిగా అదుపులోకి రాకపోవడంతో వెంటనే అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. సమయస్ఫూర్తితో స్పందించిన రైల్వే సిబ్బంది, 108 సిబ్బందిని కుటుంబ సభ్యులు అభినందించారు. బాధితురాలు ప్రస్తుతం ఎంజీఎం దవాఖానలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

## భావోద్వేగాల మధ్య 10వ తరగతి విద్యార్థులకు ఘన వీడ్కోలు...



కొత్తగూడెం//మార్చి 04 (ఆకాంక్ష) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం అత్యంత భావోద్వేగాల మధ్య జరిగింది. పదేళ్ల పాఠశాల ప్రయాణాన్ని ముగించుకుని కొత్త దిశగా అడుగులు వేయబోతున్న విద్యార్థులు, వారిని సాగనంపుతున్న ఉపాధ్యాయులు, సహచరుల కళ్లలో ఆనందం-వేదనల మిశ్రమ భావాలు స్పష్టంగా కనిపించాయి.9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం కేవలం ఒక వీడ్కోలు సభగానే కాకుండా ఆత్మీయ కలయికగా మారింది. పాఠశాల ప్రాంగణంలో గడిపిన ప్రతి మధుర క్షణం సభలో పలువురి ప్రసంగాల్లో ప్రతిధ్వనించింది. తరగతి గదిలో సందడి చేసిన రోజులు, ఆటస్థలంలో కేరింతలు, మధ్యాహ్న భోజన వేళల్లో పంచుకున్న అనుబంధాలు ఒక్కొక్కటిగా విద్యార్థుల జ్ఞాపకాలలో కదిలాయి.తమను కన్నతండ్రిలా చూసుకుని విద్యాబుద్ధులు నేర్పిన గురువుల పాదాలకు నమస్కరిస్తూ విద్యార్థులు కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. ఉపాధ్యాయులు నేర్పిన పాఠాలు తమ జీవితాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని, భవిష్యత్‌లో ఎక్కడ ఉన్నా ఈ పాఠశాల ఋణం మరిచిపోమని ఉద్వేగంగా పేర్కొన్నారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతుండగా కళ్లలో నీళ్లు మెదిలాయి.వీడ్కోలు అంటే విడిపోవడం కాదు.. కొత్త శిఖరాలను అధిరోహించేందుకు చేసే మరో ప్రయాణం" అని ఉపాధ్యాయులు విద్యార్థులను ఆశీర్వదించారు. క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని హితవు పలికారు. 9వ తరగతి విద్యార్థులు తమ సీనియర్ల భవిష్యత్ బంగారుమయంగా ఉండాలని ఆకాంక్షిస్తూ వారిని ఘనంగా సాగనంపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంజీవరావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కళ్యాణి, ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, బి.సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగిసే సమయానికి ఒకరినొకరు కౌగిలించుకుని వీడ్కోలు చెప్పుకున్న విద్యార్థుల దృశ్యం అక్కడి వాతావరణాన్ని మరింత భావోద్వేగభరితంగా మార్చింది.

## 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' అమలుకు సిద్ధం...

### సీఎం సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్...



మెదక్//మార్చి 04 (ఆకాంక్ష) : రాష్ట్రంలో ప్రజాకేంద్రీకృత పాలనను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో చేపట్టిన 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం లో జరిగిన ఈ సమావేశంలో మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొన్నారు.ఈ నెల 6వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు మొత్తం 99 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా అమలు కానున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంపై ముఖ్యమంత్రి కలెక్టర్లకు సమగ్ర దిశానిర్దేశం చేశారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించే విధంగా అధికార యంత్రాంగం పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి, నిర్దేశిత గడువుల్లో లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ముఖ్యంగా సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్య, వైద్యం, సాగునీరు, గ్రామీణ రహదారుల నిర్మాణం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా అభివృద్ధి పనుల పురోగతిపై కలెక్టర్ ప్రతిమా సింగ్ వివరమైన నివేదికను సమర్పించారు. జిల్లాలో కొనసాగుతున్న ప్రధాన ప్రాజెక్టులు, సంక్షేమ పథకాల అమలు స్థితి, పెండింగ్ పనులపై తీసుకుంటున్న చర్యలను వివరించారు. జిల్లాలో గ్రామ పంచాయతీలు, మండలాలు, పట్టణాల్లో ప్రజల అవసరాలను గుర్తించి, ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.ప్రజాపాలన కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి, మెదక్ జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా నిలిపేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.కలెక్టర్ల సమావేశంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధికారులు పాల్గొని, తమ తమ జిల్లాల ప్రగతి నివేదికలను సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల ప్రకారం మెదక్ జిల్లాలో 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరేలా చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా యంత్రాంగం స్పష్టం చేసింది.

### గ్రహణం అనంతరం ఏడుపాయల

## దుర్గాభవాని ఆలయానికి భక్తుల రద్దీ...



మెదక్//మార్చి 04 (ఆకాంక్ష) : మెదక్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల దుర్గాభవాని ఆలయంలో బుధవారం గ్రహణం అనంతరం భక్తుల సందడి నెలకొంది. గ్రహణ సమయం ముగియగానే ఆలయ అధికారులు శాస్త్రోక్తంగా ఆలయ శుద్ధి కార్యక్రమాలను చేపట్టారు. ఆలయ ప్రాంగణమంతటా పవిత్ర జలాలతో పరిశుభ్రపరచి సంప్రోక్షణ నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య ఆలయ వాతావరణం భక్తిమయంగా మారింది.అనంతరం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, పసుపు, కుంకుమ తదితర ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా అభిషేకం చేసి అద్భుతంగా అలంకరించారు. పుష్పాలతో సింగారించిన దుర్గాభవాని అమ్మవారు దర్శనమిచ్చి భక్తులను ఆకట్టుకున్నారు. సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమంలో మహిళా భక్తులు విశేషంగా పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ మహానివేదన సమర్పించి నక్షత్ర హారతి ఇచ్చారు. గ్రహణం ముగిసిన వెంటనే వివిధ ప్రాంతాల నుండి భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, ప్రత్యేక దర్శనం కోసం క్యూలైన్లలో నిలబడ్డారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కొందరు భక్తులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి తమ భక్తిశ్రద్ధలను వ్యక్తం చేశారు.భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ పరిసరాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు భక్తుల రాకపోకలు కొనసాగినట్లు ఆలయ అధికారులు తెలిపారు.గ్రహణం అనంతరం శాస్త్రోక్తంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలతో ఏడుపాయల దుర్గాభవాని ఆలయం భక్తులతో కళకళలాడింది.

# గోదావరిఖని చౌరస్తాలో హోలీ సంబరాలు,...



గోదావరిఖని//మార్చి 04 (ఆకాంక్ష) : రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గోదావరి ఖని చౌరస్తాలో బుధవారం ఉదయం నిర్వహించిన హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.చిన్నా పెద్దా తేడా లేకుండా కొత్తగాఎన్నికైన పాలకవర్గం ప్రజలతో మమేకమైపని చేస్తుందనిఅన్నారు. రామగుండం నగరం 2029నాటికి సకల సౌకర్యాలతో సంపూర్ణంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతోశాసన సభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్,పని చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే రూ 800 కోట్లతో నగరంలో అనేక అభివృద్ధి పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని అన్నారు. ప్రజలందరూ సహకరించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈసంబరాలలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య,పలువురు కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవిలో త్రాగునీటి సరఫరా ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలి....



గోదావరిఖని//మార్చి 04 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని సింగరేణి కార్మికుల కుటుంబాలకు త్రాగునీటి సరఫరా ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకుడు మడ్డి ఎల్లా గౌడ్ సూచించారు.బుధవారం ఆర్జీ-1 డివిజన్ పరిధిలోని గోదావరి వద్ద ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్‌ను, గోదావరి నదిలో నీటి మట్టాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సింగరేణి ఆర్జీ-వన్ జీఎం లలిత్ కుమార్‌తో కలిసి ఆయన ప్రత్యక్షంగా పరిస్థితులను సమీక్షించారు.గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో వేలాది మంది సింగరేణి కార్మికుల కుటుంబాలు నివసిస్తున్న నేపథ్యంలో, వేసవి తీవ్రత పెరిగే అవకాశముండటంతో త్రాగునీటి అవసరం అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. నీటి మట్టం తగ్గే పరిస్థితులు తలెత్తినా సరఫరా లోపం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ఫిల్టర్ బెడ్‌ల పనితీరు, పంపింగ్ మోటార్ల స్థితి, నిల్వ సామర్థ్యం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. నీటి శుద్ధి ప్రక్రియలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా పర్యవేక్షణ పెంచాలని కోరారు. ఈ సందర్భంగా జీఎం లలిత్ కుమార్ మాట్లాడుతూ, కార్మిక కుటుంబాలకు త్రాగునీటి సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అవసరమైతే అదనపు మోటార్లు, పైపులైన్ల మరమ్మతులు చేపట్టి సరఫరాను సక్రమంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.వేసవిలో నీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పని చేయాలని ఎల్లా గౌడ్ స్పష్టం చేశారు.కార్మికుల సంక్షేమం దృష్ట్యా నీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులతో కార్మికుడు ఆత్మహత్య....




గోదావరిఖని//మార్చి 04 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలోని జీఎం కాలనీలో బుధవారం ఓ యువకుడు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోదావరిఖని జీఎం కాలనీకి చెందిన మిగనబోయిన గణేష్ (28) ఇంట్లోని ఇనుప రాడుకు ఉరి వేసుకుని మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడు గణేష్‌కు గతంలో అన్నయ్య మృతి చెందడంతో అతని స్థానంలో సింగరేణి ఉద్యోగం వచ్చిందని, అయితే గత రెండేళ్లుగా బావిలోపల డ్యూటీ చేయలేక ఇంటివద్దనే ఉంటూ కుటుంబాన్ని పోషించేందుకు అప్పులు చేశాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పులు పెరిగి వాటిని తీర్చలేని పరిస్థితి ఏర్పడటంతో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై చివరకు ఈ దారుణ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.ఈ ఘటనపై మృతుడి తల్లి మిగనబోయిన స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గోదావరిఖని వన్ టౌన్ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.గోదావరిఖని ప్రాంతంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్కు సంబంధించిన ఉద్యోగుల కుటుంబాలు ఆర్థిక, ఉపాధి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. కాలనీలో విషాదఛాయలు అలుముకోగా, మృతుడి కుటుంబాన్ని పరామర్శించేందుకు బంధువులు, స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

## మెదక్ జిల్లాలో 108 అంబులెన్స్‌లోనే సుఖ ప్రసవం...



మెదక్//మార్చి 04 (ఆకాంక్ష) : మెదక్ జిల్లాలో అత్యవసర వైద్య సేవల ప్రాముఖ్యతను మరోసారి చాటిచెప్పే సంఘటన బుధవారం చోటుచేసుకుంది. నిజాంపేట మండలం వెంకటాపూర్ తండాకు చెందిన గర్భిణి కవితకు ఆకస్మికంగా పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న 108 సిబ్బంది తక్షణమే గ్రామానికి చేరుకుని గర్భిణిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు బయలు దేరారు. అయితే మార్గమధ్యలోనే కవితకు నొప్పులు తీవ్రమయ్యాయి. పరిస్థితిని అంచనా వేసిన ఈఎంటీ స్వామి అప్రమత్తంగా వ్యవహరించి అంబులెన్స్‌లోనే ప్రసవం నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. అవసరమైన వైద్య జాగ్రత్తలు తీసుకుంటూ సురక్షితంగా ప్రసవం జరిపించారు.అంబులెన్స్‌లోనే కవిత ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, శిశువు ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. అనంతరం వారిని సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు.ఈ సంఘటనతో 108 అత్యవసర సేవల సమర్థత మరోసారి నిరూపితమైంది. సమయోచితంగా స్పందించి తల్లి, శిశువు ప్రాణాలను కాపాడిన ఈఎంటీ స్వామి సహా 108 సిబ్బందిని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు. గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది.

## తాడూర్ పీహెచ్‌సీపై జిల్లా కలెక్టర్ బడావత్ సంతోష్ ఆకస్మిక తనిఖీ...



నాగర్ కర్నూల్ టౌన్//మార్చి 04 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లాలోని తాడూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బడావత్ సంతోష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై సమగ్ర సమీక్ష నిర్వహించిన ఆయన, రోగులకు నాణ్యమైన మరియు సమయానుకూల వైద్యం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.తనిఖీ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ముందుగా ఔట్‌పేషెంట్ (ఓపీ) విభాగాన్ని సందర్శించి, అక్కడ చికిత్స కోసం వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, సిబ్బంది వ్యవహార శైలి తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెంపొందేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. అనంతరం రక్త నమూనా పరీక్షల విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్, రోజుకు ఎంతమంది రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్నారో, ఫలితాలు అందించడానికి ఎంత సమయం పడుతోందో వివరాలు తెలుసుకున్నారు. ల్యాబ్ పరీక్షల నిర్వహణలో ఎటువంటి ఆలస్యం చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైన పరికరాలు, రియాజెంట్లు సమృద్ధిగా నిల్వ ఉంచాలని ఆదేశించారు.ఆరోగ్య కేంద్రంలోని ప్రసూతి విభాగం, ఇంజెక్షన్ గది, ఔషధ నిల్వ గది తదితర విభాగాలను కూడా ఆయన పర్యవేక్షించారు. రోగుల రికార్డులు, హాజరు రిజిస్టర్లు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ, ఎక్కడైనా లోపాలు ఉన్నట్లయితే వెంటనే సరిదిద్దుకోవాలని సూచించారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సమయానికి మరియు సమగ్ర వైద్యం అందించడమే ప్రాథమిక లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు.ఈ ఆకస్మిక తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.ం

## రెసిడెంట్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక...



పెద్దపల్లి//మార్చి 04 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అమర్‌చంద్ కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన పెద్దపల్లి రెసిడెంట్ టీచర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. 202628 రెండేళ్ల కాలపరిమితికి గాను నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశానికి జిల్లా కేంద్రంలో నివాసముంటున్న ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో హాజరై సంఘ ఐక్యతను చాటిచెప్పారు.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడిగా మెతుకు తిరుపతి ఎన్నిక కాగా, ఉపాధ్యక్షులుగా నీలం నరేందర్, తాళ్ళ నరేందర్ బాధ్యతలు స్వీకరించారు. ప్రధాన కార్యదర్శిగా సట్టు కనకయ్య, ఆర్థిక కార్యదర్శిగా కర్రె ప్రవీణ్, ప్రచార కార్యదర్శిగా అలుగం కనకయ్యలను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వాలుక హనుమంతు, గౌరవ సలహాదారుగా చాట్ల ఆగయ్య నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఒల్లే శ్రీనివాస్ యాదవ్, రామగిరి స్వామి, వడ్డేపల్లి రాజేషం, కర్నె రాజు, సుంకే నర్సింగం ఎంపికయ్యారు.నూతన అధ్యక్షుడు మెతుకు తిరుపతి మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పెద్దపల్లి పట్టణంలో నివసిస్తున్న ఉపాధ్యాయులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి వారి వృత్తి, సామాజిక, సంక్షేమ సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయుల ఐక్యతే సంఘ బలమని, భవిష్యత్‌లో మరింత చైతన్యంతో కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించిన ఎన్నికల అధికారి హనుమంత్‌కు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సహకరించిన పెద్దలు, సంఘ సీనియర్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.సమావేశం అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను పలువురు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. శుభాకాంక్షల వెల్లువ మధ్య సమావేశం ముగిసింది.

### ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా

## తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్...



నాగర్‌కర్నూల్ టౌన్//మార్చి 04 (ఆకాంక్ష) : నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ బుధవారం తాడూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం మ్యాథమెటిక్స్ పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, సీసీ కెమెరా వ్యవస్థ, పరీక్షా గదుల పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్ సరఫరా తదితర అంశాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం, హాల్ టికెట్ల తనిఖీ విధానం, పోలీసు బందోబస్తు ఏర్పాట్లు, ఇన్విజిలేటర్ల పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.మాల్ ప్రాక్టీస్‌కు ఎలాంటి ఆస్కారం లేకుండా కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులను పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలకు అనుమతించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సూచించారు.తాడూర్ పరీక్షా కేంద్రంలో మొత్తం 98 మంది విద్యార్థులకు గాను 96 మంది పరీక్షకు హాజరయ్యారని, ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా మొత్తం 34 పరీక్షా కేంద్రాల్లో 6,125 మంది విద్యార్థులకు గాను 5,936 మంది విద్యార్థులు హాజరయ్యారని, 189 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ వెల్లడించారు.పరీక్షల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, ప్రతి కేంద్రంలో పారదర్శకత, క్రమశిక్షణ పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో పరీక్షలు సజావుగా కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.



# ఎన్నికల హామీపై రాజకీయ వేడి...

### శ్రీరామ్ నగర్‌లో ఎస్ఆర్ఎస్పీ కాలువపై ఫ్లోరింగ్ పనులు వెంటనే ప్రారంభించాలి...

### బోయిని నారాయణ డిమాండ్...



మంథనిరూరల్/మార్చి 04 (ఆకాంక్ష) : మంథని మున్సిపల్ పరిధిలోని 5వ వార్డ్ శ్రీరామ్ నగర్ గ్రామంలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని భారతీయ జనతా పార్టీ మాజీ మండల అధ్యక్షుడు, మంథని మున్సిపల్ 5వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేసిన బోయిని నారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు.శ్రీరామ్ నగర్ గ్రామంలోని రామాలయం దేవాలయంలో ప్రతి సంవత్సరం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తారని ఆయన తెలిపారు. అయితే ఆలయం వద్ద స్థలం సరిపోకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు తమను గెలిపిస్తే ఎస్ఆర్ఎస్పీ కాలువపై సిమెంట్ ఫ్లోరింగ్ పనులు చేపట్టి విశాలమైన ప్రదేశాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారని గుర్తుచేశారు.ప్రస్తుతం శ్రీరామనవమి వేడుకలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పటికైనా ఇచ్చిన మాట నిలబెట్టుకుని ఫ్లోరింగ్ పనులను తక్షణమే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. శ్రీరామ్ నగర్‌లో జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవం మంథని మున్సిపల్ పరిధిలోనే అత్యంత వైభవంగా నిర్వహించబడుతుందని, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటారని తెలిపారు. అందువల్ల భక్తులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.గ్రామ ప్రజలందరి తరఫున కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రశ్నిస్తున్నామని, హామీ అమలు విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ప్రజలు తగిన నిర్ణయం తీసుకుంటారని బోయిని నారాయణ హెచ్చరించారు. వెంటనే పనులు ప్రారంభించి శ్రీరామనవమి నాటికి పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు.

## మెదక్ జిల్లాలో రెండు రోజులు మంచినీటి సరఫరా నిలిపివేత...

### ప్రజలు సహకరించాలని అధికారుల విజ్ఞప్తి...



మెదక్//మార్చి 04 (ఆకాంక్ష) : మెదక్ జిల్లా మెదక్ మరియు అందోల్ నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో రెండు రోజుల పాటు మంచినీటి సరఫరా నిలిపి వేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. పెద్దరెడ్డిపేట 90 ఎంఎల్డీ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌లో నిర్వహణ పనులు చేపట్టడంతో పాటు 1000 డియా పైప్‌లైన్‌లో ఏర్పడిన లీకేజీ మరమ్మతు పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.సింగూరు జలాశయం నుండి సరఫరా అవుతున్న తాగునీటిని తాత్కాలికంగా నిలిపివేసినట్లు పేర్కొన్నారు. మార్చి 5 మరియు 6 తేదీల్లో రెండు రోజుల పాటు మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సరఫరా ఉండదని స్పష్టం చేశారు. నిర్వహణ, మరమ్మతు పనులు పూర్తయ్యిన వెంటనే సాధారణ సరఫరా పునఃప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రజలు ముందస్తుగా అవసరమైన నీటిని నిల్వ చేసుకోవాలని సూచించారు. తాత్కాలిక అసౌకర్యాన్ని సహనంతో భరించి సహకరించాలని అధికార యంత్రాంగం విజ్ఞప్తి చేసింది. పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రామస్థులు ఆందోళన చెందవద్దని, రెండు రోజుల అనంతరం పరిస్థితి సాధారణ స్థితికి వస్తుందని అధికారులు భరోసా ఇచ్చారు.

## కల్వకుర్తిలో మాజీ ఎమ్మెల్యే గురుక జైపాల్ యాదవ్ తల్లి మృతి...



నాగర్‌కర్నూల్ టౌన్//**మార్చి 04 (ఆకాంక్ష) :** కల్వకుర్తికు చెందిన మాజీ ఎమ్మెల్యే గురుక జైపాల్ యాదవ్ తల్లి బుధవారం పరమపదించారు. ఆమె మృతి వార్తతో స్థానికంగా విషాద వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డిలు నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి సంతాపం తెలిపారు. తల్లి ప్రేమకు సమానం మరొకటి లేదని నాయకులు పేర్కొంటూ, కుటుంబానికి ధైర్యం చెప్పారు.స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సానుభూతి తెలియజేశారు. ఆమె మృతి కల్వకుర్తి ప్రాంతానికి తీరని లోటని పలువురు పేర్కొన్నారు.

## వార్డు అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి...

### నగర మేయర్ మహంకాళి స్వామి...



గోదావరిఖని//**మార్చి 04 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని పట్టణంలో వార్డు అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని మహంకాళి స్వామి స్పష్టం చేశారు. బుధవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన వార్డు అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ డివిజన్ ప్రజలకు మరియు నగర పాలక సంస్థకు మధ్య వార్డు అధికారులు వారధిలా పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి, సమయానికి పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా శానిటేషన్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే బాధ్యత వార్డు అధికారులదేనని పేర్కొన్నారు. "స్వచ్ఛ రామగుండం" లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు.ఈ నెలతో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆస్తి పన్ను వసూళ్లు ఆశించిన స్థాయిలో లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. మార్చి నెలాఖరులోపు వంద శాతం పన్ను వసూలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రోజు వారీగా పన్ను వసూళ్ల పురోగతిని సమీక్షించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు.అదేవిధంగా నీటి బిల్లులు, ట్రేడ్ లైసెన్సులు మరియు ఇతర రుసుములను కూడా లక్ష్యానికి అనుగుణంగా వసూలు చేయాలని ఆదేశించారు. నగర పాలక సంస్థ ఆదాయాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు.పట్టణ అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కావాలంటే ఆదాయం పెరగడం అత్యంత అవసరమని మేయర్ స్పష్టం చేశారు. అధికారులు క్రమశిక్షణతో, సమన్వయంతో పనిచేస్తేనే ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోగలమని అన్నారు.ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.వి. రామన్, అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## నేత్రదాత కనికిరెడ్డి బాపు సంస్మరణ సభ ఘనంగా నిర్వహణ...



ఓదెల//**మార్చి 04 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లా ఓదెల గ్రామానికి చెందిన నేత్రదాత కనికిరెడ్డి బాపు సంస్మరణ సభను మంగళవారం వారి నివాసంలో కుటుంబ సభ్యులు మరియు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు, బంధు మిత్రులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో నేత్ర, అవయవ, శరీర దానాల ప్రాముఖ్యతపై ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన కనికిరెడ్డి బాపు సేవలను వక్తలు కొనియాడారు. సమాజహితం కోసం ముందడుగు వేసిన ఆయన త్యాగం మరువలేనిదని పేర్కొన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్ తరపున జ్ఞాపికను నేత్రదాత భార్య రాయ మల్లమ్మ, కుమారుడు కిషోర్, కుమార్తెలు శైలజ, శిరీషలకు అందజేసి కుటుంబ సభ్యులను అభినందించారు. సమాజానికి ఆదర్శంగా నిలిచిన ఈ కుటుంబం చేసిన సేవ ప్రశంసనీయమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, ప్రతినిధులు క్యాతం మల్లేశం, ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు, క్యాతం వెంకటేశ్వర్లు, బాలసాని సంతోష్ తదితరులు పాల్గొని నేత్రదాతకు ఘన నివాళులు అర్పించారు. నేత్రదానం ద్వారా కలిగే ప్రయోజనాలపై వివరించారు.ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి,కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, ప్రచార కార్యదర్శి వాసు, జిల్లా గౌరవ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ముఖ్య సలహాదారు రమేష్, జిల్లా గౌరవ అధ్యక్షులు చంద్రమౌళి నేత్రదాత కుటుంబ సభ్యులకు అభినందనలు తెలుపుతూ కృతజ్ఞతలు తెలిపారు.సమాజహితం కోసం తమ కుటుంబ సభ్యుని నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరు అంధులకు వెలుగునిచ్చిన ఈ కుటుంబం ఇతరులకు ఆదర్శప్రాయమని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమం ముగింపులో నేత్రదాత చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

## ఓదెల మండలం పోత్కపల్లిలో రంగుల హరివిల్లుడ

### హోలీ సంబరాల్లో శ్రీ పంచముఖ మారుతీ ఆటో యూనియన్ ఉత్సాహం...



ఓదెల//**మార్చి 04 (ఆకాంక్ష) :** ఓదెల మండలం పోత్కపల్లి గ్రామం బుధవారం హోలీ పండుగ సందర్భంగా రంగుల హరివిల్లుగా కళకళలాడింది. గ్రామంలోని శ్రీ పంచముఖ మారుతీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హోలీ సంబరాలు గ్రామ ప్రజలను ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచే యూనియన్ సభ్యులు ఒకచోట చేరి ఉత్సాహంగా వేడుకలను ప్రారంభించారు.చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ఆటో యూనియన్ సభ్యులు పరస్పరం రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గ్రామ వీధులు రంగుల కేరింతలతో మార్మోగిపోయాయి. యువకులు ఉత్సాహంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ, ఆనందంతో కేరింతలు కొడుతూ సందడి చేశారు. పిల్లలు కూడా పెద్దలతో కలిసి వేడుకల్లో పాల్గొనడంతో పండుగ వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది. పండుగ సందర్భంగా సభ్యులు మిఠాయిలు పంచుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కొందరు సంప్రదాయ సంగీతానికి తగినట్లుగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. రంగుల సందడితో గ్రామం మొత్తం పండుగ శోభను సంతరించుకుంది.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, హోలీ పండుగ అనేది స్నేహభావం, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం సభ్యులందరూ కలిసి ఇలాంటి వేడుకలను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు సభ్యుల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. గ్రామంలో సామరస్య వాతావరణాన్ని పెంపొందించడంలో ఇలాంటి ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు.శ్రీ పంచముఖ మారుతీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ హోలీ సంబరాలు పోత్కపల్లి గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, గ్రామ ప్రజలకు ఆనందాన్ని పంచాయి.

## పాలెం గ్రామంలో నాలుగు దశాబ్దాల అరుదైన స్నేహబంధం...

### "స్నేహమంటే ఇదే" అని ప్రశంసలు...

నాగర్ కర్నూల్ టౌన్//**మార్చి 04 (ఆకాంక్ష) :** తెలంగాణ రాష్ట్రంలోని నాగర్ కర్నూల్ జిల్లా పరిధిలోని బిజినేపల్లి మండలం లోని పాలెం గ్రామం లో అరుదైన స్నేహబంధం అందరినీ ఆకట్టుకుంటోంది. బాల్యం నుంచే కలిసి పెరిగిన మిత్రబృందం గత నాలుగు దశాబ్దాలుగా విడదీయరాని బంధంతో జీవిస్తూ గ్రామ యువతకు ఆదర్శంగా నిలుస్తోంది.పాఠశాల దశలో ప్రారంభమైన ఈ స్నేహం కాలగమనంలో మరింత పటిష్టమైంది. జీవన ప్రయాణంలో ఉద్యోగాలు, కుటుంబ బాధ్యతలు, వ్యక్తిగత పనులు వచ్చినా స్నేహంలో మాత్రం ఎలాంటి మార్పు రాలేదని గ్రామస్థులు చెబుతున్నారు. సంతోష సందర్భాల్లోనే కాదు, కష్ట కాలాల్లోనూ ఒకరికి ఒకరు అండగా నిలవడం వీరి ప్రత్యేకతగా నిలిచింది.పండుగలు వచ్చినప్పుడల్లా ఈ మిత్రబృందం ఒకేచోట చేరి సంబరాలు జరుపుకోవడం సంప్రదాయంగా మారింది. హోలీ సందర్భంగా రంగులు చల్లి ఆనందోత్సాహాలతో వేడుకలు నిర్వహిస్తారు. వినాయక చవితి వేళ గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. విజయదశమి రోజున ఆయుధపూజలు చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేస్తారు. దీపావళి సందర్భంగా గ్రామం అంతా దీపాలతో ప్రకాశింపజేస్తూ ఉత్సాహంగా వేడుకలు జరుపుతారు. సంక్రాంతి పండుగను కుటుంబ సమేతంగా భోగి మంటలతో ప్రారంభించి, ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం చేసి కొత్త ఆశయాలకు శ్రీకారం చుడతారు.ప్రతి సంవత్సరం ఒక నిర్ణీత రోజున కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆట పాటల్లో పాల్గొనడం వీరి ఆనవాయితీగా మారింది. చిన్నారులతో కలిసి పండుగల సందడి పెంచుతూ గ్రామంలో ఐక్యతను చాటుతున్నారు. సమాజంలో స్నేహానికి కొత్త అర్థం తీసుకొచ్చిన ఈ బంధం గ్రామంలో విశేషంగా చర్చనీయాంశమైంది.నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ స్నేహ గాథ తరతరాలకు ఆదర్శంగా నిలుస్తోందని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. "స్నేహం అంటే ఇదే" అని ప్రశంసిస్తూ వీరి ఐక్యత చిరస్థాయిగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పుప్పాల శ్రీనివాస్ గౌడ్, తెప్ప శ్రీనివాసులు, జి. శ్రీనివాసులు, ఎండి జహంగీర్, ఎండి సుల్తాన్, గోవిందు రాము, లక్ష్మయ్య, జి. పద్మారావు, బి. నరసింహులు, గోవిందు రామకృష్ణ, గోవిందు జగదీష్, శేఖర్, బాలరాజ్, జ్ఞానేశ్వర్, కొంకలి యాదగిరి, జి. నాగరాజుగౌడ్, జి. నాగన్న గౌడ్, అనిల్ కుమార్, రాందాస్, వెంకటేష్, గోవిందు నరహరి, కృష్ణ కిరణ్, కిషోర్, బాలస్వామి, ఐల రవీందర్ రెడ్డి, లోకేష్, మైబూస్, శేఖర్, నిరంజన్, శ్రీనివాసులు, వెంకటేష్, ప్రదీప్, వెంకటకృష్ణ, అభిలాష్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటికే భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర కళ్యాణ తలంబ్రాలు....

### భక్తులకు తెలంగాణ పోస్టల్ సర్కిల్ ప్రత్యేక సేవ...

ఓదెల//**మార్చి 04 (ఆకాంక్ష) :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో మార్చి 27, 2026న వైభవంగా నిర్వహించనున్న శ్రీరామ నవమి మహోత్సవాల సందర్భంగా జరిగే శ్రీ సీతారామచంద్ర స్వామివారి దివ్య కళ్యాణోత్సవానికి సంబంధించిన పవిత్ర కళ్యాణ తలంబ్రాలను భక్తుల గృహ ద్వారాలకు అందించే ప్రత్యేక సేవను తెలంగాణ పోస్టల్ సర్కిల్ ప్రకటించింది. ఈ సేవతో భద్రాద్రికి ప్రత్యక్షంగా వెళ్లలేని భక్తులకు స్వామివారి ప్రసాదం ఇంటికే చేరనుంది.ప్రతి సంవత్సరం భద్రాచలంలో జరిగే శ్రీరామ నవమి కళ్యాణోత్సవం దేశవ్యాప్తంగా అపార భక్తి శ్రద్ధలతో జరుగుతుంది. వేలాది మంది భక్తులు కళ్యాణ మహోత్సవాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు తరలివెళ్తారు. అయితే దూర ప్రాంతాల్లో నివసించే వారు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు లేదా ఇతర కారణాల వల్ల భద్రాద్రికి చేరుకోలేని భక్తులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక సేవను ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.తెలంగాణ ఎండోమెంట్స్ శాఖ సహకారంతో రాష్ట్రంలోని అన్ని పోస్టాఫీసుల ద్వారా కళ్యాణ తలంబ్రాల బుకింగ్ సదుపాయం కల్పించారు. భక్తులు తమ సమీప పోస్టాఫీసులో నిర్దేశిత రుసుము చెల్లించి తలంబ్రాలను బుక్ చేసుకోవచ్చు. కళ్యాణోత్సవం అనంతరం పవిత్ర తలంబ్రాలను స్పీడ్ పోస్టు ద్వారా భక్తుల నివాసాలకు నేరుగా పంపిణీ చేయనున్నారు.సేవ వివరాల ప్రకారం అంత్రాలయ అర్చన కళ్యాణ తలంబ్రాల ప్యాకెట్‌లో ఒక ముత్యం, కుంకుమ, మిశ్రీ, కాజు గింజలు ఉండగా, దీని ధర రూ. 450గా నిర్ణయించారు. అలాగే ముత్యాల తలంబ్రాలు (ఒక ముత్యం) ధర రూ. 151గా నిర్ణయించారు. భక్తుల విశ్వాసాన్ని దృష్టిలో ఉంచుకుని పారదర్శకంగా, సమయానికి ప్రసాదం చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తపాలా శాఖ అధికారులు వెల్లడించారు.భద్రాద్రికి వెళ్లలేని భక్తులకు ఈ సేవ ఒక సువర్ణావకాశమని, ఇంటి వద్ద నుంచే స్వామివారి కళ్యాణ తలంబ్రాలను స్వీకరించి పూజల్లో ఉపయోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ సేవను ఎక్కువ మంది భక్తులు వినియోగించుకోవాలని వారు కోరారు.జమ్మికుంట సబ్ డివిజన్ తపాలా శాఖ ఇన్స్పెక్టర్ ఏ. మోహన్, పొత్కపెల్లి సబ్ పోస్ట్ మాస్టర్ డి. మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోస్టాఫీసుల్లో బుకింగ్ సదుపాయం అందుబాటులో ఉందని, భక్తులు ముందుగానే నమోదు చేసుకుంటే ప్రసాదం సమయానికి అందుతుందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని ముద్రిత మరియు ఎలక్ట్రానిక్ మీడియాను వారు కోరారు.

## నాలుగు దశాబ్దాలుగా విడదీయరాని స్నేహబంధం..

### పాలెం గ్రామం ఆదర్శం..




నాగర్ కర్నూల్ టౌన్//**మార్చి 04 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ జిల్లాలోని బిజినేపల్లి మండలం పాలెం గ్రామంలో నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న అరుదైన స్నేహబంధం గ్రామస్థుల ప్రశంసలు అందుకుంటోంది. బాల్యం నుంచే కలిసి పెరిగిన మిత్రబృందం 40 సంవత్సరాలుగా ఒకరికి ఒకరు అండగా నిలుస్తూ ఆదర్శంగా నిలిచారు. పాఠశాల దశలో ప్రారంభమైన ఈ స్నేహం కాలక్రమేణా మరింత బలపడింది. హోలీ, వినాయక చవితి, విజయదశమి, దీపావళి, సంక్రాంతి, ఉగాది వంటి ప్రతి పండుగను కలిసి జరుపుకోవడం వీరి ప్రత్యేకత.పండుగల సమయంలో కుటుంబ సమేతంగా పాల్గొని గ్రామంలో ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తున్నారు.సంతోష సమయంలోనూ, కష్టకాలంలోనూ పరస్పరం తోడ్పాటు అందించుకుంటూ గ్రామ యువతకు ఆదర్శంగా మారారు. ప్రతి సంవత్సరం ఒకేచోట కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ స్నేహబంధాన్ని మరింత బలపరుచుకుంటున్నారు.ఈకార్యక్రమంలో పుప్పాల శ్రీనివాస్ గౌడ్, తెప్ప శ్రీనివాసులు, జి శ్రీనివాసులు, ఎండి జహంగీర్, ఎండి సుల్తాన్, గోవిందు రాము, లక్ష్మయ్య, జి పద్మారావు, బి నరసింహులు, గోవిందు రామకృష్ణ, గోవిందు జగదీష్, శేఖర్, బాలరాజ్, జ్ఞానేశ్వర్, కొంకలి యాదగిరి, జి నాగరాజుగౌడ్, జి నాగన్న గౌడ్, అనిల్ కుమార్, రాందాస్, వెంకటేష్, గోవిందు నరహరి, గోపాల్, యుగేందర్, కృష్ణ కిరణ్, కిషోర్, బాలస్వామి, ఐల రవీందర్ రెడ్డి, లోకేష్, మైబూస్, శేఖర్, నిరంజన్, శ్రీనివాసులు, వెంకటేష్, ప్రదీప్, వెంకటకృష్ణ, అభిలాష్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'పై

## కలెక్టర్ బాదావత్ సంతోష్ కఠిన హెచ్చరిక....



నాగర్ కర్నూల్//**మార్చి 04 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రభుత్వం చేపట్టనున్న 99 రోజుల "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమ అమలులో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం సహించబోదని, అలసత్వం ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మార్చి 6వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించనున్న ఈ ప్రత్యేక కార్యక్రమంపై బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు తదితరులతో కలిసి జిల్లా స్థాయి అధికారులతో కార్యక్రమ అమలు విధానంపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా రూపుదిద్దుకున్న ఈ 99 రోజుల కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాలు, ప్రజా సేవలు వేగవంతంగా అందించాలని సూచించారు. ప్రతి శాఖకు కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే క్లియర్ చేయాలని, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్లను పూర్తిగా పరిష్కరించాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.రోజువారీగా నిర్వహించే కార్యక్రమాలపై పకడ్బందీ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. అధికారుల సమయ పాలన అత్యంత కీలకమని, కార్యాలయాలకు సమయానికి హాజరుకాని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తమ శాఖల పురోగతిపై నివేదికలు సమర్పించారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నమూనాగా నిలిపేలా సమష్టి కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమ అమలులో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోదని మరోసారి స్పష్టం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.




## దొంగతుర్తి వేంకటేశ్వర స్వామి రథోత్సవంలో మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల...



పెద్దపల్లిటౌన్//**మార్చి 04 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మి గోదా సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల భాగంగా బుధవారం నిర్వహించిన స్వామివారి రథోత్సవం కనులపండువగా జరిగింది. ఈ వేడుకలకు పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య మల్లేశ్వరి దంపతులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన చైర్మన్ దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. వేదమంత్రాల మధ్య స్వామివారి రథాన్ని లాగి భక్తులతో కలిసి ఉత్సవంలో పాల్గొన్నారు. రథోత్సవం సందర్భంగా గ్రామం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.గ్రామ సర్పంచ్ కొడారి మంగ హనుమాన్ ఆధ్వర్యంలో చైర్మన్ మల్లయ్య దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించి, స్వామివారి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మల్లయ్య మాట్లాడుతూ స్వామివారి కృపతో ప్రజలు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని, బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న గ్రామస్తులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రథోత్సవం విజయవంతంగా ముగియడంతో గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

## నాగర్ కర్నూల్ జిల్లాలో సజ్జద్ అలీ సేవలు మరువలేనివి...



నాగర్ కర్నూల్ టౌన్//**మార్చి 04 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ జిల్లాలో భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ మేనేజర్ సజ్జద్ అలీ అందించిన సేవలు మరువలేనివని జిల్లా టీబీ సూపర్వైజర్లు తెలిపారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, సజ్జద్ అలీ బదిలీ కావడం బాధాకరమని పేర్కొన్నారు. కేవలం పది నెలల కాలంలోనే జిల్లాలో అనేక క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. అతి తక్కువ సమయంలోనే అహర్నిశలు శ్రమించి క్షయవ్యాధి నిర్మూలనకు విశేష కృషి చేశారని ప్రశంసించారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి నాయక్, క్షయవ్యాధి నిర్మూలన జిల్లా అధికారి డాక్టర్ రఫిక్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాల ఫలితంగా రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ క్షయవ్యాధి నిర్మూలన కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టి లక్ష్యసాధన దిశగా కృషి చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా సజ్జద్ అలీకి శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో భవిష్య భారత్ సిబ్బంది శ్రీకాంత్‌తో పాటు క్షయవ్యాధి నిర్మూలన సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## నగరంలో మరో కల్తీ నెయ్యి తయారీ కేంద్రం గుట్టు రట్టు...

### సుమారు రూ.18.26 లక్షల విలువజేసే కల్తీ నెయ్యి ,తయారీ సామాగ్రిని స్వాధీనం...



హైదరాబాద్//**మార్చి 04 (ఆకాంక్ష) :** నగరంలో మరో కల్తీ నెయ్యి తయారీ కేంద్రం గుట్టు బట్టబయలయ్యింది. కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ (గోల్కొండ టీమ్), మాసబ ట్యాంక్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో బంజారాహిల్స్ పరిధి భోలానగర్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న 'ఫ్రైడ్ డెయిరీ' కల్తీ నెయ్యి తయారీ కేంద్రం వెలుగు చూసింది. సుమారు రూ.18.26 లక్షల విలువజేసే కల్తీ నెయ్యి మరియు తయారీ సామాగ్రిని స్వాధీనం చేసుకుని తయారీకేంద్రాన్ని పోలీసులు సీజ్ చేశారు. భోలానగర్‌కు చెందిన జునైద్ హుస్సేన్ తన ఫ్రైడ్ డెయిరీ యూనిట్‌లో లైసెన్స్ కలిగి ఉన్నప్పటికీ అక్రమ సంపాదన కోసం ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతూ ఈ కల్తీ నెయ్యి కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. తక్కువ నాణ్యత కలిగిన పామాయిల్, వనస్పతి (డాల్డా), ఇతర హానికరమైన పదార్థాలను ఆవు,గేదె మీగడలో కలిపి కల్తీ నెయ్యిని తయారు చేస్తుండటంతో సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. తయారు చేసిన ఈ కల్తీ నెయ్యిని అసలైన నెయ్యిగా నమ్మిస్తూ ప్రజలకు,హోటళ్లకు, శుభకార్యాల నిర్వాహకులకు విక్రయిస్తున్నారు. పోలీసులు తనిఖీల్లో రూ.18.26 లక్షల విలువజేసే ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 460 కేజీల కల్తీ నెయ్యి, 70 కేజీల కల్తీ మిశ్రమ నెయ్యితో పాటు భారీస్థాయిలో కల్తీకి ఉపయోగించే 2090 కేజీల ఆవు మీగడ,1170కేజీల గేదె మీగడ స్వాధీనం చేసుకున్నారు. నగర అడిషనల్ డిసిపి(టాస్క్‌ఫోర్స్) అందె శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో గోల్కొండ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఆర్ వెంకటేశ్,మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్,ఎస్‌ఐలు విజయానంద్,చందన తదితరులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

### వేసవి కాలం దృష్ట్యా ఒకేసారి మూడు నెలలకు

## సరిపడా రేషన్ బియ్యం పంపిణీ....

### ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన బియ్యాన్ని ఏప్రిల్ నెలలోనే పంపిణీ....

### కేంద్ర ప్రభుత్వం నిర్ణయం.. రాష్ట్రాలకు కేంద్ర పౌర సరఫరాల శాఖ లేఖలు...



న్యూఢిల్లీ//**మార్చి 04 (ఆకాంక్ష) :** రేషన్‌కార్డు లబ్ధిదారుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వేసవి కాలం దృష్ట్యా ఒకేసారి మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఏప్రిల్, మే, జూన్ (మూడు నెలలకు) సంబంధించిన బియ్యాన్ని ఏప్రిల్ నెలలోనే పంపిణీ జరిగేలా చూడాలని రాష్ట్రాలకు కేంద్ర పౌర సరఫరాల శాఖ లేఖలు రాసింది. మార్చి మొదటి వారంలోనే ఎండలు మండిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే రాబోయే ఎండలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా తెలంగాణలో రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. ఒక్కో లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. రాష్ట్రంలో దాదాపుగా ఫుడ్ సెక్యూరిటీ కార్డులు కోటికి పైగా ఉన్నాయి. ఒకేసారి మూడు నెలలకు సరిపడా కోటా ఇవ్వాలని కేంద్రం సూచించడంతో ఆ మేరకు సరిపడా బియ్యం కోటా నిలువలు, సాధ్యాసాధ్యాలను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. బియ్యం నిల్వ చేసే సామర్థ్యం లేకపోవడంతో ఒకేసారి మూడునెలల కోటా పంపిణీ చేయాలని కేంద్రం యోచిస్తుండగా గత అనుభవాల దృష్ట్యా అనేక సమస్యలు సైతం ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. గతేడాది వర్షాకాలంలో ఒకే దఫా మూడు నెలల కోటాను పంపిణీ చేశారు. ఆ సమ యంలో ఇటు లబ్ధిదారులు, రేషన్ డీలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మూడు నెలల బియ్యం కోటా ఒకేసారి పంపిణీ చేయడం ద్వారా రవాణా ఛార్జీల ఖర్చు తగ్గనుండటంతో పాటు డీలర్లు, హమాలీ కూలీ కలిసొచ్చే అవకాశముంది. కానీ, ఆ బియ్యం నిల్వ చేసే సామర్థ్యం లేకపోవడంతో డీలర్లకు సమస్యగా మారింది. ఇక మూడు నెలలకు సంబంధించి ఒక్కో కార్డుదారుడు 3 సార్లు వేలి ముద్ర వేయాల్సి ఉంది. దీనికి తోడు సర్వర్ సమస్యలతో ఒక్కో కార్డుకు దాదాపు 1,5-20 నిమిషాల సమయం పట్టే అవకాశం ఉంది. ఈ సమస్యల గురించి అధికారులు ఆలోచిస్తున్నారు.